V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

శుక్రవారం
30-08-2024

సంపుటి : 01 । సంచిక : 118 । పేజీలు : 12 । వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




డా॥ కొచం సత్యనారాయణ
CMD



# ఎంపీ నిధుల నుంచి హైడ్రాకు రూ.25 లక్షలు

- కొందరు నాయకులు కావాలని రాజకీయాలు చేస్తున్నారు
- హైడ్రాకు ఆర్థిక సాయం చేసిన ఎంపీ అనిల్ కుమార్ యాదవ్



**విశ్వంభర, హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై ఉక్కు పాదం మోపుతున్న హైడ్రాకు రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ తన ఎంపీ నిధుల నుంచి 25 లక్షల గురువారం అందజేశారు. బుద్ధభవన్ లో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ను కలిసిన నిధులను అందజేశారు. హైడ్రా పనితీరుపై హర్షం వ్యక్తం చేస్తూ ఈ నిధులను అందజేస్తున్నట్లు అనిల్ కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. రూ.25 లక్షలు కేటాయిస్తూ లేఖను కమిషనర్ రంగనాథ్ కు అందజేశారు. హైదరాబాద్ నగరంలోనీ చెరువులు కాపాడేందుకు సీఎం రేవంత్ రెడ్డి హైడ్రా ఏర్పాటు చేసి. దానికి కమిషనర్ గా మంచి అధికారిగా పేరున్న రంగనాథ్ నియమించడం ఒక శుభ పరిణామంగా అనిల్ పేర్కొన్నారు. పదేళ్లు అధికారంలో అన్న కేసిఆర్ హైదరాబాద్ మహానగరంగా దిద్దుతామంటూ ఉత్తుత్తి ప్రకటనలు చేసి ప్రజలను మోసం చేశారన్నారు.కానీ హైదరాబాద్ లోని అన్ని చెరువులు కబ్జాకు గురవుతున్న పట్టించుకోలేదని విమర్శించారు. కనీసం ఒక్క చెరువును కూడా కాపాడలేక పోయారని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డి భవిష్యత్ తరాల గురించి అలోచించి, హైదరాబాద్ అద్భుతమైన నగరంగా ఉండాలని కీలక నిర్ణయం తీసుకున్నా రణ ఎంపీ అనిల్ పేర్కొన్నారు. రాజకీయాల కోసం హైడ్రా అని కొందరు విమర్శలు చేస్తున్న వారంతా ఇది హైదరాబాద్ అభివృద్ధి కోసమే నన్న విషయాన్ని గుర్తించాలని సూచించారు.అనేక నగరాల్లో నీటి కొరత ఏర్పడుతుందని, అలాంటి సమస్య హైదరాబాద్ నగరానికి రావద్దని, సీఎం హైడ్రాను ఏర్పాటు చేశారని వివరించారు. హైడ్రా ను ఇతర జిల్లాలలో కూడా అమలు చేయాలని వినతులు ప్రభుత్వానికి రావటం ఒక మంచి పరిణామని, జిల్లాలకు హైడ్రా విస్తరించాలని, హైడ్రా కు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు.

# నేడు, రేపు పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం

**విశ్వంబర హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్ వాసుల దాహార్తిని తీర్చేజలమండలి ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ డివిజన్2 (బి), బాలాపూర్ రిజర్వాయర్ పరిధిలోని గుర్రం చెరువు నుంచి సన్నీ గార్డెన్స్ వరకు జిహెచ్ఎంసి, ఎస్ఎండిపి బాక్స్ డ్రెయిన్ నిర్మాణం పనులు జరుగుతున్న కారణంగా శుక్ర, శనివారం రెండు రోజుల్లో పలు ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని జలమండలిలో ప్రకటన తెలిపింది.

బాక్స్ డ్రెయిన్ నిర్మాణానికి ఇబ్బందులు కలగకుండా బాలాపూర్ రిజర్వాయర్ అవుట్ లెట్ 450 ఎంఎం డయా పైపు లైన్ డైవర్షన్ పనులు కూడా చేపట్టనున్నట్లు తెలిపింది. ఈ పనులు 30వ తేదీ శుక్రవారం రాత్రి 9 గంటల నుంచి మరుసటి రోజు అనగా 31వ తేదీ శనివారం రాత్రి 9 గంటల వరకు జరుగుతాయని, 24 గంటల వ్యవధిలో కింద పేర్కొన్న బాలాపూర్ రిజర్వాయర్ పరిధిలోని ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జలమండలి స్పష్టం చేసింది.

### అంతరాయం కలిగే ప్రాంతాలు...

ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ డివిజన్ 2బి లోని రాజా నరసింహ కాలనీ, ఇందిరా నగర్, పిసల్ బండా, దర్గా బురాన్షాహి, గాజీమిల్లత్, జిఎంచౌని, లలితా బాగ్, ఉప్పుగూడ, డి ఎం ఆర్ ఎల్, డిఎల్ఆర్ఎల్, గారిసన్ ఇంజినీర్ 1 & 2, డి ఆర్ డి ఓ ,మిధాని, ఒవైసీ హాస్పిటల్, బీడీఎల్, సిఆర్పిఎఫ్, కేంద్రీయ విద్యాలయం, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ డివిజన్-2ఏ పరిధిలోని హస్నాబాద్, ఖలందానగర్, సంతోష్ నగర్ పాత కాలనీ,న్యూ కాలనీ, యాదగిరి కమాన్ ఎదురుగా ఉన్న ప్రాంతం, ఎం ఐ జి హెచ్, హెచ్ఐజిహెచ్, ఎల్ఐజిహెచ్ కాలనీలు, ఫహబా మసీదు, మారుతీ నగర్, పోచమ్మ గడ్డ, హనుమాన్ టైలర్ గల్లి, ఓ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ డివిజన్-10 ఏ పరిధిలోని బాబా నగర్, మక్బూల్ నగర్, జీఎం నగర్, క్వాద్రీ కాలనీ ప్రాంతాల్లోని నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని, ఈ విషయాన్ని గుర్తించి వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోగలరని జలమండలి విజ్ఞప్తి చేసింది.



**జనగామ కలెక్టర్ ఆఫీసులో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మని మర్యాద పూర్వకంగా కలిసిన బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్, రెడ్ క్రాస్ సొసైటీ లైఫ్ మెంబర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్త. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మన్, గవర్నర్ తెలంగాణ ప్రభుత్వం గారికి జనగామ జిల్లా కేంద్రంలో రెడ్ క్రాస్ సోసైటీకి బిల్డింగు మంజూరు చేయాలని వినితి పత్రం ఇచ్చారు.**

**- విశ్వంభర, జనగామ**

# చాయ్ ఘర్ ప్రారంభోత్సవం




**విశ్వంభర, వనస్థలిపురం :** విజయవాడ హైవే లెక్చరర్స్ కాలనీ హయత్ నగర్లో హెచ్డీఎఫ్సీ బ్యాంకు ప్రక్కన చాయ్ ఘర్‌ను జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నరసింహారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పరిసర ప్రాంత ప్రజలకు చక్కటి రుచికరమైన ఇంటి తరహాలో ఉండే విధంగా చాయ్ అందిస్తున్న యాజమాన్యాన్ని అభినందించారు. నిర్వాహకులు సత్యం గౌడ్ కొప్పుల నరసింహారెడ్డిని శాలువాతో సత్కరించాడు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మనసురాబాద్ డివిజన్ అధ్యక్షుడు సంపత్ గౌడ్, ఎల్లారెడ్డి సాయిరాం గౌడు, చింటూ మింటూ, రామేశ్వర్ డివిజన్ అధ్యక్షుడు పొరంద సాయి, యాదగిరి యాదవ్, శ్యాంసుందర్ రెడ్డి, ప్రవీణ్ గౌడ్ పాల్గొన్నారు.

# బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చబుత్ర మిషన్

**విశ్వంభర, బాలాపూర్ :** బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 15 రోజుల వ్యవదిలో రెండు హత్యలు జరిగిన నేపథ్యంలో యువత పెడ దారిన పడకుండా ఉండటానికి వారిని ఎలా దారిలో పెట్టాలని రాచకొండ కమిషనర్ ఆదేశాల మేరకు మహేశ్వరం డీసీపీ సునీత రెడ్డి నేతృత్వంలో బాలాపూర్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ మదు ఆధ్వర్యంలో చబూత్ర మిషన్, నైట్ పెట్రోలింగ్ బాలాపూర్ పరిధిలో నిర్వహించారు. దీనిలో భాగంగా బాలాపూర్ పరిధిలోని షహీన్ నగర్, బిస్మిల్లాహ్ కాలనీ, వాదీ ఏ ఒమర్, వాదీ ఏ షాలేహీన్, క్కుబ కాలనీ, స్మశాన వాటికలలో తనికులు నిర్వహించారు.



కొందరిని అదుపులోకి తీసుకొని కౌన్సిలింగ్, మరికొందరికి వర్కింగ్ ఇచ్చారు. కొన్ని షాప్‌లకు నోటీసులు ఇస్తూ వారికి జరిమాన విదించారు. మద్యం బాబులు, గంజా పిలుస్తునవారు అని గుర్తించి వారికీ కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందని డీఐ తెలిపారు. డీఐ మధు కౌంసిల్కింగ్ చేస్తూ ఎవరైనా అనుమానస్పందంగా కనిపించిన చెడ్డ సాహసాలు పట్టిన తల్లీ తండ్రులు వెంటనే 100కు డైల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# సొంత నిధులతో రోడ్డు మరమ్మతులు చేయించిన వార్డు ఇన్‌చార్జ్



**విశ్వంభర, పరిగి :** మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డు సాయిరాం నగర్ కాలనీలో రోడ్డు గుంతల మయంగా ఉండడంతో గత కొన్ని రోజులుగా వర్షం నీరు రోడ్డుపై నిలిచి అటు నుంచి వెళ్లే ప్రయాణికులకు, కాలనీవాసులకు ఇబ్బందికరంగా మారింది. కాలనీవాసులు పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ వార్డు ఇన్చార్జ్ ఎజాజ్ దృష్టికి తీసుకు వెళ్లడంతో వెంటనే స్పందించి గురువారం సొంత ఖర్చులతో గుంతల్లో మొరం వేయించి మరమ్మతులు చేయించారు. దీంతో అతని పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎజాజ్ మాట్లాడుతూ.. పరిగి మున్సిపాలిటీ పరిధిలోని మూడవ వార్డులో ఎలాంటి సమస్యలున్న తమ దృష్టికి తీసుకురావాలని స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు అనిల్, నాగరాజు, కాలనీవాసులు పాల్గొన్నారు.






# నాటు తుపాకులు తయారీదారుడితో సహా ముగ్గురు అరెస్ట్

**వివరాలు వెల్లడించిన ఎస్పీ అఖిల్ మహాజన్**



**విశ్వంభర, రాజన్న సిరిసిల్ల :** నాటు తుపాకులు తయారు చేస్తున్న వ్యక్తితో సహా, అవి కొనుగోలు చేసిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్పీ అఖిల్ మహాజన్ విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామానికి చెందిన రాయలింగు శంకర్ వయస్సు 40 సంవత్సరాలు తండ్రి నర్సయ్య అనే వ్యక్తి నాటు తుపాకులు తయారు చేసి వాటిని అదే గ్రామానికి చెందిన అడవి జంతువులను వేటాడే వారికి అమ్ముతున్నాడన్నా నమ్మదగిన సమాచారం రాగా గంభీరావుపేట ఎస్.ఐ ఈరోజు తన సిబ్బందిని తీసుకొని గజసింగవరం గ్రామంలోని రాయలింగు శంకర్ ఇంటికి వెళ్ళగా అక్కడ రాయలింగు శంకర్ వివిధ పనిముట్ల ఉపయోగించి నాటు తుపాకులు తయారు చేస్తుండగా పట్టుకొని, అతని వద్ద రెండు తుపాకి బ్యారెల్, తుపాకుల తయారు చేయడానికి వాడే రంపము, సుత్తి, కత్తి, ఆకు రాయి, డ్రిల్లింగ్ మిషన్, దూగడ మిషన్, ఎయిర్ బుల్లోజర్ స్వాధీనం చేసుకొని నిందుతుడిపై కేసు నమోదు చేశారు. ఎల్లారెడ్డిపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ కేసు తదుపరి దర్యాప్తులో భాగంగా గజసింగవారం గ్రామానికి చెందిన రాయలింగు శంకర్ వద్ద నాటు తుపాకులు కొనుగోలు చేసి జంతువుల వేటకు ఉపయోగిస్తున్న గజసింగవరం గ్రామానికి చెందిన రాయలింగం చంద్రమౌళి, వయస్సు 40 సంవత్సరాలు, తండ్రి అంజయ్య, శాతవేణిహరీష్, వయస్సు 27 సంవత్సరాలు, తండ్రి నారాయణ, లోగిడి గంగయ్య వయస్సు 45 సంవత్సరాలు, తండ్రి నర్సయ్య లను అదుపులోకి తీసుకొని వారి వద్ద రెండు తుపాకులు నాలుగు ట్రిగర్ భాగాలు స్వాధీనం చేసుకొని నలుగురు నిందుతులను గురువారం రిమాండ్‌కి తరలించినట్లు తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించి నింధుతులను అరెస్ట్ చేసిన ఎల్లారెడ్డిపేట్ సీఐ శ్రీనివాస్, గంభీరావుపేట ఎస్ఐ రామ్మోహన్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సమావేశంలో డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు రామ్మోహన్, రమాకాంత్ పాల్గొన్నారు.







www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
శుక్రవారం
30-08-2024
సంపుటి : 01 | సంచిక : 118 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్


డా॥ కాచం సత్యనారాయణ CMD

## రాష్ట్రంలో పెసర కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించండి

**మార్క్ ఫెడ్ అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశాలు**



**విశ్వంభర, హైదరాబాద్ :** రాష్ట్రంలో పెసర పంటను పండించిన రైతులకు మద్దతు ధర లభించేవిధంగా మార్క్ ఫెడ్ ద్వారా రేపటి నుంచి మిగతా5లో...

## అణు జలాంతర్గామి.. ఐఎన్ఎస్ అరిఘాత్' జాతికి అంకితం

- భారత నౌకాదళం మరో మైలురాయి
- దేశీయంగా అభివృద్ధి చేసిన సాంకేతిక వ్యవస్థలు
- మన శక్తిసామర్థ్యాలకు, శాస్త్రజ్ఞుల ప్రతిభకు నిదర్శనం
- భారత రక్షణశాఖ మంత్రి రాజ్నాథ్ సింగ్


05



## హైదరాబాద్ ప్రతిష్ట పెంచేలా
# గణేశ్ ఉత్సవాలు

**అనుమతులు తీసుకున్న మండపాలకు ఉచిత విద్యుత్**

అధికారులు, మండప నిర్వాహకులు సమన్వయంతో ముందుకు సాగాలి

గణేశ్ ఉత్సవ సమితి సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

సుప్రీంకోర్టు నిబంధనలను పరిగణనలోకి తీసుకోవాలని సూచన

**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ తొలి నుంచి మత సామరస్యానికి, ప్రశాంతతకు పేరు పొందిందని, ఆ ఇమేజ్‌ను మరింత పెంచేలా గణేశ్ ఉత్సవాల నిర్వహణ ఉండాలని, ఇందుకోసం ఉత్సవ కమిటీలు, మండప నిర్వాహకులు, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. గణేశ్ ఉత్సవాల నిర్వహణపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూడు ప్రధాన అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. మండపాల ఏర్పాటు, తొమ్మిది రోజుల ఉత్సవాల నిర్వహణ, నిమజ్జనానికి సంబంధించి మండప నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వం తరపున పోలీసు, జీహెచ్ఎంసీ, ఆర్ అండ్ బీ, నీటి పారుదల శాఖ, విద్యుత్ శాఖతో పాటు ఇతర ముఖ్య శాఖల అధికారులు సైతం మండప నిర్వాహకులతో సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఎక్కడ ఎటువంటి లోటుపాట్లకు తావివ్వద్దని హెచ్చరించారు. జోన్ల వారీగా ఉన్నతాధికారులకు బాధ్యతలు మిగతా8లో...

## కవిత పాదాభివందనం.. కేసీఆర్ ఆలింగనం



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన కుమార్తె కవితను చూడగానే భావోద్వేగానికి లోనయ్యారు. తిహాడ్ జైలు నుంచి విడుదలై హైదరాబాద్ చేరుకున్న కవిత గురువారం తన తండ్రి కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా తండ్రి పాదాలకు నమస్కరించారు. కేసీఆర్ బిడ్డను ఆప్యాయంగా గుండెలకు హత్తుకుని ఆశీర్వదించారు. కవిత తన భర్త, కుమారుడితో కలిసి గురువారం మధ్యాహ్నం ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా కవితకు దిష్టి తీసి స్వాగతం పలికారు. అక్రమ నిర్బంధం నుంచి బయటకొచ్చిన బిడ్డను చూడగానే కేసీఆర్ ముఖంలో ఆనందం కనిపించింది. చాలాకాలం తర్వాత కేసీఆర్ ఉత్సాహంతో ఉన్నారు. తమ అధినేత సంతోషంలో పార్టీ నాయకులు, సిబ్బంది భాగస్వాములయ్యారు. కవిత రాకతో కేసీఆర్ నివాసంలో సంతోషం వెల్లివిరిసింది.

## ఎస్సీ ఎస్టీల జీవితాల్లో వెలుగులు నింపాలి

- ఆ స్ఫూర్తితోనే సబ్‌ప్లాన్ చట్టాన్ని అమలు చేయాలి
- ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు ప్రాధాన్యం
- దళిత ఆవాసాల్లో సౌకర్యాలపై దృష్టి పెట్టాలి
- సమీక్ష సమావేశంలో ఆదేశించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**విశ్వంభర, హైదరాబాద్:** ఎస్సీ ఎస్టీ ల జీవితాల్లో వెలుగులు నింపేలా... సబ్ ప్లాన్ చట్టం స్ఫూర్తిని కొనసాగించే విధంగా అధికారుల పని విధానం ఉండాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దిశానిర్దేశం చేశారు.. చట్టం అమలుకు మేధోమథనం చేసి యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సూచించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర మిగతా5లో...

## ఫోర్త్ సిటీ పేరుతో ప్రభుత్వ భూములు కొల్లగొట్టే కుట్ర


05

- సమయం వచ్చినప్పుడు అన్ని వివరాలు బయటపెడతా
- మాజీ మంత్రి హరీశ్‌రావు సంచలన ఆరోపణలు

## సీఎం హోదాలో ఉండి ఇలాగేనా మాట్లాడేది?

- కవిత బెయిల్ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు సీరియస్
- సీఎం ప్రవర్తన ఇలాగే ఉంటే ఓటుకు నోటు కేసును రాష్ట్రం బయటే విచారిస్తామని హెచ్చరిక



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** బీఆరెస్ ఎమ్మెల్సీకవిత బెయిల్ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఓటుకు నోటు కేసు విచారణ సందర్భంగా కవిత బెయిల్ విషయంలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు . ఈ విషయంపై స్పందించిన న్యాయస్థానం.. బాధ్యత గల స్థానంలో ఉన్న వ్యక్తి కోర్టు తీర్పును ఎలా మిగతా5లో...


హైడ్రాకు మరిన్ని అధికారులను కేటాయించే విషయంపై ఉన్నతాధికారులతో సచివాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న చీఫ్ సెక్రటరీ శాంతి కుమార

## హైడ్రాకు మరిన్ని అధికారాలు

త్వరలో మరింత మంది సిబ్బంది. యంత్ర సామగ్రి

యాక్షన్ ప్లాన్ రూపకల్పనపై సీఎస్ సమావేశం

**విశ్వంభర, హైదరాబాద్ :**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టి సామాన్యులను మోసం చేస్తున్న వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న హైడ్రాకు త్వరలోనే మరిన్ని అధికారాలు, అదనపు మ్యాన్ పవర్, మిషనరీని సమకూర్చరున్నట్లు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి వెల్లడించారు. చెరువుల ఆక్రమణల తొలగింపు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణపై గత కొన్ని రోజులుగా మిగతా5లో...

## సీఎం సోదరుడికి హైడ్రా నోటీసులు

**దుర్గం చెరువు, కావూరి హిల్స్ ఆక్రమణలపై దృష్టి**

**నా ఇల్లు అక్రమమైతే కూల్చివేయండి: తిరుపతి రెడ్డి**



**విశ్వంభర, హైదరాబాద్:** గ్రేటర్ పరిధిలోని ట్రై సిటిలో ఉన్న ప్రభుత్వ ఆ భూములు చెరువులు కుంటాలు నాలాలను కబ్జా చేసి నిర్మితమైన అక్రమ నిర్మాణాలపై హైడ్రా ఒక మిగతా5లో...

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి



**నేటి చికెన్ ధరలు**

| | |
|---|---|
| ఫామ్ ధర ₹ 109 | రిటైల్ ₹ 131 |
| స్కిన్ ₹ 190 | స్కిన్ లెస్ ₹ 216 |



## విపత్తుల నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాం

**9 విభాగాలతో సమావేశం నిర్వహించిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో విపత్తులు సంభవించినప్పుడు వాటిని తట్టుకుని ప్రాణ నష్టం, ఆస్తి నష్టం తగ్గించడానికి, ఆకస్మికంగా ఎదురయ్యే పరిస్థితులను సైతం ఎదుర్కొనేలా విపత్తుల నిర్వహణ వ్యవస్థను (డిజాస్టర్ మేనేజ్మెంట్) బలోపేతం చేస్తున్నామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. మిగతా5లో...

## వద్దురా నాయనా.. కాంగ్రెస్ పాలన!

**రుణమాఫీ లేదు..రైతు భరోసా రాదు**

**ఇచ్చేది పక్కన పెట్టి వాపస్ డ్రామా: కేటీఆర్**



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:**

రుణమాఫీ చెయ్యలేక రేవంత్ సర్కార్ నయా డ్రామా షురూ చేసిందని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. వద్దురా నాయనా.. కాంగ్రెస్ పాలన, రుణమాఫీ లేదు, రైతు భరోసా లేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ రావడంతో రైతులకు మళ్లీ కష్టాలు వచ్చాయని పేర్కొన్నారు. రైతులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్కార్ మిగతా5లో...


05

## ప్రజాపాలనలో క్రీడలకు మంచిరోజులు

**ఆటగాళ్లను ప్రోత్సహించడమే మా పాలసీ**

**మంత్రి శ్రీధర్ బాబు**

**గచ్చిబౌలి స్టేడియంలో నేషనల్ స్పోర్ట్స్ డే వేడుకలు**

## అణు భౌతిక శాస్త్ర పితామహుడు

# రూథర్‌ఫోర్డ్

### నేడు (ఆగస్టు 30) జయంతి



ఎర్నెస్ట్ రూథర్‌ఫోర్డ్ (ఆగస్టు 30 1871 – అక్టోబరు 19 1937) న్యూజీలాండ్ కు చెందిన ఒక రసాయన శాస్త్రవేత్త. అణు భౌతిక శాస్త్ర పితామహుడు అనే బిరుదు పొందిన ఈయన రసాయన శాస్త్రంలో నోబెల్ బహుమతి (1908) పొందాడు. అణువులలో శక్తితో కూడిన కేంద్రకం ఉంటుందని కనిపెట్టాడు.

పరమాణువులో ఎలక్ట్రాన్, ప్రోటాన్, న్యూట్రాన్ అనే మూడు ముఖ్యమైన మూలకణాలున్నాయి. ఈ కణాలు పరమాణువులో ఏ విధంగా అమరి ఉన్నాయో తెలియజెప్పేదే పరమాణు నిర్మాణం. దీనికి సంబంధించి శాస్త్రవేత్తలు ఎన్నో నమూనాలను ప్రవేశపెట్టారు. అందులో రూథర్ ఫర్డ్ నమూనా ఒకటి. తను చేసిన- కణ పరిక్షేపణ ప్రయోగ పరిశీలనల ఆధారంగా ఈ నమూనాని ప్రతిపాదించాడు.

అణువు రూథర్‌ఫోర్డ్ నమూనా (లేదాగ్రహ మండల నమూనా, ఇదే సిద్ధాంతం ఆ తరువాత బోర్ నమూనా లేదా కక్ష్యా నమూనాగా ఏర్పడడానికి దోహదపడింది) ను ప్రతిపాదించాడు. ఇతడు రూథర్‌ఫోర్డ్-కణ పరిక్షేపణ ప్రయోగాన్ని బంగారు రేకు గుండా-కణ పరిక్షేపణ ప్రయోగంచేసి కెంద్రకం ఉనికిని కనిపెట్టాడు. ఇతడికి 1908లో రసాయనిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది.

న్యూజిలాండ్ లోని నెల్సన్ లో 1871 ఆగస్టు 30న జన్మించిన రూథర్‌ఫర్డ్ కు చిన్నతనంలోనే సైన్స్ పట్ల అభిరుచి కలిగింది. పదేళ్లకే ఎలిమెంటరీ ఫిజిక్స్ పుస్తకాన్ని క్షుణ్ణంగా చదివేశాడు. న్యూజిలాండ్ విశ్వ విద్యాలయంలో స్కాలర్‌షిప్‌తో చేరిన అతడు బీఏ, ఎమ్ఏ, బీఎస్సీ డిగ్రీలు సాధించాడు. ఇంగ్లండ్ లోని కేంబ్రిడ్జి విశ్వ విద్యాలయంలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేస్తూనే అత్యంత వేగంగా ప్రయాణించే విద్యుదయస్కాంత తరంగాలను కనిపెట్టి ప్రపంచ రికార్డు సాధించాడు. ఇరవై ఏడేళ్ల వయసులోనే కెనడాలోని మెగిల్ విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్‌గా చేరి పరిశోధనల్లో నిమగ్న మయ్యాడు. అక్కడే యురేనియం, థోరియంలాంటి రేడియోధార్మిక పదార్థాలు వెలువరించే ఆల్ఫా, బీటా వికిరణాలను ఆవిష్కరించాడు. రేడియో ధార్మిక విఘటనం (Radio active decay) నియమాలను ప్రతిపాదించాడు. ఒక రేడియో ధార్మిక పదార్థంలో ఉండే సగం పరమాణువులు విఘటనం చెందడానికి పట్టే 'అర్థ జీవిత కాలం' ను నిర్వచించాడు. ఈ సూత్రం ప్రకారం రేడియో డేటింగ్ పద్ధతి ద్వారక్వ భూమి వయస్సును కూడా కనుగొనవచ్చని చెప్పాడు. అలాగే కృత్రిమ మూలకాల పరివర్తన ద్వారా నైట్రోజన్‌ను, ఆక్సిజన్‌గా మార్చవచ్చని తెలిపాడు. ఈ పరిశోధనలకు 1908లో నోబెల్ బహుమతి అందుకున్నాడు.

కెనడా నుంచి ఇంగ్లండ్ తిరిగి వచ్చిన తర్వాత పలుచటి బంగారు రేకుపై ధనావేశమున్న ఆల్ఫాకిరణాలను ప్రసరింప చేసినప్పుడు 20000 కణాలలో ఒకటి వెనక్కి తిరిగి రావడాన్ని గమనించాడు. అందుకు కారణం పరమాణువులో ధనావేశమున్న కేంద్రకం ఉండటం కారణంగా కేంద్రకంలో ఉండే ప్రోటాన్లు వాటిని వికర్షించడమేనని కనుగొన్నాడు. సూర్యుడి చుట్టూ గ్రహాలు తిరుగుతున్నట్టే, పరమాణువుల్లోని కేంద్రకం చుట్టూ ఎలక్ట్రాన్లు తిరుగుతూ ఉంటాయని ప్రతిపాదించాడు. ఇదే రూథర్‌ఫర్డ్ పరమాణు నమూనాగా పేరొందింది. దీనినే గ్రహమండల నమూనా అంటారు. ఆ తర్వాత కేంద్రకంలో ప్రోటాన్లతో పాటు న్యూట్రాన్లు ఉంటాయని ఊహించాడు. రసాయన చర్యలతో ఒక మూలకాన్ని వేరొక మూలకంగా మార్చలేం. కానీ కేంద్రక చర్యలతో ఒక మూలకాన్ని మరొక మూలకంగా మార్చవచ్చు. స్థిరమైన మూలక కేంద్రకాలను - కణం లేదా ప్రోటాన్‌తో తాడించడం వల్ల వాటిని వేరొక మూలకాలుగా మార్చొచ్చు. ఈ ప్రక్రియను కృత్రిమ పరివర్తనం అంటారు. రూథర్‌ఫర్డ్ మొదటిసారిగా నత్రజనిని ఆక్సిజన్‌గా మార్చాడు. ఆ విధంగా ఏర్పడిన మూలకాలు కొన్ని రేడియో ధార్మికతను ప్రదర్శిస్తాయి. వాటిని రేడియో ఐసోటోపులు అంటారు. వాటిని మనం వైద్యరంగంలో, వ్యవసాయ రంగంలో, పరిశ్రమల్లో ఉపయోగిస్తున్నాం .ఆయన శిష్యుల్లో చాలా మంది నోబెల్ బహుమతులు సాధించడం విశేషం. అనేక అవార్డులు సాధించిన ఆయన గౌరవార్థం 104 అణుసంఖ్య ఉన్న మూలకానికి రూథర్ ఫోర్డియం అని పేరు పెట్టారు.


## వ్యాసాలు, కవితలకు ఆహ్వానం

**విశ్వంభర ఎడిటోరియల్ పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను, కవితలను ఆహ్వానిస్తున్నాం. ఈ కింది చిరునామాకు పోస్టులో లేదా ఈ-మెయిల్ ద్వారా పంపించగలరు. మీ వ్యాసం 1000 పదాలకు మించకుండా ఉండాలి. తెలుగు యునీకోడ్‌లో టైప్ చేసి పంపిన వాటికి ప్రాధాన్యం ఉంటుంది. రచయితలు విశ్వంభరకు మాత్రమే పంపుతున్నామని హామీపత్రం జత చేయాలి.**

**చిరునామా:**
V3 న్యూస్, విశ్వంభర తెలుగు దినప్రతిక కార్యాలయం, ప్లాట్ నంబర్ 204, రెండో అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నంబర్ 1560 ఎదురుగా, చైతన్యపురి ఎక్స్ రోడ్డు, హైదరాబాద్-500060

ఈ-మెయిల్: editpagevishwambhara@gmail.com
ఇతర వివరాలకు సెల్ నం: 9441222429 సంప్రదించగలరు.


## తెలుగు సాహితీ పరిశోధనా పితామహుడు

# వేటూరి ప్రభాకర శాస్త్రి

> "తెలుగు సాహిత్యానికి సక్రమమైన రూపం కల్పించి, ప్రజలందరికీ అందించే ప్రయత్నంలో తమ జీవితాలను ధారపోసిన మహనీయుల్లో అగ్రగణ్యులు వేటూరి ప్రభాకర శాస్త్రి. "భాష అడవి వంటిది- కవిత ఉద్యానవనం వంటిది. ఉద్యానవన పెంపు సొంపులకు అరణ్య పరిశోధన అవసరమైనట్టే సుకవితకు భాషా పరిశోధన అవసరం'' అని గట్టిగా నమ్మారు. చిన్నతనంలోనే సంపాదించుకున్న "శతావధాని'' అనే గొప్ప పేరును త్యజించి, తన జీవితానికి అర్థం పరమార్థం అవధానం కాదని, నిరంతర పరిశోధన అని నిర్ణయించుకుని, అందుకోసమే అంకితమైన ధన్య జీవి వేటూరి.



వేటూరి ప్రభాకరశాస్త్రి తెలుగు కవి, భాష పరిశోధకులు, చరిత్రకారులు, రచయిత, విమర్శకులు, రేడియో నాటక రచయిత, తెలుగు, సంస్కృత పండితులు. వేటూరి కేవలం మేధావి మాత్రమే కాదు. తెలుగు భాషా, చారిత్రక సాహిత్య నిర్మాణానికి అక్షరాలను పేర్చిన మేస్త్రీ. ఆయన రచయిత మాత్రమే కాదు. విమర్శనా వ్యాస రచనకు ఆద్యులు. పన్నెండో ఏటే పరభాషలో కవిత చేసిన అనన్య సామాన్యులు. పిన్నవయసు శతావధాని. తెలుగు లిపి ప్రాచీనతకు ఆధారంగా దొరుకుతున్న మొట్టమొదటి తెలుగు పదం ''నాగబు'' గురించి వెలుగు లోనికి తెచ్చింది వేటూరే కావడం విశేషం. తరువాత కాలంలో అది 'నాగబుద్ధి' అనే పేరులో చివరి అక్షరం మరుగై పోగా 'నాగబు' మాత్రమే శాస్త్రికి దొరికిందని పండితులు తేల్చారు. ప్రభాకర శాస్త్రి 'నాగబు' తెలుగువారి చరిత్ర గురించిన కొత్త ఆలోచనలకు దోహదపడింది. తొలిసారిగా అన్నమయ్య ఉనికిని లోకానికి చాటి చెప్పింది కూడా ఆయనే. అయిదు శతాబ్దాలకు పైగా మరుగున పడిన పదకవితా పితామహుని గురించి తెలియని పరిస్థితుల్లో అన్నమయ్య జీవితం గురించి, ఆయన రచనల గురించీ ఎన్నో విశేషాలను శాస్త్రి వెలుగులోకి తెచ్చారు. తాళ్ళపాక చిన్నన్న వ్రాసిన "అన్నమాచార్య చరిత్ర"ను పరిష్కరించి ప్రచురించారు. అన్నమాచార్య ఉత్సవాలకు శ్రీకారం చుట్టి, ఆయన పదాలకు ప్రాచుర్యం కల్పించారు. సి.పి. బ్రౌను గురించి, తొలి తెలుగు కవయిత్రి తిమ్మక్కను గురించీ ఈ తరానికి తెలియ జేసింది ఆయనే. కాలగర్భంలో కలిసి పోతున్న తెలుగు సంస్కృతీ చరిత్ర పునరుద్ధరణ కోసం కంకణ ధారియై, దీక్షాదక్షులై సిద్ధి పొందిన తాపసి ఆయన.

ప్రభాకరశాస్త్రి, కృష్ణా జిల్లా, మోపిదేవి మండలంలో కృష్ణా నది తీరాన ఉన్న పెదకళ్ళే పల్లిలో శ్రీవత్స గోత్రజులైన వేటూరి సుందరశాస్త్రి, శేషమ్మలకు 1888, ఫిబ్రవరి 7 న జన్మించారు. ప్రభాకర శాస్త్రి ప్రాథమిక విద్య స్వగ్రామం లోనే నడిచింది. తండ్రి వద్ద, మద్దూరి రామావధాని వద్ద సంస్కృతాంధ్రములను నేర్చు కొన్నారు. ఉపనయనమైన తర్వాత ప్రభాకరశాస్త్రిని ఆయన తండ్రి శాస్త్రాలు అభ్యసించడానికి చల్లపల్లిలోని అద్దేపల్లి సోమనాథశాస్త్రి వద్ద చేర్పించారు.

16 యేళ్ల వయసులో, చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి బందరు ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారని తెలిసి కొందరు సహాధ్యాయులతో కలిసి అక్కడ చేరారు. తెలుగులో తనకు తెలిసినదంతా చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రితో ముఖతః వినోద గోష్ఠిలో విని నేర్చుకున్నదేనని ప్రభాకర శాస్త్రి చెప్పుకున్నారు.

తన 19వ ఏట మద్రాసు చేరి వెస్లీ మిషన్ హైస్కూలులో తెలుగు పండితునిగా రెండేళ్ళు పనిచేశారు. ఆ సమయములో మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తకశాలకు వెళ్ళి అక్కడి గ్రంథాలను చదువుతుండే వారు.ప్రభాకరశాస్త్రి, తెలుగులో అనేక కావ్యాలు రచించడంతో పాటు అనువాదాలు, వివరణా గ్రంథాలు రచించారు. ఆయన ప్రాచ్యలిఖిత పుస్తకాలయాలలో అనేక తెలుగు గ్రంథాలను చారిత్రకాధారాలతో సవివరముగా పరిష్కరించి ప్రకటించారు.

శృంగార శ్రీనాథం, క్రీడాభిరామం, బసవ పురాణం, రంగనాథ రామాయణం, తంజావూరి ఆంధ్ర రాజుల చరిత్ర, ప్రాచీనాంధ్ర శాసనములు, శాతవాహనులు, ఇక్ష్వాకులు, రెడ్డిరాజులు, చాటుపద్య మణి మంజరి, అన్నమాచార్య కీర్తనలు, తొలి తెలుగు రచయిత్రి తిమ్మక్క, తొలి తెలుగు శాసనము... తదితరాలను ఈరోజు అందుబాటులో ఉంచడానికి వేటూరి కృషియే కారణం. తమిళ, కన్నడ భాషలతో బాగా పరిచయం ఏర్పరచుకొని, ఆండాళ్ రాసిన కొన్ని తమిళ పాశురాలను తెలుగులోకి అనువదించారు. మద్రాసు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారంలో విస్తృత పరిశోధనలు చేశారు. అప్పటి వరకూ వెలుగులోకి రాని ఎన్నో తాళపత్రాలు, శాసనాలు, పుస్తకాలను పరిష్కరించారు. తాను ప్రచురించిన ప్రతి గ్రంథానికీ విపుల పీఠికా నిర్మాణం గావించారు. ముప్పయి సంవత్సరాలు మద్రాసులోనే ఉండి సాహితీ సరస్వతికి ఎనలేని సేవ చేశారు. శాస్త్రి సంస్కృత రూపకాలను తెలుగులోకి అనువాదం చేశారు. తెలుగు సాహితీ లోకంలో లబ్ధప్రతిష్ఠులు, పండితులు, పరిశోధకులు, ప్రాచీన వాఙ్మయ ప్రియులు అయిన వేటూరి ప్రభాకర శాస్త్రి తెలుగు దేశంలో బాల బాలికలు పాడే పాటలు, పలికే మాటలు, చెప్పుకునే కథలు కొన్నింటిని సేకరించి 'భారతి' (1930) లో 'బాలభాష' అనే పేరుతో ప్రచురించారు. ప్రభాకరశాస్త్రి తెలుగు సాహిత్యంలో చిరస్మరణీయులు, తెలుగువారికి ప్రాతఃస్మరణీయులు.వీరు 1950 ఆగష్టు 29న కన్నుమూశారు.

# మరచిపోగలరా.. ఆ నటనను!

## (అలనాటి మేటి నటి జమున జయంతి నేడు)





జనాభాయి అనే పేరు తెలిసిన వారు ఎవరూ ఉండక పోవచ్చు. అలాగే జూలూరి జమున గురించి కూడా ఎవరికీ తెలియక పోవచ్చు. ఈ రెండు పేర్లు తెలుగు సినిమా రంగానికి చెందిన ఒక అగ్ర శ్రేణి కథానాయకురాలికి సంబంధించినవే అంటే ఔరా అనిపించక మానదు. అంతే కాదు. ఆమె తెలుగు మాతృభాష కాకపోయినా తెలుగు నేలలో పెరిగి, తెలుగు చలన చిత్ర సీమలో అరుదైన కథానాయికగా గుర్తింపు పొందిన తార అంటే ఆశ్చర్యం కలుగ మానదు. ఆమే అర్ధ శతాబ్దం క్రితం సినీ రంగంలో కాలూని, వెండి తెరపై నడయాడి, ప్రేక్షకుల హృదయాలలో సుస్థిర స్థానాన్ని పొందిన లెజెండ్, జూలూరి జమున లేదా జమునా రమణారావు లేదా జమునగా సుపరిచితురాలు. ఒకనాటి తెలుగు మేటి సినీ నటి. తెలుగు చలన చిత్ర పరిశ్రమలో హీరోయిన్లుగా కొనసాగిన వాళ్లు చాలా మందే ఉన్నారు. కేవలం కొంతమంది మాత్రమే తమ నటనా ప్రతిభతో సుదీర్ఘ కాలం పరిశ్రమలో, ప్రేక్షకుల్లో తమదైన ముద్ర వేసుకున్నారు. అలాంటి ప్రతిభ గల మేటి పాతతరం తారల్లో జమున ఒకరు.

**గుర్తించిన జగ్గయ్య**

జమున 1936 ఆగస్టు 30 న హంపీలో పుట్టారు. ఆమె తల్లి కౌసల్యాదేవి. తండ్రి వ్యాపారవేత్త నిప్పని శ్రీనివాసరావు. బాల్యం గడిచింది గుంటూరు జిల్లా దుగ్గిరాలలో. జమునకు ముందుగా పెట్టిన పేరు జనాభాయి. జన్మ నక్షత్రం రీత్యా ఏదైనా నది పేరు ఉండాలని జ్యోతిష్కులు సూచించడంతో మధ్యలో 'ము' అక్షరం చేర్చి జమునగా మార్చారు. ఉత్తరాది వారు యమునను జమునగా పిలవడం నేపథ్యంగా ఆమెకు ఆ పేరు స్థిరీకరించారు. సినిమా కోసం ప్రత్యేకంగా ఆమె పేరు మార్చలేదు. సినీనటుడు జగ్గయ్యదీ అదే గ్రామం కావడం వల్ల జమున కుటుంబానికి ఆయనతో కొంత పరిచయం ఉంది. సహజంగా బెరుకు అంటూ లేని జమున స్కూలులో చదివే కాలంలో నాటకాల పట్ల ఆకర్షితురాలయ్యారు. బాల్యంలోనే జమున సంగీతంలో కూడా శిక్షణ తీసుకున్నారు. తెనాలి సమీపంలోని మండూరు గ్రామంలో 'ఖిల్జీ రాజ్య పతనం ' అనే నాటిక ప్రదర్శన కోసం ప్రత్యేకంగా జగ్గయ్య, జమునను ఎంపిక చేసుకుని తీసుకు వెళ్ళారు. ఆ నాటికలో మరో ప్రముఖ నటుడు గుమ్మడి వెంకటేశ్వరరావు కూడా నటించారు.

**అభినవ సత్యభామ...**

నాటకాలలో జమున ప్రతిభ బహిర్గతమై నలుమూలలకూ తెలవడం వల్ల సినిమా అవకాశాలు ఆమెను వెతుక్కుంటూ వచ్చాయి. బి.వి.రామానందం తీసిన పుట్టిల్లు ఆమె తొలిచిత్రం. తరువాత అక్కినేని నాగేశ్వరరావు, జగ్గయ్య, నందమూరి తారక రామారావు తదితర నటుల సరసన నాయికగా నటించారు. ఎన్ని పాత్రలలో నటించినా ఆమెకు బాగా పేరు తెచ్చింది సత్యభామ పాత్రే. ఆ పాత్రలో ఇప్పటికీ ఆమెను తప్ప మరొకరిని ఊహించు కోలేమన్నట్టుగా అద్భుతంగా నటించారామె. వినాయక చవితి చిత్రంలో మొదటి సారి సత్యభామ పాత్రలో జమున కనిపిస్తుంది. ఆ తర్వాత శ్రీకృష్ణ తులాభారం చిత్రంలో కూడా అదే పాత్ర వేశారు. ఈ సినిమాలో సత్యభామ ఆహార్యం గురించి ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నారు. కమలాకర కామేశ్వరరావు దర్శకత్వంలో వచ్చిన ఆ సినిమా లోని పాత్రే ఆమెకు గొప్ప పేరు తెచ్చింది. ప్రధానంగా "మీర జాల గలడా నా యానతి" పాటపై సత్యభామలోని అన్ని లక్షణాలు కలబోసుకుని చేసిన ఆమె అభినయం, ఇప్పటికీ కళ్లముందు కదలాడుతూనే ఉంటుంది. సత్యభామ అంటే ఇలాగే వుంటుంది అనే భావన కలిగించారు జమున. కళపై ఉన్న మక్కువతో నాటకాల్లో బుర్రకథ ఫేం నాజర్ దగ్గర శిక్షణ తీసుకోవటం తన నట జీవితానికి పట్టం కట్టిందని చెపుతారు. ఆమె తెలుగు సినిమాలే కాక తమిళం, హిందీ సినిమాలలో కూడా నటించారు. ఆమె నటించిన మిస్సమ్మ, ఇల్లరికం, ఇలవేల్పు, లేత మనసులు, గుండమ్మ కథ చిత్రాలు విజయ వంతమై, రజతోత్సవాలు చేసుకున్నాయి.

**రాజకీయాల్లోనూ రాణింపు**

సినీ నటీమణుల్లో , రాజకీయాలలో ప్రవేశించి రాణించిన కథానాయికలలో ఆమె తమ స్థానాన్ని పదిల పరచుకొన్నారు. దివంగత ప్రధాని ఇందిరా గాంధీ అంటే ఉన్న అభిమానం, గౌరవం నన్ను రాజకీయాలలోకి లాక్కొచ్చాయి అని తన రాజకీయ జీవితం గురించి చెబుతారు జమున. 1980లలో కాంగ్రెస్ పార్టీలో చేరి రాజమండ్రి నియోజకవర్గం నుంచి 1989లో లోక్ సభకు ఎంపిగా ఎన్నికయ్యారు. ఆ తరువాత రాజకీయల నుండి తప్పుకున్నా, 1990వ దశకంలో భారతీయ జనతా పార్టీ తరపున ప్రచారం చేశారు.

**ఎన్నెన్నో పురస్కారాలు**

జమున చిన్నతనం నుండే నాటకాలలో నటించే వారు. జమున తల్లి ఆమెకు శాస్త్రీయ సంగీతం, హార్మోనీయంలలో శిక్షణ ఇప్పించారు. మా భూమి నాటకంలో జమున ఒక పాత్ర పోషించగా, ఆమె అభినయం నచ్చి ఆమెకు పుట్టిల్లు (1953)లో నటిగా అవకాశం ఇచ్చారు. ఆ సినిమాతో సినిమాల లోకి తెరంగేట్రం చేశారామె. తెలుగు, దక్షిణ భారత భాషల్లో కలిపి ఆమె 198 సినిమాలు చేశారు. పలు హిందీ సినిమాలలో కూడా నటించారు. తెలుగు ఆర్టిస్ట్ అసోసియేషన్ అనే సంస్థ నెలకొల్పి 25 సంవత్సరాలుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారామె. 1968లో ఉత్తమ సహాయ నటిగా ఫిలింఫేర్ అవార్డు - మిలన్; 1964లో ఉత్తమ సహాయ నటిగా ఫిలింఫేర్ అవార్డు - మూగ మనసులు; తమిళనాడు రాష్ట్ర చలనచిత్ర గౌరవ పురస్కారం 1999, 2008లలో ఎన్.టి.ఆర్ జాతీయ పురస్కారం పొందారు. 89 ఏళ్ల జమున వృద్ధాప్య సంబంధిత వ్యాధులతో బాధపడుతూ 2023 జనవరి 27న హైదరాబాద్‌లోని స్వగృహంలో కన్నుమూశారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

## సీఎం హోదాలో ఉండి ఇలాగేనా మాట్లాడేది?

(మొదటి పేజీ తరువాయి)



తప్పుపడతారని ప్రశ్నించింది. ఐతే ఇలాంటి వ్యాఖ్యలను తాము పట్టించుకోమని, మనస్సాక్షి ప్రకారమే నడుచుకుంటామని జస్టిస్ గవాయి ధర్మాసనం స్పష్టం చేసింది. రాజకీయ పార్టీలతో మాట్లాడి తీర్పులు ఇస్తామా అంటూ ప్రశ్నించింది. సీఎం ప్రవర్తన ఇలానే ఉంటే ఓటుకు నోటు కేసు విచారణను రాష్ట్రం బయటే నిర్వహిస్తామంటూ హెచ్చరించింది.ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు మంగళవారం సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఐతే ఈ అంశంపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి.. కవిత బెయిల్ కోసం బీఆర్ఎస్ బీజేపీకి ఎంపీ సీట్లు త్యాగం చేసిందన్నారు. బీఆర్ఎస్-బీజేపీ ఒప్పందంలో భాగంగానే కవితకు బెయిల్ వచ్చిందంటూ రేవంత్ వ్యాఖ్యలు చేశారు.. సిసోడియా, కేజ్రీవాల్‌కు రాని బెయిల్ కవితకు 5 నెలల్లోనే ఎలా వచ్చిందంటూ అనుమానాలను రేవంత్ లేవనెత్తారు ఇక 2015 నాటి ఓటుకు నోటు కేసులో సీఎం రేవంత్ రెడ్డి నిందితుడిగా ఉన్న విషయం తెలిసిందే. ఇదే కేసులో రేవంత్ రెడ్డి అరెస్టయి గతంలో జైలుకు కూడా వెళ్లారు. ఐతే ఇప్పుడు ఆయన సీఎంగా ఉండడంతో కేసు విచారణను మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ కేసులో తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

## విపత్తుల నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో వరద కార్యాచరణ ప్రణాళికపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్ కుమార్, ఎస్. హరీష్, జాయింట్ సెక్రెటరీ, రెవెన్యూ (డిజాస్టర్ మేనేజ్మెంట్), హైడ్రా కమిషనర్ ఏ. వి. రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ, ఇరిగేషన్, మునిసిపల్, పంచాయతీరాజ్, ప్లానింగ్, వాతావరణ శాఖ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ 10 సంవత్సరాల తర్వాత తొలిసారిగా వరదలపై యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నామని తెలిపారు. వరదలతో సంబంధం ఉన్న ప్రతి విభాగం రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో వరదలపై కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. గోదావరి, కృష్ణా పరీవాహక ప్రాంతాలలో వరద ముప్పును తగ్గించడానికి అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు. రాష్ట్ర స్థాయిలో డిజాస్టర్ మేనేజ్మెంట్ తరపున ఒక టోల్ ఫ్రీ నెంబర్ ను ఏర్పాటు చేయాలని సూచించారు. వరదలు, కాలువలు, చిన్న డ్రైనేజీలనుంచి మొదలుకుని, హైరైజ్ భవనాల వరకు ఏ పరిస్థితి ఎదురైనా దానిని అధిగమించడానికి వీలుగా అధునాతన పరికరాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. అన్నీ విభాగాలు వరద ముప్పును ఎదుర్కోవడానికి కావలసిన ప్రణాళికలను సిద్ధం చేసుకుని రావాలని, త్వరలో దీనిపై మరోసారి సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. హైడ్రా పరిధిలో డిజాస్టర్ మేనేజ్మెంట్ బలోపేతానికి తీసుకుంటున్న చర్యలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ వివరించారు. గతంలో 30 బృందాలు ఉండగా దాన్ని 70 కి పెంచామని, అలాగే సిబ్బంది సంఖ్యను 1800 నుండి 3500 వరకు పెంచినట్లు రించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ డిజాస్టర్ మేనేజ్మెంట్ కు సంబంధించి హైడ్రాకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. హైడ్రాకు కావలిసిన అధునాతన పరికరాలు అందిస్తామని , ఇందుకు అవసరమైన ప్రతిపాదనలను పంపించాలని హైడ్రా కమిషనర్ కు సూచించారు.

## రాష్ట్రంలో పెసర కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించండి

(మొదటి పేజీ తరువాయి)

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి, పెసర పంటను కొనుగోలు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మార్క్ ఫెడ్ అధికారులను ఆదేశించారు . ప్రస్తుత వానాకాలంలో 64,175 ఎకరాలలో పెసర పంట సాగయిందని, 17,841 మెట్రిక్ టన్నుల వరకు దిగుబడి రావచ్చని అంచనా వేయడం జరిగిందని మంత్రి తెలపారు. ప్రస్తుతానికి 12 ప్రాంతాలలో పంటకోతకు వచ్చిందని మరియు మార్కెట్ కు పెసర పంట అమ్మకానికి వచ్చే అవకాశం ఉందని గుర్తించినట్లు అధికారులు మంత్రికి తెలిపారు. దింతో ఆ ప్రాంతాలలో కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటుచేసి, కొనుగోళ్ళను ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. రేపటి నుండి ఖమ్మం, సంగారెడ్డి, వికారాబాద్, సూర్యాపేట, నారాయణపేట, మహబూబాబాద్, కామారెడ్డి జిల్లాలలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు మార్క్ ఫెడ్ అధికారులు సన్నాహాలు పూర్తి చేసుకోవల్సిందిగా ఆదేశించారు. అదేవిధంగా కొనుగోలు సెంటర్లలో రైతులకు మార్క్ ఫెడ్ ద్వారా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కనుక రైతులు కొనుగోలు కేంద్రాల ద్వారా నాణ్యత ప్రమాణాలను పాటించి పెసర పంటకు ప్రభుత్వ మద్దతు ధర రూ. 8,682 పొందవలసిందిగా మంత్రిగారు విజ్ఞప్తి చేశారు.

## అణు జలాంతర్గామి.. ఐఎన్ఎస్ అరిఘాత్' జాతికి అంకితం

**ఢిల్లీ:** భారత నౌకాదళం మరో మైలురాయిని చేరుకుంది. ఐఎన్ఎస్ అరిఘాత్ ను భారత రక్షణశాఖ మంత్రి రాజ్నాథ్ సింగ్ విశాఖ తీరంలో జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. ఈ జలాంతర్గామిలో దేశీయంగా అభివృద్ధి చేసిన సాంకేతిక వ్యవస్థలు మన శక్తిసామర్థ్యాలకు, శాస్త్రజ్ఞుల ప్రతిభకు నిదర్శనమన్నారు. దేశ ప్రయోజనాలను కాపాడటంలో ఇది కీలక భూమిక పోషిస్తుందన్నారు. ఐఎన్ఎస్ అరిఘాత్ భారత నౌకాదళంలో రెండో అణు జలాంతర్గామి కావడం విశేషం. ఇప్పటికే 'ఐఎన్ఎస్ అరిహంత్' తన సేవలు కొనసాగిస్తోంది. ఐఎన్ఎస్ అరిహంత్ మాదిరిగానే అరిఘాత్ నిర్మాణాన్ని కూడా తూర్పు నౌకాదళానికి చెందిన యుద్ధనౌకల స్థావరం విశాఖపట్నం నేవల్ డాక్ యార్డులోని 'షిప్ బిల్డింగ్ సెంటర్ లో 2011 డిసెంబరులో చేపట్టారు. తొలిదశ నిర్మాణం తర్వాత 2017 నవంబరు 19న జలప్రవేశం చేయించారు. అనంతరం అంతర్గత విభాగాల పరికరాల బిగింపు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రాడార్ వ్యవస్థ, ఆయుధ సంపత్తిని సమకూర్చడం వంటి కీలక పనులన్నింటినీ పూర్తి చేశారు. సీ ట్రయల్స్ ప్రక్రియను పలు దఫాలుగా చేపట్టారు.

**విశేషాలివే..**

* పొడవు: 111.6 మీటర్లు, వెడల్పు: 11 మీటర్లు
* లోతు (డ్రాఫ్ట్): 9.5 మీటర్లు
* వేగం: సముద్ర ఉపరితలంలో గంటకు 12-15 నాటికల్ మైళ్లు (22 నుంచి 28కి.మీ), సముద్ర జలాల్లో 24 నాటికల్ మైళ్లు
* ప్రత్యేకతలు: సోనార్ కమ్యూనికేషన్ వ్యవస్థ, సాగరిక క్షిపణులు, రేడియేషన్ బయటకు రాకుండా భద్రతా ఏర్పాట్లు

# హైడ్రాకు మరిన్ని అధికారాలు

(మొదటి పేజీ తరువాయి)



రాష్ట్ర హై-కోర్టు జారీ చేసిన ఆదేశాలను పరిగణనలోకి తీసుకుంటూ సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి గురువారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా,ఓ.ఆర్.ఆర్ పరిధిలోని అన్ని చెరువులు, పార్కులు, నాలాలతో పాటు అన్ని ప్రభుత్వ స్థలాల పరిరక్షణ బాధ్యతలను పూర్తి స్థాయిలో హైడ్రా కు అప్పగించేందుకు విధి విధానాలను రూపొందిస్తున్నట్టు తెలిపారు. చెరువుల ఆక్రమణల తొలగింపు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణపై రాష్ట్ర హై-కోర్టు జారీ చేసిన ఆదేశాలను పరిగణనలోకి తీసుకుంటూ, ప్రభుత్వ స్థలాలు, చెరువులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకై హైడ్రాకు మరిన్ని అధికారాలను, సిబ్బందిని అప్పగించేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి మాట్లాడుతూ చెరువులు, కుంటలు, పార్కులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణల తొలగింపుపై ప్రస్తుతం నీటిపారుదల శాఖ, జీహెచ్ఎంసీ, పురపాలక శాఖ, పంచాయితీ రాజ్, వాల్టా తదితర విభాగాలు వేర్వేరుగా నోటీసులు జారీ చేస్తున్నారని, దీనివల్ల ఒక రకమైన కన్ఫ్యూజన్ ఏర్పడుతోందని అభిప్రాయపడ్డారు. దీనిని నివారించటానికి, ఓ.ఆర్.ఆర్. పరిధిలో అన్ని విధాలా ఆక్రమణల తొలగింపు నోటీసులను హైడ్రా ద్వారానే చేపట్టేందుకు విధి విధానాలు ఖరారు చేయాలని మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించారు. జీ.హెచ్,ఎంసీ, ల్యాండ్ ఎంక్రోచ్‌మెంట్ యాక్ట్, ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్, వాల్టా చట్టం, నీటిపారుదల శాఖ చట్టాల ద్వారా జారి చేసే అన్ని రకాల నోటీసులు, తొలగింపులన్నీ పూర్తిగా ఒకే విభాగం హైడ్రా పరిధిలోకి తేనున్నట్టు వివరించారు. హైడ్రాకు కావాల్సిన అదనపు అధికారులు, సిబ్బందిని త్వరలోనే కేటాయించనున్నట్టు తెలిపారు. ఎఫ్.టీ.ఎల్, నాలా ఎంక్రోచ్‌మెంట్ , ప్రభుత్వ ఖాళీ స్థలాలు, పార్కుల పరిరక్షణ లను హైడ్రా పరిధిలోకి తేనున్నామని చెప్పారు. గండిపేట, హిమాయత్ సాగర్ చెరువుల పరిరక్షణ కూడా జల మండలి నుండి హైడ్రా పరిధిలోకి తేనున్నామని వెల్లడించారు. హైడ్రా ఆధ్వర్యంలో మొత్తం 72 బృందాలు ఏర్పాటయ్యాయని, వీటిని మరింత బలోపేతం చేయాడానికి కావాల్సిన పోలీస్, సర్వే, నీటిపారుదల శాఖల నుండి అధికారులు, సిబ్బందిని త్వరితగతిన కేటాయించనున్నట్టు చీఫ్ సెక్రటరీ తెలిపారు. ఈ సమావేశంలో ఈ సమావేశానికి ఇంటలిజెన్స్ డీజీ శివధర్ రెడ్డి, శాంతి భద్రతల విభాగం అడిషనల్ డీజీ మహేష్ భగవత్, మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, హెచ్ఎండీఏ కమీషనర్ సర్ఫ్‌రాజ్ అహ్మద్, అడిషనల్ అడ్వకేట్ జనరల్ రజనీకాంత్ రెడ్డి, ఏసీబీ డైరెక్టర్ తరణ్ జోషి, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు హాజరయ్యారు.

# వద్దురా నాయనా.. కాంగ్రెస్ పాలన!

(మొదటి పేజీ తరువాయి)

అనుమానిస్తోందని బీఆర్ ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. రుణమాఫీపై ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును తప్పుబట్టారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌వేదికగా గురువారం ట్వీట్ చేశారు. రుణమాఫీ కాని రైతులను రేవంత్ సర్కార్ అనుమానిస్తోందని మండిపడ్డారు. సెల్ఫ్ డిక్లరేషన్ పేరుతో కొత్త డ్రామా ఆడుతున్నారని, ఇచ్చేది పక్కన పెట్టి వాపస్‌పై దృష్టి పెట్టారని ధ్వజమెత్తారు. మొన్న ఖమ్మంలో ముసలవ్వ పింఛన్ వాపస్, ఇప్పుడు రైతు రుణమాఫీలో వాపస్ ఆప్షన్ అని వ్యాఖ్యానించారు.

**రైతులకు మళ్లీ కష్టాలు**

మాజీ సీఎం కేసీఆర్ రైతును రాజు చేస్తే, కాంగ్రెస్ నేతలు అనుమా నిస్తూ వేధిస్తున్నా రని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే మాఫీపై మంత్రులు, ముఖ్యమంత్రి జూటా మాటలు అసత్య ప్రచారా లు చేస్తున్నారని మండిపడ్డారు. ఒక్క రుణమాఫీకి వంద కొర్రీలని ధ్వజమెత్తారు. సెల్ఫీ దిగి తాను రైతు అని అన్నదాత నిరూపించుకోవాలా అని ప్రశ్నించారు.

**విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం**

మరోవైపు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఈబీసీ విద్యార్థులంటే కాంగ్రెస్ సర్కారుకు ఎందుకింత చిన్నచూపని కేటీఆర్ ప్రశ్నించారు. ఉపకార వేతనాలు, ఇతర అంశాలపై ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలైనా, బోధనా ఫీజులు, ఉపకార వేతనాల జాడేదని అడిగారు. 5900 కోట్ల రూపాయలకు బకాయిలు చేరుకున్నా ప్రభుత్వంలో చలనం లేదని, దరఖాస్తులకే దిక్కులేదని మండిపడ్డారు. స్కాలర్ షిప్పులను పెండింగ్‌లో పెట్టడంతో విద్యార్థులకు రోజురోజుకూ అవస్థలు పెరుగుతున్నాయని, విద్యాసంస్థల యాజమాన్యాలకు తిప్పలు తప్పడం లేద ని కేటీఆర్ పేర్కొన్నారు. మెయింటెనెన్స్ ఛార్జీలు కూడా రాకపోవడంతో వసతిగృహాల విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, నిర్లిప్తత వల్ల పేద విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులపాలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆపాలని, ప్రభుత్వం వెంటనే బకాయిలన్నీ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

**మార్పు ఇప్పుడు ఎందుకో వివరించగలరా?**

మరోవైపు గతంలో రాష్ట్రంలో చైనా కంపెనీ ప్రతిపాదనను కేంద్రం తిరస్కరించిందని కేటీఆర్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. చైనా బీవైడీ కంపెనీ బిలియన్ డాలర్ల కంపెనీ ఏర్పాటుకు యోచిస్తోందని చెప్పారు. కంపెనీ ఏర్పాటుతో ఎలక్ట్రిక్ వాహనాల త యారీ ఊపందుకునేదని, వేలాది ఉద్యోగాలు వచ్చేవని తెలిపారు. ఇప్పుడు చైనా పెట్టుబడులను దేశంలోకి అనుమతిస్తారని కథనాలు వస్తున్నాయని, మార్పు ఇప్పుడు ఎందుకో కేంద్రం వివరించగలదా అని ప్రశ్నించారు.

# ప్రజాపాలనలో క్రీడలకు మంచిరోజులు

**విశ్వంభర, హైదరాబాద్:** క్రీడలు, క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని రాష్ట్ర ఐ టి , పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ప్రజలు కోరుకున్న విధంగా ప్రజాపాలన లో క్రీడలకు మంచి రోజులు రాబోతున్నాయని , క్రీడలను అన్ని రకాలుగా ప్రోత్సహించడంలో భాగంగా క్రీడా పాలసీ రూపొందించి, అమలుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృత నిశ్చయంతో ఉన్నారని పేర్కొన్నారు. గచ్చిబౌలి స్టేడియంలో గురువారం నిర్వహించిన నేషనల్ స్పోర్ట్స్ డే వేడుకల్లో ఆయన మంత్రి సీతక్కతో కలసి పాల్గొన్నారు. స్పోర్ట్స్ అడ్వైజర్ జితేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ధ్యాన్ చంద్ విగ్రహానికి మంత్రులు పూల మాలలు వేశారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా హాకీ గ్రౌండ్ లో ధ్యాన్ చంద్ మెమోరియల్ హాకీ మ్యాచ్ నిర్వహించారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఒలింపిక్స్ లో దక్షిణ కొరియా సాధించిన పథకాల గురించి ఆ దేశ పర్యటనలో ముఖ్యమంత్రితో కలిసి చర్చించినట్లు తెలిపారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పథకాలు సాధించే సామర్థ్యం గల క్రీడా కారులను తయారు చేసేందుకు త్వరలో ప్రారంభించనున్న స్పోర్ట్స్ యూనివర్సిటీకి స్పోర్ట్స్ స్కూల్స్ ను అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు.క్రీడా కారులకు కింది స్థాయినుంచే ప్రొఫెషనల్ శిక్షణ ఇప్పించనున్నట్లు తెలిపారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి గుర్తింపు తెచ్చిన క్రీడా కారుల కు ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చినట్లు గుర్తు చేశారు. క్రీడలకు ప్రభుత్వం రూ.364 కోట్లు కేటాయించినట్లు క్రీడా సలహాదారు జితేందర్ రెడ్డి తెలిపారు. గత 10 సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురై న క్రీడలకు జవ సత్వాలు కల్పించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమం లో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ ఎన్. శివ సేనా రెడ్డి, ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, స్పోర్ట్స్ అథారిటీ అధికారులు, ట్రిపుల్ ఒలింపియన్ ముఖేశ్ కుమార్, అర్జునా అవార్డీలు నీతా దద్వే, అనూప్ కుమార్ యామ, నాయీమొద్దీన్, వేణుగోపాల చారి, యూత్, స్పోర్ట్స్ & కల్చర్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణి ప్రసాద్, స్పోర్ట్స్ అథారిటీ వీసీ & ఎండీ సోని బాలదేవి , జిహెచ్ ఎంసి మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, జగదీశ్వర్ యాదవ్, వివిధ క్రీడాసంఘాల ప్రతినిధులుపాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీల జీవితాల్లో వెలుగులు నింపాలి

(మొదటి పేజీ తరువాయి)



సచివాలయంలో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు- ప్రణాళికల గురించి వివిధ శాఖల ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం అమలుకు ఆర్థిక శాఖ ప్రత్యేక అధికారిని నియమించిందని, ఆ అధికారి అన్ని శాఖలతో సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మాణం చేయనున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు సబ్ ప్లాన్ నిధుల కేటాయింపులో ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. దళిత గిరిజన ఆవాసాల్లో కమ్యూనిటీ హాల్స్, అంతర్గత రహదారులు, డ్రైనేజీ నిర్మాణాలు ఇతర మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాలని చెప్పారు. ఎస్సీ ఎస్టీల జీవితాల్లో వెలుగులు నింపడానికి ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకు వచ్చిన ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని వంద శాతం పూర్తి స్థాయిలో అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల్లో ఉన్న అధికారులు ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని అర్థం చేసుకొని చట్టం ప్రకారం వారి నిధులను వారికే ఖర్చు పెట్టాలని సూచించారు. ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వంలో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని సీరియస్ గా అమలు చేయడానికి ఉన్నత అధికారులు మేధోమథనం చేసి యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని ఆదేశించారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం ప్రధాన ఉద్దేశాన్ని అమలు చేసి దళిత గిరిజన జీవితాల్లో మార్పు తీసుకువస్తేనే ఆ చట్టానికి అర్థం, పరమార్థం ఉంటుందని అన్నారు. చట్టాన్ని ఎంత సీరియస్ గా అమలు చేయాలో ఉన్నత అధికారులు మనసుపెట్టి ఆలోచన చేయాలన్నారు. అమలుకు యాక్షన్ ప్లాన్ తయారు చేసిన తర్వాత అన్ని శాఖల అధికారులకు నిధుల కేటాయింపు, ఖర్చు పైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వెల్లడించారు.ఎస్సీ ఎస్టీల భూములను అభివృద్ధి చేయడానికి ఇందిరా జల ప్రభ పథకం అమలు కోసం అధికారులు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సూచించారు. మైనర్ ఇరిగేషన్ శాఖ అధికారులు దళిత, గిరిజనుల వ్యవసాయం కోసం కావలసిన నీటి వనరులను సమకూర్చడానికి బోర్లు వేయించాలని, భూగర్భ జలాలు పెరగడానికి చెక్ డ్యాముల నిర్మాణం చేయాలని చెప్పారు. పోడు సాగు చేసుకునే ఆదివాసి రైతులకు ఆదాయం వచ్చే విధంగా మరియు అడవిని కాపాడుకునే విధంగా ఫామ్ ఆయిల్, పండ్ల తోటల పెంపకం, అంతర్గత పంటల సాగుకు డిజైన్ చేయాలని సూచించారు. అడవి - ఆదాయం రెండు ఉండే విధంగా కొత్త పథకాలను తీసుకురావాలని సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల కేటాయింపు, నిధుల ఖర్చు గురించి అధికారులను అడిగి ఆరా తీశారు. గతం మాదిరిగా కాకుండా ప్రజా ప్రభుత్వంలో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం ప్రకారంగా 24 శాతం నిధులు ఎస్సీ ఎస్టీల అభ్యున్నతి కోసం ఖర్చు పెట్టడానికి అధికారులు కచ్చితంగా దృష్టి సారించాలని చెప్పారు. అన్ని శాఖల అధికారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించిన తర్వాత ప్రతినెల సబ్ ప్లాన్ చట్టం అమలు, నిధుల వ్యయంపై శాఖల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించి ఆర్థిక శాఖ నుంచి పర్యవేక్షణ చేయాలని సూచించారు. మళ్లీ వారం రోజుల్లో ఆర్థిక శాఖ నిర్వహించే సమావేశానికి అధికారులు సమగ్రమైన కార్యాచరణ ప్రణాళికలతో రావాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ సుల్తానీయా, సోషల్ వెల్ఫేర్ కమిషనర్ శ్రీదేవి, ట్రైబల్ వెల్ఫేర్ సెక్రెటరీ శరత్, హౌసింగ్ కార్పొరేషన్ ఎం.డి గౌతమ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఫోర్త్ సిటీ పేరుతో ప్రభుత్వ భూములు కొల్లగొట్టే కుట్ర..

**విశ్వంభర,హైదరాబాద్:** ఫోర్త్ సిటీ పేరుతో ప్రభుత్వ భూములు కొల్లగొట్టే కుట్ర జరుగుతోందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సంచలన ఆరోపణలు చేశారు. గురువారం తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ .. కందుకూరులో 385 ఎకరాలు సర్వే నంబర్ 9లో ప్రభుత్వ భూమిని కొల్లగొట్టడానికి సర్వే చేస్తున్నారని.. తుక్కుగూడలో 25 ఎకరాలు సర్వే నంబర్ 895లో పేద రైతుల దగ్గర బినామీల పేరుతో తీసుకుంటున్నారని తెలిపారు. ముచ్చర్లలో ప్రభుత్వంలో పెద్దలుగా చలామణి అవుతున్న తమ్ముళ్ల పీఏల పేరుమీద భూములు కొంటున్నారన్నారని ఆరోపించారు . సమయం వచ్చినప్పుడు అన్ని వివరాలు బయటపెడుతానన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ మెజారిటీ తగ్గిందని.. రేవంత్ రెడ్డి దగ్గర ఉండి డీకే అరుణను గెలిపించారని విమర్శించారు. మోదీతో మాట్లాడుకొని వచ్చి తెలంగాణలో బీజేపీ ఎంపీలను రేవంత్ రెడ్డి గెలిపించారన్నారు. రుణమాఫీపై తాము రిపోర్ట్ ఇస్తే రేవంత్ రెడ్డి సీఎం పదవిలో ఉండి ఎందుకు? అని ప్రశ్నించారు. ప్రజల కోసం పోరాడే బాధ్యతను ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి ఇచ్చారన్నారు.

**సుప్రీం తీర్పును తప్పుపట్టడం నేరం**

సీఎం స్థాయిలో ఉండి సుప్రీంకోర్టు తీర్పును తప్పుబట్టడం నేరమని హరీశ్‌రావు అన్నారు. వక్రబుద్ధి ఉంటే అన్ని వంకరగా కనిపిస్తాయని.. ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డికి బెయిల్ బీజేపీ ఇస్తేనే వచ్చిందా..? అంటూ ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డికి సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిందన్నారు. కవిత బెయిల్ విషయంలో న్యాయం, ధర్మం గెలిచిందని.. ఈడీ, సీబీఐపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసిందన్నారు. సిసోడియాకు బెయిల్ వస్తే బీజేపీతో పోరాటం.. కవితకు బెయిల్ వస్తే బీజేపీతో లాలూచీనా..? అంటూ నిలదీశారు. కవితకు బెయిల్ రావడాన్ని కేశవరావు స్వాగతించారన్నారు.

**మొదట బుద్ధ భవన్, జీహెచ్ఎంసీని కూల్చండి**

బుద్ధ భవన్, జీహెచ్ఎంసీ కార్యాలయం నాలాపై ఉన్నాయని.. మొదట వాటిని కూల్చాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. తమ ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి భవనాలు ఎలా కూలగొడుతారని ప్రశ్నించారు. నెక్లెస్ రోడ్, లుంబినీ పార్క్, హోటల్స్, క్లబ్స్ దేని కింద ఉన్నాయని ప్రశ్నించారు. మీర్‌ఆలం, ఉప్పల్, రామంతాపూర్ చెరువులో పెద్దపెద్ద టవర్లు ఉన్నాయని.. అవన్నీ పట్టాభూములు.. వారికి పరిహారం ఇవ్వాలన్నారు. మంత్రి పొంగులేటి నివాసం నుంచి డ్రైనేజీ నీళ్లు ఎక్కడికి పోతున్నాయని.. ముఖ్యమంత్రి పరోక్షంగా తనమంత్రిని తిడుతున్నారా? అంటూ చురకలంటించారు. ప్రతిపక్షాలను టార్గెట్ చేయడం మంచిదికాదన్నారు. చిత్తశుద్ధి ఉంటే హైడ్రా పరిధిలోని ఆక్రమణలు కూల్చివేయాలన్నారు. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, నాలాలపై ఉన్న ఆస్తులను కూల్చివేయాలన్నారు. కాళేశ్వరం మరమ్మతుల విషయంలో తనకే అవకాశం ఇస్తామన్నారని.. తాను సిద్ధపడితే రేవంత్‌రెడ్డి తోక ముడిచారని విమర్శించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి భూమిపూజ చేస్తే మంత్రులు కూడా లేరన్నారు.

## సీఎం సోదరుడికి హైడ్రా నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

వ్యూహంగా ముందుకెళ్తోంది. ఇప్పటికే అక్రమ నిర్మాణాలకు సంబంధించి పేద పెద్ద వ్యత్యాసం లేకుండా అక్రమ నిర్మాణం అని తేలిన వెంటనే ఉక్కు పాదం మోపుతున్న హైడ్రా తాజాగా దుర్గం చెరువు ఆక్రమణ పై దృష్టి సారించింది. కావూరి హిల్స్ తో సహా మొత్తం మూడు ఏరియాలోని 24 ఆక్రమణలు గుర్తించి యజమానులకు నోటీసులు జారీ చేశారు. వీటిలో సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి తో పాటు ఓ పారిశ్రామికవేత్త కుమారుడు, మరో ఎమ్మెల్యే నివాసం కూడా ఉన్నట్లు గుర్తించిన శేర్లింగంపల్లి రెవెన్యూ అధికారులు గురువారం నోటీసులు జారీ చేశారు. ఈ అక్రమ నిర్మాణాలను 30 రోజుల్లో మీరే కూల్చేసుకోవాలి లేదంటే కూల్చివేతలు తామే చేపడతామని నోటీసుల్లో స్పష్టం చేసినట్లు సమాచారం. కాగా తన నివాసం అక్రమ నిర్మాణం అయితే కూల్చి వేయాలని, దానిపై తనకు ఎలాంటి అభ్యంతరం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి స్పష్టం చేశారు.తనకు టైమ్ ఇస్తే ఇంట్లో సామాను తీసుకుని బయటకి వెళ్తానని అన్నారు. శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారులు మీకు నోటీసు ఇచ్చారు కదా అన్న విషయాన్ని ప్రస్తావించగా-,ఇప్పటివరకు తనను ఏ అధికారి కలువలేదని ఆయన బదులిచ్చారు. తాను 2016-17 లో అమర్ సొసైటీలో ఒక నివాసాన్ని కొనుగోలు చేశానని, దాని కొనుగోలు చేసినప్పుడు ఈ బిల్డింగ్ ఎఫ్ టి ఎల్ పరిధిలో ఉందన్న విషయం తనకు తెలియదని వెల్లడించారు. 1995 లోనే ఈ లే ఔట్ కి పర్మిషన్ వచ్చిందని, ఇప్పుడు బీఆరెస్ నేతలు తన ఇంటిని పట్టుకొని రాజకీయం చేస్తున్నారని, వారు అధికారంలో ఉన్నగత పదేళ్ళలో ఎన్నో అక్రమాల కు పాల్పడ్డారని ఆరోపించారు.



# జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో ఇన్సినిరేషన్ ప్రక్రియ

## 3.75 కోట్ల విలువ గల 13.990-కిలోల ఆల్ప్రాజోలం, 950.285-కిలోల ఎండు గంజాయి దహనం: ఎస్పీ రూపేష్

**విశ్వంభర, సంగారెడ్డి :** సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్‌లలో నమోదైన 13 కేసుల్లో నిందితుల నుంచి సీజ్ చేసిన ప్రభుత్వ నిషేధిత ఆల్ప్రాజోలం 3-కిలోలు, ఎండు గంజాయి 950-కిలోలను, ఎన్‌డీపీఎస్ చట్ట ప్రకారం కోర్టు అనుమతి తీసుకుని, న్యాయాధిపతుల ఎదుట కేసు ప్రాపర్టీని ఎఫ్‌ఎస్‌ఎల్ కొరకు శాంపిల్ తీసి మిగిలిన మొత్తాన్ని జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం సంగారెడ్డి జిల్లాలోని పాశమైలారం పారిశ్రామిక వాడలోని మెడీకేర్ పరిశ్రమలో ఇన్సినిరేషన్ ప్రక్రియ ద్వారా పర్యావరణ కాలుష్య నియంత్రణ నిబంధనలను పాటిస్తూ దహనం చేశారు. దహనం చేసిన నిషేధిత ఆల్ప్రాజోలం, గంజాయి విలువ సుమారు 3.75 కోట్ల రూపాయల విలువ ఉంటుందని జిల్లా ఎస్పీ రూపేష్ వివరించారు. జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్ జిల్లా ఎస్పీ, కమిటీ సభ్యులైన అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు, మెడీకేర్ పరిశ్రమ మేనేజర్ శివారెడ్డి పటాన్ చెర్ డీఎస్పీ రవీందర్ రెడ్డి, సంగారెడ్డి డీఎస్పీ సత్యయ్యగౌడ్, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ బీ రమేష్, పటాన్ చెర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ లాలూనాయక్ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఎన్‌డీపీఎస్ యాక్ట్ లోని నియమ నిబంధనల ప్రకారం జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో నమోదు చేయనడిన 13 కేసులలో నిల్వ ఉన్న ఆల్ఫాజోలం మరియు గంజాయిని దహనం చేశారు. కొందరు అక్రమార్జనలో భాగంగా అక్రమ ఆల్ప్రాజోలం తయారీ, గంజాయి సాగు, విక్రయిస్తూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని యువతను ప్రలోభాలకు గురి చేస్తూ మత్తులోకి దించుతున్నారన్నారు. అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వారిని అరికట్టడం కోసం జిల్లా వ్యాప్తంగా స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసుల ద్వారా విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించారు. ఎవరైనా గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇకపై మత్తుకు బానిసలై గంజాయి లాంటి మత్తు పదార్థాలను సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని ఎస్పీ హెచ్చరించారు.



# ధ్యాన్ చంద్ జయంతి



**విశ్వంభర, నారాయణఖేడ్:** ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవమును పురస్కరించుకొని నారాయణఖేడ్ లో 2కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నా ఎమ్మెల్యే సంజీవరెడ్డి పట్టణంలోని బసవేశ్వర్ చౌక్ దగ్గర ధ్యాన్ చంద్ ఫోటో కి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ 119వ, జయంతిని ఘనంగా నిర్వహించడం సంతోషంగా ఉందని అన్నారు. భారతదేశ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన హాకీ మాంత్రికుడని కొనియాడారు. ఏఈఓ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు



**విశ్వంభర, జగిత్యాల:** జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన టార్చ్ ర్యాలీ కాగడా కార్యక్రమాన్ని మెట్ పల్లి డిఎస్పి ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. ఆయన క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ చిన్నతనం నుండి విద్యార్థులు క్రీడల పట్ల మక్కువ చూపాలని అన్నారు. మారుమూల గ్రామాల నుండి క్రీడాకారులు నైపుణ్యం ప్రదర్శించి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులను ఆటల వైపు మళ్లించేలా కృషి చేయాలని అన్నారు. చదువుల్లోనే ఆటలలో కూడా పిల్లలను ప్రోత్సహిస్తే అద్భుతాలు జరుగుతాయని అన్నారు. అసోసియేషన్ సంఘం అధ్యక్షులు వీబీ మహర్షి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియే షన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్య రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం, చెట్లపల్లి సుఖేందర్ గౌడ్, ఉపాధ్యక్షుడు గజెల్లి రాందాస్, ఆల్ రౌండర్ గంగాధర్, వేణు పోలీస్ సిబ్బంది తదితులున్నారు.

# రక్తదానం చేయండి - ప్రాణదాతలు కండి



**విశ్వంభర, కేశంపేట:** లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో కేశంపేట మండల పరిధిలోని సుందర పురం గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని క్లబ్ అధ్యక్షులు పి. లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని కోరారు. యువతీ, యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. యాక్సిడెంట్ అయిన వారికి ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తము చాలా అవసరం అవుతుందని ఆయన పేర్కొన్నారు. రక్తాన్ని కేవలం దాతృత్వం ద్వారానే సేకరించబడుతుందని ఎలాంటి కంపెనీలు మందులు ఉండవని ఆయన అన్నారు. రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన యువతి, యువకులను ఆయన అభినందించారు. ఈ శిబిరంలో 25 మంది రక్తదానం చేసినట్లు క్లబ్ పిఆర్ఓ పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో రక్తదాత బి. అంజిరెడ్డి, కోఆర్డినేటర్ వరద రెడ్డి, జిల్లా చైర్మన్ జూలూరి రమేష్, లయన్ డి. మోహన్ రెడ్డి, పిఆర్ఓ పాషా తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ సభ్యత్వ నమోదుకు కృషి చేయాలి



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** భారతీయ జనతా పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా గ్రామీణ స్థాయిలో బిజెపి సభ్యత్వ నమోదుకు నాయకులు కార్యకర్తలు విశేషంగా కృషి చేయాలని పెద్ద శంకరంపేట మండల బిజెపి అధ్యక్షుడు కోణం విఠల్ పేర్కొన్నారు. గురువారం పెద్ద శంకరంపేటలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపి రాష్ట్ర స్థాయి పిలుపుమేరకు ప్రతి బూతులో 200 మందికి పైగా తగ్గకుండా సభ్యత్వ నమోదు చేయించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో బిజెపి జెండా ఎగరవేయడమే లక్ష్యంగా కార్యకర్తలు నాయకులు పనిచేయాలన్నారు. బిజెపిలో సభ్యత్వం పొందడానికి 8800002024 నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని పేర్కొన్నారు.. సెప్టెంబర్ రెండవ తేదీ నుండి సభ్యత నమోదు ప్రారంభమవుతుందని వివరించారు. మండల బిజెపి నాయకులు బండల శ్రావణ్ కుమార్, మంగలి కృష్ణ, సుభాష్, అంజయ్య, సురేష్, విజయ్ కుమార్, రాజు తదితరులు ఉన్నారు.

# రోడ్డెక్కిన అన్నదాతలు



**విశ్వంభర, మేడిపల్లి:** ఉమ్మడి మేడిపల్లి మండల కేంద్రంలో రైతులు రోడ్డుపై ధర్నా రాస్తారోకో చేశారు. రైతులకు ప్రభుత్వం చేసిన హామీలను నెరవేర్చాలని పట్టా పాసుబుక్కు ఉన్న ప్రతి ఒక్క రైతుకు రుణమాఫీ చేయాలని, అదేవిధంగా రైతు భరోసా ఎకరాకు రూ.15000 ఇవ్వాలని రైతులు ఆందోళన చేశారు. రైతన్న ఎన్నో కష్టాలకోర్చి వ్యవసాయం చేసిన రైతుల కష్టాన్ని ఏ ప్రభుత్వం గానీ, ఏ నాయకులు గానీ గుర్తించలేకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. ప్రభుత్వం ఇప్పటికైనా రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇదే విధంగా పట్టించుకోకుండా రైతులను ఇబ్బంది పెడితే రాష్ట్రం మొత్తం స్తంభించేలా రైతుల ఉద్యమాలు కొనసాగుతాయని తెలిపారు. అనంతరం తహసిల్దార్ వసంతకు, వ్యవసాయ అధికారి సాహిద్ ఆలికి వినతిపత్రం అందజేశారు.

# ఓటరు మెర్జింగ్ ప్రక్రియ ప్రారంభం



**విశ్వంభర, భూపాలపల్లి :** రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పార్థసారథి గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఓటరు మెర్జింగ్, ఓటరు జాబితా రూపకల్పన, పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు, ఓటరు జాబితా తయారులో అభ్యంతరాలు, పిర్యాదులు తదితర అంశాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కు ఐడిఓసి కార్యాలయం నుండి భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 11 మండలాల పరిధిలో 248 గ్రామ పంచాయతీల పరిధిలో 2092 వార్డులున్నట్లు తెలిపారు. వచ్చే నెల 6వ తేదీన ముసాయిదా ఓటరు జాబితా ప్రకటించాల్సి ఉన్నదని, అందువల్ల గ్రామ పంచాయతీ వార్డులు వారిగా కుటుంబ సభ్యుల ఓట్లన్నీ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండే విధంగా ఓటరు జాభితా మెర్జింగ్ జరుగుతున్నట్లు తెలిపారు. టి.ఈ. పోల్ సాఫ్ట్ వేర్ నందు ఓటరు జాబితా మెర్జింగ్ జరుగుతున్నదని, జిల్లాలో ఇప్పటి వరకు 50 శాతం వరకు ఓటరు జాభితా మెర్జింగ్ పూర్తి చేశామని, మిగిలిన 50 శాతం రానున్న రెండు రోజుల్లోపూర్తి చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్‌లు వెంకటేశ్వర్లు, డిపిఓ నారాయణ రావు, జడ్పి సీఈవో విజయలక్ష్మి, ఆర్డిఓ మంగిలాల్ పాల్గొన్నారు.

# పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం




**విశ్వంభర, నారాయణఖేడ్:** పేదలు, రైతులు మహిళల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయంగా నేడు కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. గురువారం నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలోని కంగ్టి మండల కేంద్రంలో బస్వ ప్రదీప్ ఫంక్షన్ హాల్ లో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే సంజీవరెడ్డి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పేదవానికి , రైతులకు మహిళలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి మా ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. మా ప్రభుత్వం పార్టీలకతీతంగా పేద మధ్య తరగతి ప్రజలకు కల్యాణ లక్ష్మి చెక్కులను అందివ్వడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పోలీస్ యాక్ట్ అమలు



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** మండల పరిధిలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని ఇది ప్రజలు గుర్తించి పోలీసులు యాక్ట్ అనుగుణంగా నడుచుకోవాలని పెద్ద శంకరంపేట ఎస్సై శంకర్ అన్నారు. వినాయక చవితి పండగ సందర్భంగా మండలంలోని ఉత్లూరు గ్రామంలో పోలీస్ యాక్ట్ పై ప్రజలకు అవగాహన కల్పించారు. వినాయక చవితి పండగ గురించి ముందుగా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. జిల్లాలో పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున ఎవరు కూడా డిజె లను పెట్టడానికి వీలులేదని ఒకవేళ అనుమతి లేకుండా డీజే పెట్టినచో కేసులు నమోదు చేసి డీజే ని సీజ్ చేయడం జరుగుతుందని అన్నారు. వినాయక మండపాలను తగు జాగ్రత్తలు తీసుకొని పెట్టవలసిందిగా పేర్కొన్నారు.

# 83 మంది డీటీలకు తహశీల్దార్లుగా పదోన్నతి

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో 83 మంది డిప్యూటీ తహశీల్దార్లకు తహసీల్దార్లుగా ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా సీఎం, రెవెన్యూ మంత్రి, సీసీఎల్ఏకు టీజీటీఏ ధన్యవాదాలు తెలిపింది. తెలంగాణ ఉద్యోగుల చైర్మన్ లచ్చి రెడ్డి, టీజీటీఏ కృషి ఫలితంగానే డీటీలకు తహశీల్దార్లుగా ప్రభుత్వం పదోన్నతి కల్పించిందని తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. గతంలోనూ పదోన్నతులను ఇప్పించిన చరిత్ర టీజీటీఏకే ఉందన్నారు. ఈ మేరకు తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ రాములు, ప్రధాన కార్యదర్శి రమేశ్ పాక, సెక్రటరీ జనరల్ ఫూల్‌సింగ్ చౌహాన్, మహిళా విభాగం అధ్యక్షురాలు రాధ, సీఎం రేవంత్, రెవెన్యూ శాఖ మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి, సీసీఎల్ఏ నవీన్ మిట్టల్‌కి, తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పదోన్నతుల కోసం ఎదురు చూసే డీటీలకు తహశీల్దార్లుగా అవకాశం కల్పించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు.

# ప్రజారోగ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలి

**విశ్వంభర, భూపాలపల్లి :** ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి, గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా చూడాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణ చర్యలు, వసతి గృహాల్లో సోలార్, ఆర్ ఓ ప్లాంట్ ఏర్పాటు, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు, మహిళాశక్తి తదితర అంశాలపై పంచాయతీ రాజ్, విద్యా, డీఆర్డీఏ, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతి రాజ్, గిరిజన సంక్షేమ, టీజీఈ డబ్ల్యూఐడీసీ, ఆర్ డబ్ల్యూ ఎస్, డీపీఎం, ఏపీఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజారోగ్య సమస్యలు, సీజనల్ వ్యాధులపై తక్షణం స్పందించాలని సూచించారు. డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాలు ప్రబలకుండా మండల ప్రత్యేక అధికారులు వైద్య సేవలు పర్యవేక్షణ చేయాలని అన్నారు. వ్యాధి ప్రబలే ప్రాంతాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి జ్వరాలు ప్రబల కుండా నియంత్రణ చేయాలని తెలిపారు. జ్వర పీడితులు ఎక్కువగా ఉండే గ్రామాలను గుర్తించి వారిని ప్రభుత్వా సుపత్రులకు తరలించాలని ఆదేశించారు. టీ హబ్ ద్వారా వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, వైద్య పరీక్షల రిపోర్టులు ఆధారంగా తక్షణమే వైద్య సేవలు అందించాలని సూచించారు. వసతి గృహాల్లో సోలార్, ఆర్ ఓ ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు ఇవ్వాలని గతంలో జరిగిన సమావేశంలో ఆదేశాలు ఇచ్చామని నేటి వరకు ఒక్కరూ ప్రతిపాదనలు ఇవ్వలేదన్నారు. మండల ప్రత్యేక అధికారులు, మండల అధికారులు ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, అన్ని శాఖల వసతి గృహాలు ఆకస్మిక తనిఖీలు చేయాలని ఆదేశించారు. ఎలాంటి సమాచారం లేకుండా అకస్మాత్తుగా తనిఖీలు చేయాలని సమాచారం తెలియకుండా గోప్యత పాటించాలని స్పష్టం చేశారు. మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీఓలు సంయుక్తంగా ప్రతిపాదనలు అందచేయాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరిగిన పనులకు చెల్లింపులు చేసేందుకు ఎంబీ ఆధారంగా బిల్లులు చెల్లింపునకు నిధులు. మంజూరు చేస్తామని అన్నారు. జిల్లాలో 265 పాఠశాలల్లో పనులు చేపట్టగా 182 పాఠశాలల్లో మొత్తం పనులు పూర్తి అయ్యాయని, మిగిలిన 83 పాఠశాలల పనులు పురోగతిలో ఉన్నట్లు తెలిపారు. ఎంపీడీఓ, ఇంజినీరింగ్ అధికారులు బిల్లులు చెల్లింపులో జాప్యం జరుగకుండా చూడాలని ఆదేశించారు. కలెక్టరేట్ నందు వారం రోజుల్లో మహిళా శక్తి కాంటీన్ ఏర్పాటు చేయాలని డీఆర్డీఏ అధికారులను ఆదేశించారు. చెల్పూర్‌లో మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని సూచించారు. మరుగుదొడ్లు లేని కుటుంబాలకు మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉందని తెలిపారు. ఇంకుడు గుంతలు నిర్మాణం కూడా చేపట్టాలని సూచించారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీపీఓ నారాయణ రావు, జడ్పీసీఈవో విజయలక్ష్మి, డీఈఓ రాజేందర్, మండల ప్రత్యేక అధికారులు, అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రణాళిక పద్ధతిలో పనులను పూర్తి చేయాలి

## దుండిగల్ మునిసిపాలిటీ సాధారణ సర్వ సభ్య సమావేశం, హాజరైన ఎంపీ ఈటెల రాజేందర్

**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుందిగల్ మునిసిపాలిటీ గండిమైసమ్మలోని పురపాలక కార్యాలయంలో గురువారం పురపాలక చైర్-పర్సన్ శంభీపూర్ కృష్ణవేణి కృష్ణ అధ్యక్షతన జరిగిన సాధారణ సర్వసభ సమావేశ కార్యక్రమంలో పాల్గొన్న మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రణాళిక పద్ధతిలో పనులను పూర్తి చేయాలని అధికారులను సూచించారు. మునిసిపాలిటీలోని డ్రైనేజీ, మంచినీటి, ఫాగింగ్, రోడ్లు, అంతర్గత రోడ్లు అంశాలపై చర్చించారు. పార్లమెంట్ సభ్యులుగా గెలుపొందిన తరువాత మొదటి సారిగా కౌన్సిల్ సమావేశానికి హాజరైన సందర్భంగా కౌన్సిల్ సభ్యులందరూ వారిని శాలువాలతో సత్కరించారు. మున్సిపల్ శాఖ ఏఈగా బాధ్యతలు చేపట్టిన సురేందర్ నాయక్‌కు సత్కరించారు. నిజాంపేట్‌కు బదిలీపై వెళ్లిన ప్రవీణ్ కుమార్‌కు, వీడ్కోలు పలికి సత్కరించారు. వైస్ చైర్మన్ పద్మారావు, కమీషనర్ సత్యనారాయణ, ఎమ్మార్వో మతీన్, కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, గోపాల్ రెడ్డి, జక్కుల కృష్ణ యాదవ్, జక్కుల విజయ శ్రీనివాస్, ఆనంద్ కుమార్, రమాదేవి, రాము గౌడ్, మహేందర్ యాదవ్, కోల సాయి బాబా, మైసిగారి సుజాత వెంకటేష్, ఎల్లుగారి సత్యనారాయణ, శివనురి నవనీత మల్లేష్, నర్సింగం భారత్, పీసరి బాలమణి కృష్ణా రెడ్డి, బెంబడి వనితా బుచ్చిరెడ్డి, శామీర్ పేట సంధ్యా హనుమంత్ రావు, మాదాస్ వెంకటేష్,అర్కలఅనంతస్వామి, జోసెఫిన్ సుధాకర్, ఆర్‌ఓ సునంద, శాఖల సిబ్బంది పాల్గొన్నారు



## బిజినెస్ మేనేజ్‌మెంట్ హెడ్‌గా ప్రొ. జహంగీర్



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ మండలం చందేపల్లి గ్రామానికి చెందిన ఎర్ర జహంగీర్ ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం హెడ్ గా ప్రొఫెసర్ వై జహంగీర్ మాదిగ పదవి బాధ్యతలు స్వీకరించారు. 50 ఏళ్ల ఉస్మానియా యూనివర్సిటీ చరిత్రలో దళిత ముద్దుబిడ్డ దళిత వర్గాల మార్గదర్శకులు ఎర్ర జహంగీర్ మాదిగ మొట్ట మొదటిసారిగా ఉస్మానియా యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం హెడ్ గా నియమితులయ్యారు. ఆయన మాట్లాడుతూ.. నా సీనియర్ ప్రొఫెసర్లు, తన సహోద్యోగులందరికీ ధన్యవాదాలు తెలిపారు. బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం హెడ్‌గా నియమితులవడం నాకు ఒక గొప్ప అవకాశంగా భావిస్తునని అని, నా విభాగానికి నా వంతు కృషి చేస్తానని అన్నారు. అనుబంధ కళాశాలలు మరియు రీసెర్చ్ స్కాలర్లు మరియు విద్యార్థుల అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం హెడ్ గా ప్రొఫెసర్ వై జహంగీర్ మాదిగ నియామకం కావడంతో చందేపల్లి గ్రామంలోని పెద్దలు, యువకులు, గ్రామస్తులు అందరూ సంతోషం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.

## కలెక్టర్, ఎమ్మెల్యేలకు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు



**విశ్వంభర, కల్వకుర్తి:** కల్వకుర్తి పట్టణానికి చెందిన బ్రహ్మకుమారిస్ ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ బడావత్ సంతోష్ నాయక్‌కు కల్వకుర్తి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి, బీకే విజయ, బీకే సుజ్ఞాని రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సంఘానికి సంబంధించిన కరపత్రాలను అందజేశారు. పీబీసీ సభ్యులు బాలాజీ సింగ్ కల్వకుర్తి మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంజీవ యాదవ్, బ్రహ్మకుమారి సభ్యులు పాల్గొన్నారు.

## అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



**విశ్వంభర, తంగళ్ళపల్లి:** మీ సేవా ద్వారా వచ్చే దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. సిరిసిల్ల తంగళ్లపల్లిలోని తహసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డ్స్, సిబ్బంది హాజరు రిజిస్టర్లు పరిశీలించారు. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన రైతులతో మాట్లాడారు. దరఖాస్తు చేసుకుని ఎన్ని రోజులు అయిందని, ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని అడిగి తెలుసుకొని, రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడారు. సిబ్బంది సమయ పాలన పాటించాలని సూచించారు. రిజిస్ట్రేషన్లు పెండింగ్‌లో పెట్టవద్దని, ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. తంగళ్లపల్లి తహసీల్దార్లు ఎండీ షరీఫ్ మొహియొద్దీన్, జయంత్ పాల్గొన్నారు.

## రేషన్ కార్డులు లేని రైతుల రుణమాఫీ నిర్ధారణ



**విశ్వంభర, రామన్నపేట :** రామన్నపేట మండలం తుమ్మలగూడెం గ్రామంలో రుణమాఫీ కోసం రేషన్ కార్డ్ లేని రైతుల యొక్క కుటుంబ సభ్యుల నిర్ధారణ కార్యక్రమం ప్రారంభమయ్యింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అజాజ్ అలీ ఖాన్, ఏఈఓలు ఎం.కిరణ్, ఎం.వెంకన్న, ఎం.శ్రీనివాస్, పి.శ్రీనివాస్, పంచాయతీ సెక్రటరీ రసూల్, గ్రామ పెద్దలు, గ్రామ రైతులుపాల్గొన్నారు.

## సౌదీ నుంచి మెట్‌పల్లి చేరిన రామస్వామి మృతదేహం



**విశ్వంభర, జగిత్యాల:** మెట్ పల్లి పట్టణానికి చెందిన అల్లే రామస్వామి గత 18సంవత్సరాలుగా గల్ఫ్ దేశాలలో పని చేస్తూ తన జీవనాన్ని కొనసాగిస్తున్నారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమవుతున్న రామస్వామి ఈ నెల 17న సౌదీ అరేబియాలోనీ రియాద్ సిటీలో గుండె పోటుతో మృతి చెందారు. మృతుడికి భార్య, ముగ్గురు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. రామస్వామి మృతితో అతడి కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయారు. గల్ఫ్ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టి, మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. గతంలో వేములవాడ నియోజకవర్గంలో సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ద్వారా 5 లక్షల రూపాయలు ఇచ్చి గల్ఫ్ మృతుల కుటుంబాలను అదుకున్నట్టే రామస్వామి కుటుంబానికి కూడా 5 లక్షల రూపాయల సాయాన్ని అందించాలని, ఇక నుండి గల్ఫ్ నుంచి తెలంగాణకు ఏదైనా మృతదేహం వస్తె దాని వెంబడే 5 లక్షల రూపాయలు నగదు సాయాన్ని ప్రభుత్వం చొరవ చూపాలని గల్ఫ్ జేఏసీ నాయకులు కంతం రాజు అన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఒక వరం



**విశ్వంభర, కుత్బుల్లాపూర్**: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఒక వరమని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి , కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా పున్నారెడ్డి మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం, కాంగ్రెస్ నాయకులు ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు తెలుసుకుంటూ ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకువెళ్తూ ప్రజల సమస్యలను తీరుస్తున్నట్లు తెలిపారు.

## ఇందిరా ఫెల్లోషిప్ బూట్ క్యాంప్



**విశ్వంభర, రామన్నపేట:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, కీసర మండలం, రాంపల్లి దాయార గ్రామంలోని బాలవికాస్ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఇందిరా ఫెలోషిప్ బూట్ క్యాంపునకు ముఖ్యఅతిథిగా హాజరైన భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇంచార్జి ఆత్రం సుగుణ, రామన్నపేట పట్టణ కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టీపీసీసీ మాజీ కార్యదర్శి గోదాసు పృథ్వీరాజ్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని శాలువాలు, బొకేలతో సన్మానించారు. ఈ బూట్ క్యాంప్ ను ఉద్దేశించి ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్తు తరాల అభివృద్ధి మహిళలపైనే ఆధారపడి ఉందన్నారు. మహిళలు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకొని, ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్ళినప్పుడే సాధికారిక సాధ్యమవుతుందని చెప్పారు. కుటుంబం అభివృద్ధి చెందాలన్నా.., కుటుంబ సభ్యుల జీవన విధానం ఒక నాణ్యమైనదిగా కొనసాగాలన్నా మహిళలే కీలకమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఇందిరా ఫెలోషిప్ నాయకురాలు డాక్టర్ సల్ల సౌజన్య, యూత్ కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ ఒంగోలు వెంకన్న, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**విశ్వంభర, రామన్నపేట: కల్వకుంట్ల కవితకు బెయిల్ వచ్చిన సందర్భంగా గురువారం ఎర్రవెల్లి ఫామ్ హౌస్‌లో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ని కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, యువజన విభాగం రాష్ట్ర నాయకులు కాల్య శ్రవణ్ కుమార్.**



## రుణమాఫీ కోసం మండల నోడల్ అధికారులను సంప్రదించాలి

**విశ్వంభర, భూపాలపల్లి:** జిల్లాలో రుణమాఫీ కానీ రైతుల సమస్య పరిష్కారానికి మండల స్థాయిలో నియమించిన నోడల్ అధికారులను సంప్రదించాలని జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ భాస్కర్ తెలిపారు. రైతు కుటుంబాల నిర్ధారణ కొరకు జిల్లాలో ఉన్న 36 బ్యాంక్ బ్రాంచిలలో 4190 మంది రైతులు ఒంటరిగా ఉన్నారని, వీరి కుటుంబ వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదించడం కొరకు ఆయా గ్రామాల్లో షెడ్యూలు ప్రకారం వ్యవసాయ అధికారులు మీ గ్రామాలను సందర్శిస్తారని తెలిపారు. కావున రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. మీ ఖాతా రుణ మాఫీ జాబితాలో కనిపించక పోయినా, కుటుంబంలో యజమాని లేదా యజమానురాలు లేకపోయినా, చనిపోయినా, కేసులు ఉన్నా వివరాలను సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి వ్రాత పూర్వకంగా తెలియచేయాలని అన్నారు. మండలాల వారీగా నోడల్ అధికారుల వివరాలను ఆయన వెల్లడించారు. భూపాలపల్లికి సతీశ్ కుమార్ మండల వ్యవసాయ అధికారి 7288894772, చిట్యాలకు శ్రీనివాస్ రెడ్డి మండల వ్యవసాయ అధికారి 9110388920, టేకుమట్లకు సారయ్య, మండల వ్యవసాయ అధికారి 9490585578, రేగొండకు వాసుదేవ రెడ్డి మండల వ్యవసాయ అధికారి 7288894775, మొగుళ్లపల్లి కి సురేందర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి, 7288895776. ములుగు ఘనపురం కు ఐలయ్య, మండల వ్యవసాయ అధికారి, 7288894773. కాటారంకు సరిత వ్యవసాయ విస్తరణ అధికారి: 9491470229, మహదేవ్ పూర్ కు ధర్మేందర్, వ్యవసాయ విస్తరణ అధికారి: 9052400390, మల్హర్ రావుకు సుధాకర్ మండల వ్యవసాయ అధికారి 8019900361, మహా ముతారం, శివకృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారి 9381482448. పలిమెలకు పృథ్వి, వ్యవసాయ విస్తరణ అధికారి 7288894161లను సంప్రదించాలని ఆయన రైతులకు సూచించారు.

## ప్రజాసేవలో ఎమ్మెల్యే కేపీ.వివేకానంద



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద గురువారం నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సామాన్య ప్రజలు, పలు సంక్షేమ సంఘాల ప్రతినిధులు స్థానికంగా నెలకొన్న సమస్యలను కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద దృష్టికి తీసుకొచ్చారు. వాటిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం కోరటికల్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త సయ్యద్ చాంద్ పాషా తండ్రి సయ్యద్ యూసఫ్ అనారోగ్య కారణంగా మరణించారు. బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేహెచ్‌ఆర్ ఫౌండేషన్ అధినేత కొప్పుల హరిదీప్ రెడ్డి సహకారంతో 5000/- రూపాయల ఆర్థిక సహాయాన్ని గ్రామ మాజీ సర్పంచ్ కోల సత్తయ్య గౌడ్ అందించారు. ఈ కార్యక్రమంలో బీఆరెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నరకుడు బిందెల సైదులు, పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు చుంచు మల్లయ్య, మాజీ సర్పంచ్ పెండెం పురుషోత్తం, బీఆర్ఎస్ మండల కార్యదర్శి సోలిపురం రామ్ రెడ్డి, బీఆర్ఎస్వీ మండలాధ్యక్షుడు చుంచు నాగరాజు, బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ ఉపాధ్యక్షులు చిన్నం ఇస్తారి, ఎలిమినేటి గోపాల్, చుంచు సుభాష్, చుంచు రాజయ్య, గంధశీల భిక్షపతి, శివరాత్రి ఎల్లయ్య, బూషి యాదగిరి, నల్ల మహేష్, బూషి సాయిబాబా, బొంత విఘ్నేష్, కందుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# పోస్టర్ ఆవిష్కరణ

### ర్యాలీలో బ్యాండ్ మేళా, డీజే, బైక్ ర్యాలీలు నిషేధం



**విశ్వంభర, కరీంనగర్:** ఈద్ మీలాదున్నబీ మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకల సందర్భంగా సున్నీ మర్కజీ మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో 12 రోజుల ఆధ్యాత్మిక సదస్సులకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సున్నీ మర్కజీ మిలాద్ కమిటీ అధ్యక్షుడు హాఫీజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి యూసుఫ్, మౌలాన అబ్దుల్ ఖయ్యూమ్ జియాయి మాట్లాడుతూ.. గత ఏడాది మాదిరిగా ఈ ఏడాది కూడా ఘనమైన ఏర్పాట్లు చేశామన్నారు. సెప్టెంబర్4 నుంచి 15వరకు ఆధ్యాత్మిక సదస్సులు (జల్సా) ఉంటాయని తెలిపారు. చివరి రోజు మిలాదున్నబి సందర్భంగా నగరంలోని జామ మస్జిద్ ప్రాంగణం నుంచి ర్యాలీగా టవర్ సర్కిల్, రాజీవ్ చౌక్ మీదుగా సయ్యద్ కరీముల్లాషా దర్గాహ్ వద్ద ముగుస్తుందన్నారు. సున్ని మర్కజి మీలాద్ కమిటీ ఆధ్వర్యంలో కొనసాగే ర్యాలీలో ఎలాంటి డీజే సౌండ్ సిస్టం స్పీకర్ బాక్స్‌లు ఉండవని బ్యాండ్ మేళా సైతం ఉండదని బైక్ ర్యాలీలు పూర్తిస్థాయిలో తమంతట తామే స్వీయ నిషేధం పాటిస్తున్నామని స్పష్టం చేశారు. నగరంలో నిర్వహించే బైక్ ర్యాలీకి సున్నీ మర్కజి మీలాద్ కమిటీకి ఎలాంటి సంబంధం ఉండబోదని చెప్పారు. కార్యక్రమంలో అబ్దుల్ కరీం జాహిద్, ముఫ్తి అబుల్ కలాం మిస్బహి, సయ్యద్ షా యుసుఫోద్దీన్ ఖాద్రి రియాజ్, హాఫిజ్ ఖాజా బాబా, హాఫిజ్ సోహైల్ బిన్ అబ్దుల్లా, సలావుద్దీన్ ఖాద్రి, సయ్యద్ అబ్బాస్‌హుస్సేన్,యూసుఫ్‌బేగ్,ఆయుబ్‌ఖాన్, హబీబుద్ధిన్ ఖాద్రి, ఖాజా, పాల్గొన్నారు.

# ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీగా అమరావతి



**విశ్వంభర, అమరావతి:** 90 రోజుల్లో సీఆర్డీఏ కార్యాలయ నిర్మాణం పూర్తి కావాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. రాజధాని ప్రాంతంలో త్వరితగతిన జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సిటీగా అమరావతిని తీర్చిదిద్దాలన్నారు. ఏఐ, అమరావతిని కలిపి ఆంగ్లంలో లోగో రూపొందించాలని, అత్యాధునిక టెక్నాలజీలను ఉపయోగించి నాణ్యతలో ఎక్కడా రాజీ పడొద్దని సీఎం దిశా నిర్దేశం చేశారు. హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు పైనా సీఎం సమీక్షించారు. హ్యాపీ నెస్ట్ ప్లాట్లన్నీ ఒక్క గంటలో అమ్ముడు పోయాయని గుర్తు చేసుకున్న సీఎం.. గత ప్రభుత్వ చర్యల కారణంగా వచ్చిన నష్టాన్ని పూడ్చేలా విధానాలు రూపొందించాలని ఆదేశించారు. రాజధాని ప్రాంతంలో జంగిల్ క్లియరెన్స్ కోసం 190 ప్రొక్లెయిన్లు వినియోగిస్తున్నామని. 60 శాతం పూర్తయినట్టు అధికారులు వివరించారు. మెట్రో రైలు ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని సీఎం స్పష్టం చేశారు. విశాఖపట్నం, విజయవాడలో చేపట్టబోయే మెట్రో రైలు ప్రాజెక్టు పనులు త్వరితగతిన చేపట్టాలని సీఎం ఆదేశించారు. అమరావతిలో 3,550 ఎకరాలు సేకరించాల్సి ఉంది: మంత్రి నారాయణ ప్రస్తుతం ఖజానా అంతా ఖాళీ అయిందని, అమరావతి రైతులకు సెప్టెంబరు 15లోగా వార్షిక కౌలు చెల్లిస్తామని ఏపీ మంత్రి నారాయణ తెలిపారు. రాజధాని అమరావతిపై సీఎం సమీక్ష అనంతరం 'ఆయన మీడియాతో మాట్లాడారు. "హ్యాపీనెస్ట్ ప్రాజెక్టుకు సీఎం క్లియరెన్స్ ఇచ్చారు. రూ.700 కోట్లతో గతంలో ప్రారంభించాం.. ప్రస్తుతం ఆ ప్రాజెక్టు పూర్తి కావాలంటే రూ.930 కోట్లు కావాలి. సీఆర్డీఏ కార్యాలయాన్ని త్వరగా పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. విశాఖ, విజయవాడ మెట్రోలు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. విజయవాడ మెట్రో ఫేజ్-1 కోసం రూ.11వేల కోట్లు, ఫేజ్-2 కోసం రూ.14వేల కోట్లు అవసరం. కొమ్మాది జంక్షన్ నుంచి స్టీల్ ప్లాంట్ వరకు విశాఖ మెట్రో ఫేజ్-1 కోసం రూ.11,400 కోట్లు అవసరం. కొమ్మాది జంక్షన్ నుంచి భోగాపురం - విమానాశ్రయం వరకు విశాఖ మెట్రో ఫేజ్-2 కోసం రూ.5,700 కోట్లు కావాలి. ట్రాఫిక్ సమస్యలు తగ్గాలంటే మెట్రో వల్లే సాధ్యం. అమరావతిలో ఇంకా 3,550 ఎకరాలు సేకరించాల్సి ఉంది" అని మంత్రి నారాయణ తెలిపారు.

## జనగామ కలెక్టరేట్‌ను సందర్శించిన గవర్నర్

### సంక్షేమం గురించి వివరించిన అధికారులు



**విశ్వంభర, జనగామ:** ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటన సందర్భంగా రాష్ట్ర గవర్నర్ గురువారం జిష్ణుదేవ్ వర్మ జనగామ జిల్లాకు చేరుకున్నారు. జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్?లు శాలువాలు కప్పి, పూల మొక్కలతో సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్ర గవర్నర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కలెక్టరేట్?లో ఏర్పాటు చేసిన వివిధ శాఖల స్టాళ్లను సందర్శించి పరిశీలించారు. అనంతరం జిల్లా అభివృద్ధి, సంక్షేమం, విద్య, వైద్య సదుపాయాల గురించి అధికారులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా గవర్నర్‌కు వివరించారు. తెలంగాణ ఏర్పడ్డాక ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 2016లో జనగామ జిల్లా ఏర్పడిందని జిల్లా కలెక్టర్ గవర్నర్?కు వివరించారు.

**మొక్కలు నాటిన గవర్నర్ ..**

అలాగే పెంబర్తి హస్తకళలు జిల్లాకే తలమానికమని, పెంబర్తి గ్రామం 2023లో ఉత్తమ టూరిజం గ్రామంగా యునెస్కో గుర్తింపు పొందిందని తెలిపారు. అదే విధంగా ఆరోగ్య శాఖ, విద్యా శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని మహిళా శక్తి పథకం, స్వయం సహాయక సంఘాలకు చెందిన పలు అంశాలపై కలెక్టర్ వివరించారు. అనంతరం ఓబుల్ కేశ్వాపురం వెంకటేశ్వరాలయాన్ని సందర్శించిన గవర్నర్ స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు.

**కొలనుపాక జైన దేవాలయాన్నిసందర్శించిన గవర్నర్..**

జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కొలనుపాక జైన దేవాలయాన్నిసందర్శించారు. గవర్నర్‌కు ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యుడు బీర్ల ఐలయ్య, భువనగిరి పార్లమెంటు సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హనుమంతు కే.జండగే, డిప్యూటీ పోలీస్ కమిషనర్ రాజేష్ చంద్ర స్వాగతం పలికారు. అనంతరం కొలనుపాకలో శ్రీ సోమేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారిని దర్శించుకొని, అభిషేక పూజలో పాల్గొన్నారు. వేద పండితులు, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో గవర్నర్ కు స్వాగతం పలికారు. తొలుత దేవాలయం ముందు బతుకమ్మలు, బోనాలు, కోలాటలతో మహిళలు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, జనగామ శాసనసభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఘనపూర్ (స్టేషన్) ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జాయింట్ సెక్రటరీ భవాని శంకర్, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్, (రెవెన్యూ) రోహిత్ సింగ్ పాల్గొన్నారు.

# ఘనంగా మైసమ్మ తల్లి బోనాలు



**విశ్వంభర, ఎల్బీనగర్:** మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణ పురం డివిజన్ లోని రైతుబజార్ బోనాల పండుగ సందర్భంగా మైసమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు పండుగ అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి బొక్క జంగారెడ్డి, పున్న గణేష్, మధుసూదన్ , ధనరాజ్ , జ్ఞానేశ్వర్ ,దుబ్బాక శేఖర్,రాజు నాయక్,సురేష్,శేఖర్ ముదిరాజ్,అశోక్,కల్యాణ్ , భూపాల్ రెడ్డి శ్రీధర్, సర్వర్, నబీ,లింగస్వామి, ప్రేమ్నాయక్, శ్రీనాథ్, , అనుదీప్,షఫీ,శ్రీకాంత్ సంతోష్ పాల్గొన్నారు.

# ఎన్నికలు ఎప్పుడొచ్చినా మాదే విజయం

### త్వరలోనే జీహెచ్‌ఎంసీ యూనియన్ గుర్తింపు ఎన్నికలు

### మున్సిపల్ సహకార మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ ధీమా



**విశ్వంభర హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కోటిన్నర మంది జనాభాకు అత్యవసర సేవలు అందించే జిహెచ్ఎంసి యూనియన్ గుర్తింపు ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తమ యూనియన్ విజయం సాధిస్తుందని ఐఎన్టియుసి గుర్తింపు పొందిన మున్సిపల్ సహకార మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ ధీమా వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసి లోని పలు ఇతర యూనియన్ల నుంచి సుమారు 200 మంది గురువారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోమున్సిపల్ సహకార మజ్దూర్ యూనియన్ లో చేరారు. వారందరికీ పార్టీ యూనియన్ కండువా కప్పి ఆదిల్ షరీఫ్ యూనియన్ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆదిల్ షరీఫ్ మాట్లాడుతూ త్వరలోనే జిహెచ్ఎంసి పరిధిలో యూనియన్ గుర్తింపు ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. నిత్యం కార్మికులు ఉద్యోగుల మధ్యనే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి వారికి దీర్ఘకాల ప్రయోజనాలను సాధించేందుకు తమ యూనియన్ రాజీలేని పోరాటం చేస్తుందని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పలువురు శానిటరీ జవాన్లు టాక్స్ ఇన్స్పెక్టర్లు, సూపరింటెండెంట్లు గురువారం తమ యూనియన్ లో చేరినట్లు ఆయన తెలిపారు. యూనియన్ ఉపాధ్యక్షుడు జి శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ రామకృష్ణ, కోశాధికారి కే రమేష్, అడిషనల్ జనరల్ సెక్రెటరీ కే శివకుమార్, ఉపాధ్యక్షుడు ఏం. మోజస్, మహిళ విభాగం నాయకురాలు ఎల్. మెర్సీ తదితరులు పాల్గొన్నారు.

# కంటి శస్త్ర చికిత్స వికటించి వృద్ధుడి మృతి

**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని అంబటిపల్లి గ్రామానికి చెందిన కనకయ్య అనే వృద్ధుడిని కంటి శస్త్ర చికిత్స కోసం బంధువులు హన్మకొండ ఆరెపల్లి సమీపంలోని రిలీఫ్ హాస్పిటల్‌లో చేర్పించారు. శస్త్ర చికిత్స నిర్వహించిన అనంతరం సీరియస్‌గా ఉందని చెప్పిన వైద్యులు మధ్యాహ్నం తర్వాత చనిపోయినట్లు బంధువులకు తెలిపారు. దీంతో బంధువులు ఆసుపత్రిలో ఆందోళనకు దిగారు. ఠాగూర్ సినిమాను తలపించే రీతిలో ఉదయం నుంచి హైడ్రామా క్రియేట్ చేసి డబ్బులు వసూలు చేసి పేషెంట్ చనిపోయాడని ప్రకటించారని, వైద్యుల నిర్లక్ష్యంతోనే చనిపోయాడని బంధువులు ఆరోపించారు. చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# యువకుడు మిస్సింగ్



**విశ్వంభర, ఘట్కేసర్:** మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మున్సిపాలిటీ చందుపట్ల గూడ గ్రామానికి చెందిన కంభం భాను ప్రకాశ్ రెడ్డి, వయస్సు 24 సంవత్సరాలు బిటెక్ పూర్తి చేసి గత రెండు సంవత్సరాల నుంచి ఇంటి దగ్గరే ఉంటున్నాడు. రెండు నెలల క్రితం సిటీకి వెళ్లి ఏదైనా జాబ్ చూసుకుంటానని, హాస్టల్లో ఫ్రెండ్ రూంలో గాని ఉంటానని చెప్పి ఒక బైక్, లాప్టాప్ తీసుకొని ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఆదివారం అర్ధ రాత్రి ఒంటి గంటకు నడుచుకుంటూ ఇంటికి వచ్చాడు. అతని తల్లి దండ్రులు బైక్, లాప్టాప్ ఏది, నడుచుకుంటూ ఎందుకు వచ్చావు అని అడిగితే నేను డబ్బుల కోసం బైక్ ల్యాప్టాప్ కుదపెట్టానని ఇప్పుడు మీరు డబ్బులు ఇస్తే మళ్లీ అవి తీసుకొని వస్తానని అన్నాడు. తల్లిదండ్రులు డబ్బులు ఇవ్వనందుకు భాను ప్రకాష్ ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఫోన్ స్విచ్ ఆఫ్ అవడంతో అప్పటినుంచి తల్లిదండ్రులు తెలిసిన ప్రదేశాల్లో వెతికిన ఆచూకీ తెలియకపోవడంతో గురువారం ఘట్కేసర్ పోలీస్ స్టేషన్‌లో తండ్రి భాస్కర్‌రెడ్డి ఫిర్యాదుచేయగా పోలీసులుమిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## పోలీసు విధులకు ఆటంకం కలిగించిన నలుగురిపై కేసు నమోదు

**విశ్వంభర, మేడిపల్లి :** మేడ్చల్ జిల్లా మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బోడుప్పల్ హేమానగర్ రోడ్ నెంబర్ 10లో గురువారం మధ్యాహ్నం 12:30 నిమిషాలకు పెట్రోల్ కారులో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది రోడ్డుమీద మద్యం సేవిస్తున్న నలుగురు వ్యక్తులను రాజ్ కుమార్, విక్రమ్ యాదవ్, బిట్టుకుమార్ యాదవ్, చందన్ కుమార్ అక్కడి నుంచి ఇంటికి వెళ్ళమని కోరగా ఆ నలుగురు వ్యక్తులు పోలీసు విధులకు ఆటంకం కలిగించి దురుసుగా ప్రవర్తించారు. 132,121(1),118(1) 3(5) , 3 యాక్ట్ ప్రకారం ఆ నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.

## సెప్టెంబరు 19న మిలాద్-ఉన్ నబి ప్రదర్శనలు

### ప్రభుత్వ విజ్ఞప్తికి మిలాద్ కమిటీ సానుకూలత



**విశ్వంభర, హైదరాబాద్:** మిలాద్-ఉన్-నబి ప్రదర్శనలను సెప్టెంబరు 19వ తేదీన నిర్వహించుకునేందుకు మిలాద్ కమిటీ ప్రతినిధులు అంగీకరించారు. మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని వచ్చే నెల 16న మిలాద్ ఉన్ నబి వేడుకలు ఘనంగా నిర్వహించాలని మిలాద్ కమిటీ నిర్ణయించింది. మిలాద్ ఉన్ నబి ఏర్పాట్లపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం రాత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సెప్టెంబరు ఏడు నుంచి గణేష్ నవరాత్రోత్సవాలు, 17న గణేష్ నిమజ్జనం ఉన్న విషయం చర్చకు వచ్చింది. దీంతో మిలాద్ ఉన్ నబీ ప్రదర్శనలను వాయిదా వేసుకునే అవకాశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి, మంత్రులు మిలాద్ కమిటీ సభ్యులకు సూచించారు. ఈ అంశంపై చర్చించే బాధ్యతను మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంఐఎం ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఒవైసీ, మిలాద్ కమిటీ సభ్యులకు అప్పగించారు. సమీక్ష అనంతరం వారు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రదర్శన వాయిదా వేయాలని ప్రభుత్వ ప్రతినిధులు కోరగా మిలాద్ కమిటీ సభ్యులు సానుకూలత వ్యక్తం చేశారు. మహ్మద్ ప్రవక్త 1499వ జన్మదినం వచ్చే సెప్టెంబర్ 16న జరుగుతుందని, వచ్చే ఏడాది 1500వ జన్మదినం కనుక ఏడాది పాటు ఉత్సవాల నిర్వహణకు అనుమతించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మిలాద్ ఉన్ నబి ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. నిబంధనల ప్రకారం అనుమతులు ఇస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. మసీదుల అలంకరణ, వివిధ జిల్లా కేంద్రాల్లో ప్రదర్శనలకు అనుమతులు ఇవ్వాలని కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఒక జాబితా తయారు చేసి ఇవ్వాలని కమిటీ సభ్యులకు ముఖ్యమంత్రి సూచించారు. వాటిని పరిశీలించి తగిన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ముఖ్యమంత్రి ఆదేశించారు. సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, డీజీపీ జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ ప్రతిష్ట పెంచేలా గణేశ్ ఉత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

అప్పగించాలని, ఉత్సవ కమిటీ సభ్యులు, మండప నిర్వాహకులతో సమన్వయం చేసుకుంటూ శాంతియుతంగా ఉత్సవాలు, నిమజ్జనం కొనసాగేలా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఏ అధికారి ఏ జోన్‌లో బాధ్యతల్లో ఉన్నారు.. ఆయా ప్రాంతాల్లో ఉత్సవ కమిటీ ప్రముఖులు, మండపాల బాధ్యులు అన్నింటి వివరాలు సమగ్రంగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. అవుటర్ రింగు రోడ్డు పరిధిలో గతేడాది 1.50 లక్షల విగ్రహాలు ఏర్పాటు చేశారనే లెక్కలున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ముందుగా మండప నిర్వాహకులు ఆన్‌లైన్‌లోనో ఆఫ్‌లైన్‌లోనో అనుమతులు తీసుకోవాలని, అలా తీసుకోవడం వలన ఆయా ప్రాంతాల్లో భద్రత, ట్రాఫిక్ ఇతర ఇబ్బందులు తలెత్తకుండా చూసుకునే అవకాశం ఉంటుందన్నారు. మొత్తం విగ్రహాలను హుస్సేన్ సాగర్‌కే కాకుండా ఇతర చెరువుల్లోనూ నిమజ్జనం చేసే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు. సరూర్ నగర్‌తో పాటు పలు చెరువులు నీటితో ఉన్నాయని, ఏ ప్రాంతంలోని విగ్రహాలు ఆ ప్రాంతంలోని చెరువుల్లో నిమజ్జనం చేస్తే హుస్సేన్ సాగర్ వద్ద రద్దీ తగ్గడంతో పాటు ఆయా చెరువుల వద్ద నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లను ప్రభుత్వం ముందుగానే చేసే వీలుంటుందన్నారు. ఈ విషయంలో ఉత్సవ సమితి సభ్యులు, మండప నిర్వాహకులు ముందగానే సమాచారం ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. నిమజ్జనానికి ముఖ్య అతిథులుగా ఎవరినైనా పిలిస్తే ముందుగానే ప్రభుత్వానికి సమాచారం ఇవ్వాలని, అలాగే వీవీఐపీలు ఎవరైనా వచ్చే అవకాశం ఉంటే ముందుగా తెలియజేస్తే పోలీసు శాఖ వారి రాకపోకలకు రూట్ క్లియరెన్స్ చేయడంతో పాటు తగిన భద్రత ఏర్పాటు చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. నిమజ్జన ఊరేగింపు త్వరగా ప్రారంభిస్తే త్వరగా కార్యక్రమాన్ని ముగించుకోవచ్చని, ఫలితంగా భక్తులు ట్రాఫిక్, ఇతర ఇబ్బందులు బారిన పడకుండా చూసుకోవచ్చన్నారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి నగరం పరిధిలోని నలుగురు లోక్‌సభ సభ్యులు, ఎమ్మెల్యేల అభిప్రాయాలను తీసుకోవాలని ముఖ్యమంత్రి పోలీసులను ఆదేశించారు. సెప్టెంబరు 16న మిలాద్ ఉన్ నబి, 17న తెలంగాణలో వివిధ రాజకీయ పార్టీలు పలు కార్యక్రమాలు చేపడతాయని, అందువలన అన్ని కార్యక్రమాలకు సక్రమమైన ప్రణాళికతో ముందుకు సాగాలని, ఎక్కడా ఎటువంటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలని పోలీసులను ముఖ్యమంత్రి ఆదేశించారు. గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని భాగ్యనగర్ గణేశ్‌ఉత్సవ సమితి సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. అందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. ముందుగా మండప నిర్వాహకులు ఉచిత విద్యుత్ సరఫరాకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనుమతులు లేకుండా విద్యుత్ వినియోగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, జవాబుదారీతనం కోసమే అనుమతి చేసుకోవాలని కోరుతున్నామని తెలిపారు. నిమజ్జనం రోజైన సెప్టెంబరు 17వ తేదీన అనంత చతుర్దశి వచ్చిందని, ఆ తేదీ ప్రాముఖ్యతను తెలుపుతూ దేవాదాయ శాఖ తరఫున పర్వదిన ప్రాముఖ్యతను తెలిపే సాహిత్యాన్ని ప్రచురించాలని, ప్రచారం చేయాలని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు జి.రాఘవరెడ్డి ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావును ముఖ్యమంత్రి ఆదేశించారు. మండపాల్లో డీజేలు వాడేందుకు అనుమతి ఇవ్వాలని రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం ముందుకు వెళతామని ముఖ్యమంత్రి తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి పర్యావరణ హిత (ఈకో ఫ్రెండ్లీ) విగ్రహాలు ప్రతిష్ఠించాలని మంత్రి శ్రీధర్ బాబు ఉత్సవ సమితి నిర్వాహకులకు సూచించారు. గణేశ్ ఉత్సవాలకు సంబంధించి ఇప్పటి వరకు చేపట్టిన సమావేశాలు, ఉత్సవ సమితి సభ్యులు చేసిన సూచనలు, పరిష్కరించిన సమస్యల వివరాలను మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. మొత్తంగా 25 వేల మందితో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు డీజీపీ జితేందర్, హైదరాబాద్ సిటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అన్ని శాఖలతోనూ సమన్వయం చేసుకుంటున్నామని వారు చెప్పారు. ఉత్సవాల్లో మట్టి విగ్రహాలు వాడేలా చూడాలని, మద్యం తాగి ఇబ్బంది పెట్టే వారి విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ ఏ.వి.ఎన్.రెడ్డి కోరారు. సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనరసింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, షబ్బీర్ అలీ, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**ముఖ్యమంత్రి సమీక్షించడంపై హర్షం....**

గణేశ్‌నవరాత్రోత్సవాలు, నిమజ్జన ఏర్పాట్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా సమీక్షించడంపై భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రులు సమీక్షించేవారని, గత పదేళ్లుగా ఈ సమావేశాలకు ముఖ్యమంత్రి రాలేదని వారు తెలిపారు. ముఖ్యమంత్రి సమీక్షించడంతో పాటు ఉచిత విద్యుత్ విషయంలో సానుకూలంగా స్పందించినందుకు వారు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

# హైడ్రాను అమలు చేస్తాం: మంత్రి పొన్నం




**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో హైడ్రాను ప్రతి జిల్లాలో అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కరీంనగర్‌లోని స్పోర్ట్స్ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని, స్పోర్ట్స్ పాఠశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని . జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్‌లోని స్పోర్ట్స్ పాఠశాలలో ధ్యాన్ చంద్ చిత్రపటానికి గురువారం నివాళులర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కరీంనగర్ క్రీడా పాఠశాలకు ప్రభుత్వం నుంచి 25 లక్షల రూపాలను మంజూరు చేస్తున్నట్టు మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎఫ్‌టీఎల్ కింద చెరువులు, నాలాలపై అక్రమ నిర్మాణాలు చేపట్టిన కట్టడాలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎంత వారినైనా ఉపేక్షించకుండా ప్రభుత్వ భూములను కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు చేపడు తుందనిస్పష్టం చేశారు. గంజాయి సరఫరా చేస్తున్న వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

## కారుణ్య నియామకాలు చేపట్టాలి

విశ్వంభర - హైదరాబాదు: రాష్ట్రంలోని జిల్లా పరిషత్‌లలో కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు కల్పించుటకై జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాల పై 2016 సంవత్సరం నుంచి



దరఖాస్తు చేసుకొని ఉన్నవారికి గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఉద్యోగాలు రాలేదని తాము డిగ్రీ, పీజీ చదువులు పూర్తి చేసుకొని గత ఎనిమిదేళ్లుగా కుటుంబానికి భారంగా బతకులీడుస్తున్నామని మాకు జిల్లా పరిషత్ వివిధ కార్యాలయాలలో కారుణ్య నియామకాలకు కల్పిస్తూ అవకాశం కల్పించాలని చెప్పి జిల్లా పరిషత్ కార్యాలయంలో వివిధ హోదాలలో పని చేస్తూ చనిపోయిన కుటుంబాలకు సంబం ధించిన వారి పిల్లలు కారుణ్య నియమకాల కోసం గురువారం టిఎన్జీవో కేంద్ర సంఘ అధ్యక్షులు మారం జగదీశ్వర్ , ప్రధాన కార్యదర్శి ఎస్ఎం హుస్సేనీ ముజిబ్ , రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లుని నాంపల్లి టీఎన్జీవో కార్యాలయంలో కలిసి విజ్ఞాపన్న పత్రాన్ని అందజేసారు. టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ , ముజీబ్ మాట్లాడుతూ త్వరలో ముఖ్యమంత్రి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి తప్పకుండా దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న జిల్లా పరిషత్ లోని జూనియర్ అసిస్టెంట్ కారుణ్య నియామకాలు ఇప్పించుటకు తప్పకుండా కృషి చేస్తామని అన్నారు. ఈ వినతిపత్రం అందజేసిన వారిలో భాగ్య,ఆర్ నాగమణి,ఎస్ భారత్, కే సంతోష్, ఎన్ రాహుల్, పీ విజయ రెడ్డి, ఎన్ శ్రీకృష్ణ, పి శ్రీ కుమార్, బి కిరణ్ కుమార్, మీరాజ్ హాయ్, రామకృష్ణ, బి రమేష్, ఎం సాయి కృష్ణ, ఆర్ శ్రీకాంత్ , అజిత్ పాల్గొన్నారు..




# పొరపాటున పూజారి అకౌంట్‌లోకి కోటిన్నర రూపాయలు

**మిర్జాపూర్:** ఈ మధ్య కాలంలో బ్యాంకు లేదా ఎవరైనా వ్యక్తులు పొరపాటున గుర్తుతెలియని వ్యక్తి అకౌంట్ల్‌లోకి నగదు జమ చేయడం చూస్తున్నాం. తాజాగా ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఓ పూజారి అకౌంట్‌లోకి కూడా అలా సుమారు కోటిన్నర రూపాయలు జమ అయ్యాయి. దీంతో షాక్ అయిన పూజారి ఆ డబ్బును 24 గంటల్లోనే తిరిగి ఇచ్చేశాడు. పూజారి చేసిన పనికి అందరూ ప్రశంసిస్తున్నారు. మిర్జాపూర్‌కు చెందిన మోహిత్ మిశ్ర అనే పూజారి బ్యాంక్ ఖాతాలోకి ఆగస్టు 27న సాయంత్రం రూ.1,48,50,000 జమ అయినట్లు అతడి ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. అంత పెద్ద మొత్తాన్ని తన ఖాతాకు ఎవరు వేశారా అని ఆలోచిస్తుండగా తనకు ఓ ఫోన్ కాల్ వచ్చింది. మనీ క్యాపిటల్ లిమిటెడ్ కంపెనీకి చెందిన ఉమేశ్ శుక్ల అనే వ్యక్తి ఫోన్ చేసి పొరపాటున నగదు ట్రాన్స్‌ఫర్ చేశాడని పూజారికి చెప్పాడు. కానీ వెంటనే తిరిగి పంపించడానికి చూస్తే, అప్పటికే బ్యాంకు సమయం దాటిపోయింది. దీంతో నేను 24 గంటల్లో డబ్బులను తిరిగి జమ చేస్తానని అవతలి వ్యక్తికి హామీ ఇచ్చాడు పూజారి. ఆ తర్వాతి రోజు ఉదయం వెళ్లి చెక్కు ద్వారా మొత్తాన్ని తిరిగి జమ చేశాడు.

**ఇదీ జరిగింది...**

మిర్జాపూర్‌లోని శ్రీ మా వింధ్యవాసిని సేవా సమితి సంస్థ వింధ్యాచల్ ధామ్‌లో పూజతో పాటు జాగరణ, భండారా కార్యక్రమాలను నిర్వహిస్తుంది. పూజల కోసం దేశ, విదేశాల నుంచి భక్తులు భారీ విరాళాలను అందిస్తుంటారు. ఉమేశ్ శుక్ల వ్యక్తి కూడా ఈ సంస్థకు రూ. 11,000 విరాళం ఇచ్చేందుకు బ్యాంకుకు వెళ్లాడు. ఈ నగదుతో పాటు మరో అకౌంట్‌కు కోటిన్నర రూపాయలను జమ చేయాల్సి ఉంది. అయితే పొరపాటున పూజారి మిశ్ర అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఇది జరిగిన 24 గంటల లోపే నగదు తిరిగి ఇచ్చిన పూజారిని స్థానికులు అభినందిస్తున్నారు.

# ఆదాయానికి మించిన ఆస్తుల కేసు.. హైకోర్టులో డీకేకు ఊరట



**బెంగళూరు:** కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కు ఊరట లభించింది. ఆదాయానికి మించిన ఆస్తుల వ్యవహారంలో విచారణను కొనసాగించే విషయంపై దాఖలైన పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది.డీకే శివకుమార్ విచారణను కొనసాగించాలంటూ న్యాయస్థానంలో రెండు పిటిషన్లు దాఖలు అయ్యాయి. ఒకదాన్ని సీబీఐ దాఖలు చేయగా.. మరొకటి భాజపా ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాల్ దాఖలు చేశారు. వీటిని తాజాగా పరిశీలించిన న్యాయస్థానం విచారణను కొసాగించేందుకు వీలు లేదంటూ రెండు పిటిషన్లను కొట్టివేసింది. దీంతో డీకేకు ఊరట లభించినట్లయింది. సీబీఐ దర్యాప్తునకు సంబంధించి మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప సర్కార్ గతంలో ఇచ్చిన ఆదేశాలను ప్రస్తుత ప్రభుత్వం ఉపసంహరించుకుంది. న్యాయస్థానం తీర్పుపై స్పందించిన డీకే.. "కోర్టు తీసుకున్న నిర్ణయాన్ని గౌరవిస్తున్నా. ఇది దేవుడిచ్చిన తీర్పుగా భావిస్తున్నా" అని పేర్కొన్నారు. కాగా.. 2013-18 మధ్య అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో శివకుమార్ మంత్రిగా వ్యవహరించారు. ఆ సమయంలో డీకే సంపాదనలో రూ.74 కోట్లు లెక్కకు మించిన ఆదాయం ఉందని ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే ఆయన నివాసం, ఆఫీసుల్లో ఐటీ శాఖ సోదాలు జరిపి కొంత మొత్తాన్ని స్వాధీనం చేసుకుంది. అనంతరం ఈ వ్యవహారంలో ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మనీలాండరింగ్ దర్యాప్తు చేపట్టింది. ఈడీ విచారణ ఆధారంగా 2020లో సీబీఐ ఆయనపై కేసు నమోదు చేసింది.

# పని ప్రదేశంలో లైంగిక వేధింపుల పరిష్కారానికి షీ-బాక్స్ పోర్టల్

**దిల్లీ:** మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై జస్టిస్ హేమా కమిటీ రిపోర్ట్ గత కొన్ని రోజులుగా తీవ్ర చర్చకు దారి తీసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణ దేవీ షీ- బాక్స్ పోర్టల్ను ప్రారంభించారు. పని ప్రదేశంలో జరిగే లైంగిక వేధింపులకు సంబంధించి ఫిర్యాదులు, వాటి పరిష్కారాలకు షీ- బాక్స్. పోర్టల్ ఉపయోగపడుతోందని ఆమె పేర్కొన్నారు. అదేవిధంగా భారత ప్రభుత్వ అవసరాలకు అనుగుణంగా రూపొందించిన మంత్రిత్వశాఖ వెబ్సైట్ను ఈ సందర్భంగా ఆమె ప్రారంభించారు.

**ఏమిటీ షీ- బాక్స్ పోర్టల్..**

అధికారిక ప్రకటన ప్రకారం.. షీ- బాక్స్ పోర్టల్ దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసిన అంతర్గత కమిటీ (ICs), స్థానిక కమిటీలల్లోని (LCs) ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు అనుసంధానమై ఉంటుంది. పని ప్రదేశంలో లైంగిక వేధింపులకు గురైన బాధితులు షీ- బాక్స్ పోర్టల్లో ఫిర్యాదులు చేయవచ్చు. అంతేకాకుండా ఫిర్యాదుకు సంబంధించిన పరిష్కార స్టేటస్ను పరిశీలించుకోవచ్చు. పోర్టలు నియమించే నోడల్ అధికారి ఫిర్యాదుకు సంబంధించిన పరిష్కారాన్ని పర్యవేక్షిస్తుంటారు. ఇక, ఫిర్యాదు చేసేందుకు ముందుగా https: // shebox, wcd. gov.in/ వెబ్సైట్కి వెళ్లాలి. అందులో ఫిర్యాదు నమోదును ఎంచుకుని ఫిర్యాదు నమోదు చేయాలి. ఆ తర్వాత అందులో అడిగిన వివరాలను నమోదు చేయాలి.




# ఆస్పత్రి బోర్డుపై శిక్షల వివరాలు

- కఠిన విజిటర్ పాలసీ అమలు
- వైద్యుల భద్రతపై కేంద్రం సూచనలు

**దిల్లీ:** పనిప్రదేశంలో వైద్యుల భద్రతకు సంబంధించిన ప్రోటోకాల్‌ను నేషనల్ టాస్క్‌ఫోర్స్ రూపొందించే లోగా ఈ అంశంపై కేంద్రం, రాష్ట్రాలకు పలు సూచనలు చేయాలని సుప్రీంకోర్టు ఇటీవల ఆదేశించింది. ఈ క్రమంలోనే కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి అపూర్వ చంద్ర వైద్యారోగ్య సిబ్బంది భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, డీజీపీలకు లేఖ రాశారు. వైద్యారోగ్య సిబ్బందిపై దాడులకు పాల్పడితే బాధ్యులకు విధించే శిక్షలకు సంబంధించిన వివరాలను ఆస్పత్రి ప్రాంగణంలో స్పష్టంగా ప్రదర్శించాలని కేంద్రం పేర్కొంది.

**విజిటర్ పాస్ పాలసీని కఠినంగా అమలు చేయాలి..**

ఆస్పత్రుల్లోని కీలక ప్రదేశాల్లో సాధారణ ప్రజలు, రోగుల బంధువుల కదలికలపై నియంత్రణ ఉంచి విజిటర్ పాస్ పాలసీని కఠినంగా అమలు చేయాలని సూచించింది. ఆస్పత్రుల్లో హింసాత్మక ఘటనల నియంత్రణ వైద్యుల భద్రత కోసం అమలు చేయాల్సిన వ్యూహాల కోసం సీనియర్ వైద్యులు, పాలనాధికారులతో కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని చెప్పింది. రాత్రి వేళల్లో క్యాంపస్‌లోని ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి రెసిడెంట్ డాక్టర్లు, నర్సులు సురక్షితంగా వెళ్లేలా సదుపాయాలు కల్పించాలని కేంద్రం నిర్దేశించింది.

**ప్రతి మూలా సీసీటీవీ కెమెరాలు నిరంతరం పర్యవేక్షించాలి..**

లైంగిక వేధింపులపై విచారణ కోసం అంతర్గత కమిటీని ఏర్పాటు చేయాలని కేంద్రం, రాష్ట్రాలకు సూచించింది. క్యాంపస్‌లోని ప్రతి మూలా సీసీటీవీ కెమెరాలు పనిచేసేలా చూస్తూ వాటిని నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొంది. అందులోని డేటాను భద్రపరచాలని తెలిపింది. జిల్లా ఆస్పత్రుల్లో సెక్యూరిటీ ఆడిట్ నిర్వహించి రాత్రి వేళ పెట్రోలింగ్ నిర్వహించాలని నిర్దేశించింది. పెద్ద ఆస్పత్రుల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి అందులోని సిబ్బంది నిరంతరం సీసీటీవీలను పర్యవేక్షించాలని సూచించింది.ఆస్పత్రిని స్థానిక పోలీసు స్టేషన్‌కు అనుసంధానం చేయాలంది. బోధనాసుపత్రుల్లో నిరంతరం కలెక్టర్లు, ఎస్పీలు, ఆస్పత్రి యంత్రాంగం సంయుక్తంగా సెక్యూరిటీ ఆడిట్‌లను నిర్వహించాలని సూచించింది. మౌలిక వసతుల కొరత, భద్రతపరమైన లోపాలు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని నిర్దేశించింది. భద్రత కోసం నియమించుకున్న వారితో పాటు మిగతా సిబ్బందిని పర్యవేక్షించాలని పేర్కొంది. కాంట్రాక్టు భద్రతా సిబ్బందికి తమ సామర్థ్యాలను పెంచుకునేందుకు శిక్షణ ఇప్పించాలని కేంద్రం, రాష్ట్రాలకు సూచించింది.



# త్వరలో భారత్ డోజో యాత్ర

**వీడియో షేర్ చేసిన రాహుల్ గాంధీ**



**దిల్లీ:** సార్వత్రిక ఎన్నికలకు ముందు తమ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ రెండు దఫాలుగా భారత్ జోడో యాత్రను చేపట్టింది. అయితే ఈసారి రాహుల్.. డోజో యాత్ర గురించి వెల్లడించారు. త్వరలో డోజో యాత్ర అంటూ ఒక వీడియోను షేర్ చేశారు.గత రెండేళ్లలో రాహుల్ గాంధీ.. 'భారత్ జోడో యాత్ర', 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' పేరిట భారత దేశ ప్రజల చెంతకు వెళ్లారు. న్యాయ్ యాత్రను తూర్పు భారతం నుంచి పశ్చిమ భారతం వైపు నిర్వహించారు. ఈ సందర్భంగా తమ శిబిరాల వద్ద జరిగిన మార్షల్ ఆర్ట్స్ సెషన్లకు సంబంధించిన వీడియోను తాజాగా ఆయన షేర్ చేశారు. అలాగే త్వరలో 'భారత్ డోజో యాత్ర' రాబోతోందని వ్యాఖ్యానించారు. మార్షల్ ఆర్ట్స్ శిక్షణనిచ్చే కేంద్రాలను డోజో అని పిలుస్తారు."జోడో యాత్ర సమయంలో మేం వేల కిలోమీటర్లు ప్రయాణించాం. ఆ సమయంలో మా శిబిరాల వద్ద ప్రతిరోజు జివు-జిట్సూ (బ్రెజిల్ మార్షల్ ఆర్ట్స్)ను ప్రాక్టీస్ చేసేవాళ్లం. ఫిట్గా ఉండేందుకు మేం ప్రారంభించిన యాక్టివిటీ త్వరలోనే అందరికీ చేరువైంది. మేం బస చేసిన ప్రాంతాల్లోని తోటి యాత్రికులు, యువ మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులను ఒకచోటకు చేర్చింది. మెడిటేషన్, జివూ-జిట్సూ, అకిడో (జపాన్ మార్షల్ ఆర్ట్స్), అహింసాపద్ధతితో ఘర్షణను పరిష్కరించే పద్ధతులు కలగలిసిన ఆర్టు యువతకు పరిచయం చేయడమే లక్ష్యంగా వాటిని నిర్వహించాం. ఘర్షణ వాతావరణాన్ని సౌమ్యంగా మార్చే విలువల్ని వారిలో పెంపొందించాలని, దయ, సురక్షితమైన సమాజం కోసం కావాల్సిన సాధనాలను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం" అని రాహుల్ పోస్టు పెట్టారు. గురువారం నేషనల్ స్పోర్ట్స్ డేను పురస్కరించుకొని ఎక్స్ వేదికగా తన అనుభవాలను రాహుల్ ప్రజలతో పంచుకున్నారు. దీనిద్వారా కొందరిలోనైనా ఈ కళను అభ్యసించాలనే స్ఫూర్తి కలగాలని ఆశించారు. ఆ వీడియోలో విద్యార్థులకు రాహుల్ మార్షల్ ఆర్ట్స్ సెషన్లు నిర్వహించారు. తనకు అకిడోలో బ్లాక్ బెల్ట్ ఉందని, జివూ-జిట్సూలో బ్లూబెల్ట్ వచ్చిందని ఆ సందర్భంగా వారికి చెప్పారు. ఇదిలా ఉంటే.. 2024లో 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' మొత్తం 110 జిల్లాలు, 100 లోక్సభ స్థానాలు, 337 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా 60 రోజులకుపైగా 6,713 కిలోమీటర్ల మేర కొనసాగింది. అంతకుముందు కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు 'భారత్ జోడోయాత్ర'ను నిర్వహించిన సంగతి తెలిసిందే.



# మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యర్థిని ఓడించిన రాహుల్ గాంధీ

**దిల్లీ:** లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా సరికొత్త లుక్‌లో కనిపించారు. ఈ క్రమంలో వెలుగులోకి వచ్చిన వీడియోలో రాహుల్ గాంధీ మార్షల్ ఆర్ట్స్ ట్రిక్స్ నేర్చుకుంటున్నట్లు కనిపించారు. అందుకు సంబంధించిన వీడియోను తన అధికారిక X ఖాతాలో పోస్ట్ చేశారు. దీంతో ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వీడియోలో రాహుల్ గాంధీ మార్షల్ ఆర్ట్స్ జియు-జిట్సు టెక్నిక్‌ని ఉపయోగించి ప్రత్యర్థి ఆటగాళ్లను ఓడించడం కనిపించింది. రాహుల్ గాంధీ ఈ ప్రత్యేక వీడియో ద్వారా జాతీయ క్రీడా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

**గతంలో ఓడిన రాహుల్..**

2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత రాహుల్ గాంధీ తన పంథాను మార్చుకుని ప్రజా సమస్యల గురించి ప్రస్తావిస్తూ భారత్ జోడో యాత్రను నిర్వహించారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు, ఆ తర్వాత మణిపూర్ నుంచి గుజరాత్ వరకు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కొంత ప్రయోజనం చేకూర్చిందని చెప్పవచ్చు. ఈ క్రమంలోనే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సంఖ్య 99కి పెరిగింది. జోడో యాత్రలో భాగంగా రాహుల్ గాంధీ దేశంలోని వివిధ సమాజిక వర్గాల ప్రజలను కలుసుకున్నారు. ఆ క్రమంలో పలు రకాల వీడియోలను విడుదల చేశారు.

అయితే, తాజాగా విడుదల చేసిన వీడియో కూడా భారత్ జోడో న్యాయ్ యాత్ర కాలం నాటిదని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. రాహుల్ పర్యటనలో భాగంగా సాయంత్రం శిబిరంలో మార్షల్ ఆర్ట్ జియు-జిట్సు సాధన చేశారు. యువతలో హింసకు బదులు సౌమ్యత విలువను పెంపొందించడమేనని రాహుల్ గాంధీ అన్నారు. ఈ రోజు హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నాం. ఇప్పుడు జియు-జిట్సు అనేది బ్రెజిల్ మార్షల్ ఆర్ట్. దీనిలో ప్రత్యర్థిని పట్టుకోవడం ద్వారా నియంత్రించాలి. దీనిని బీజేజే అని కూడా అంటారు. కరాటే, బాక్సింగ్ లాగా ఇందులో ప్రత్యర్థికి దెబ్బ తగలదు. రాహుల్ గాంధీ కూడా జియు-జిట్సులో బ్లాక్ బెల్ట్ హోల్డర్. గతంలో రాహుల్ గాంధీ సముద్రంలో ఈదుతూ ప్రదర్శించారు.

# కంగనాపై మాజీ ఎంపీ వివాదాస్పద వ్యాఖ్యలు..



**దిల్లీ:** బాలీవుడ్ ప్రముఖ నటి, భాజపా ఎంపీ కంగనా రనౌత్ రైతుల నిరసనలపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. కంగనా తీరుపై ప్రతిపక్షాలు మండిపడడంతో పాటు సొంత పార్టీ నుంచే వ్యతిరేకత వ్యక్తమైంది. తాజాగా ఆమెపై పంజాబ్ మాజీ ఎంపీ, శిరోమణి అకాలీదళ్ (అమృత్సర్) నేత సిమ్రాన్జిత్సింగ్ మాన్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.కంగనాపై ఈ సందర్భంగా మాన్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. వీటిని పంజాబ్ మహిళా కమిషన్ తీవ్రంగా పరిగణించింది. మహిళను అవమానించినట్లేనని.. తగు చర్యలు తీసుకుంటామని పేర్కొంది. మరోవైపు ఈ వ్యాఖ్యలపై కంగనా బృందం స్పందిస్తూ.. అత్యాచారాలను చిన్నచూపు చూడటం సర్వసాధారణమైందని ఆవేదన వ్యక్తంచేసింది.కాగా.. కంగనా రైతుల నిరసనలపై చేసిన వ్యాఖ్యలకు స్పందించిన సొంత పార్టీ ఆమెను మందలించిన సంగతి తెలిసిందే. పార్టీ విధానంపై మాట్లాడే అధికారం లేదని స్పష్టం చేసింది. ఇలాంటి ప్రకటనలు చేసేందుకు ఆమెకు అనుమతి ఇవ్వలేదని.. భవిష్యత్తులో ఇలాంటి ప్రకటనలు చేయవొద్దని ఆదేశించింది.మూడు సాగు చట్టాలను గతేడాది కేంద్రం రద్దు చేసిన సంగతి తెలిసిందే. నాటి రైతుల నిరసనలను ఉద్దేశిస్తూ కంగనా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రైతుల నిరసనల వెనుక విదేశీ కుట్ర ఉందంటూ ఆరోపించారు. దేశంలో అల్లకల్లోల పరిస్థితి ఏర్పడిందని.. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాలే అదుపులోకి తీసుకు వచ్చాయని ఆమె పేర్కొన్నారు. ఈ నిరసనల వెనుక విదేశీ కుట్ర ఉందని.. కేంద్రం పటిష్ట చర్యలు తీసుకోకపోయి ఉంటే దేశంలో బంగ్లాదేశ్ తరహా పరిస్థితికి దారి తీసేదని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆమెపై ప్రతిపక్షాలు భగ్గుమన్నాయి.

**నడ్డాతో కంగనా భేటీ..**

ఈ క్రమంలోనే కంగనా భాజపా జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా తో ఆయన అధికార నివాసంలో భేటీ అయ్యారు. సొంత పార్టీ నుంచి విమర్శలు ఎదుర్కొన్న వేళ.. వీరి భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. వివాదం ప్రారంభమైన నాటి నుంచి అధ్యక్షుడితో సమావేశం కావడం ఇది రెండోసారి.

# ప్రపంచ బ్యాంకు సాయం కోరిన బంగ్లాదేశ్



**ఢాకా:** రిజర్వేషన్ల అంశం బంగ్లాదేశ్‌లో బీభత్సం సృష్టించింది. అల్లర్ల కారణంగా దేశానికి ఎంతో నష్టం జరిగింది. ప్రస్తుతం బంగ్లా ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. తాత్కాలిక ప్రభుత్వం.. ఆర్థిక మద్దతు కోసం ప్రపంచ బ్యాంకు సాయం కోరినట్లు స్థానిక మీడియా కథనాలు ప్రచురించాయి.ఆర్థిక వేత్త, నోబెల్ గ్రహీత మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. తమకు ఆర్థిక మద్దతు అందించాలని ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్, ఏడీబీలను సాయం కోరింది. 8 బిలియన్ డాలర్లను సమకూర్చాలని విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం ఈ దేశానికి 100 బిలియన్ డాలర్లకు పైగా విదేశీ అప్పు ఉంది. ఈ రుణాలు చెల్లించడానికి ఐఎంఎఎఫ్ నుంచి 300 బిలియన్ డాలర్లు, పునరావాస కార్యక్రమాలకు మరో 300 డాలర్లు కావాల్సి ఉంది.ఈ నేపథ్యంలోనే తాత్కాలిక ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు ఐఎంఎఫ్ బృందం వచ్చేనెల ఢాకాకు వెళ్లనున్నట్లు సమాచారం. గతేడాది షేక్ హసీనా ప్రభుత్వం రుణ కార్యక్రమం కింద ఐఎంఎఫ్ నుంచి 4.7 బిలియన్ డాలర్లకు గాను ఇప్పటివరకు 2.3 బిలియన్ డాలర్లను పొందింది. ప్రస్తుతం బంగ్లాలో ద్రవ్యోల్బణం పెరిగిపోయింది. ఆహార ఉత్పత్తుల ధరలు 14 శాతానికి పైగా పెరిగింది. 13 ఏళ్లలో ఇదే అత్యధికం. ఇలాంటి పరిస్థితుల్లో బ్యాంకింగ్ రంగంలో ఒత్తిడిని అధిగమించేందుకు యూనస్ ప్రభుత్వం ప్రపంచ బ్యాంక్ను సాయం కోరినట్లు తెలుస్తోంది. కాగా.. రిజర్వేషన్లకు స్వస్తిపలికి ప్రతిభ ఉన్నవారికి పట్టం కట్టాలనే డిమాండ్.. షేక్ హసీనా ప్రభుత్వాన్ని కూల్చేసింది. దీంతో ఆమె ప్రధాని పదవితో పాటు దేశాన్ని వీడారు. ఆ తర్వాత ఏర్పాటైన తాత్కాలిక ప్రభుత్వం పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా యత్నించింది. రాజకీయ అనిశ్చితితో తీవ్ర పరిణామాలు ఎదుర్కొన్న బంగ్లాదేశ్లో లో పరిస్థితులు సద్దుమణిగినట్లు ప్రభుత్వం తాజాగా వెల్లడించింది.

# విజృంభిస్తున్న విష జ్వరాలు

- పెరుగుతున్న బాధితులు, ఒకరు మృతి
- చేతులెత్తేసిన అధికారులు
- అస్తవ్యస్తంగా వైద్య వ్యవస్థ



**విశ్వంభర, భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో విష జ్వరాలు, డెంగ్యూ కేసులు రోజురోజుకి పెరుగుతున్నాయి. వర్షాలు, వాతావరణ మార్పులు, పల్లె, పట్టణాల్లో పారిశుద్ధ్య లోపంతో ప్రజలు జ్వరాలు బారిన పడుతున్నారు. గత ఏడాదికి మించి నమోదవుతున్న డెంగ్యూ కేసుల నియంత్రణపై అధికారులు ఫోకస్ పెట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజల భాగస్వామ్యంతో చేపట్టాల్సిన 'ఫ్రైడే డ్రైడే' నిర్లక్ష్యానికి గురవుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చేతులెత్తేయడంతో వైద్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని మండి పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యానికి ఈ నెలలో వైరల్? ఫీవర్? కేసులు పెరిగిపోయాయి. జ్వర పీడితులు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. భూపాలపల్లిలో కేవలం పది రోజుల్లో అనేక జ్వర బాధితుల కేసులు పెరిగాయి. సర్కారు దవాఖానాలో అధికారుల నిర్లక్ష్యంతో ఫీవర్? ట్రీట్?మెంట్? కూడా సరిగా లేక అనేక మంది ప్రైవేట్? హాస్పిటల్స్‌లో చేరుతున్నారని తెలిపారు. నిర్ధారణ పరీక్షలు కూడా సరిగా చేయడం లేదనే ఆరోపణలు స్థానికంగా వెలువడుతున్నాయి. ఆలస్యం చేస్తే బాధితులకు ప్లేట్?లెట్స్? పడిపోతాయనే భయంతో ప్రైవేటు హాస్పిటల్స్ వైపు మొగ్గు చూపుతున్నారు. **సరైన వైద్యం అందించలేక యువకుడు మృతి:** జయశంకర్ భూపాలపల్లి మున్సిపాలిటి పరిధిలోని కాసింపల్లికి చెందిన సిద్ధం రాకేష్ జ్వరంతో బాధపడుతూ బుధవారం హైదారాబాద్ లోని అపోలో ఆస్పత్రిలో మృతి చెందాడు. కాసింపల్లికి చెందిన రాకేష్ జ్వరం బారినపడి చికిత్స చేయించ ుకున్నా తగ్గలేదు. దీంతో హైదారాబాద్‌లోని అపోలో ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు.

## విష జ్వరంతో వ్యక్తి మృతి

**విశ్వంభర, స్టేషన్ ఘన్‌పూర్:** రాష్ట్రంలో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. రోగులతో హాస్పిటల్స్ కిటకిటలాడుతున్నాయి. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ప్రజలు పిట్టల్లా రాలిపోతున్నారు. తాజాగా జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లోని మోడల్ కాలనీకి చెందిన కొరిమి ఆంజనేయులు (48) విష జ్వరంతో గురువారం మృతి చెందాడు. తాటికొండ గ్రామానికి చెందిన ఆయన జీవనోపాధి కోసం పదేళ్ల క్రితం మోడల్ కాలనీకి కుటుంబంతో వచ్చి డీసీఎం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మూడు రోజుల నుంచి జ్వరంతో బాధపడుతూ జనగామలోని ఏరియా హాస్పిటల్ చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో గురువారం 17 వేలకు ప్లేట్‌లెట్స్ పడిపోవడంతో నిమ్స్ ఆసుపత్రికి తరలించాలని వైద్యులు సూచించగా ఇంతలోనే ఆంజనేయులు మృతి చెందాడు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

# సీతారామ నీళ్ళు జూలూరుపాడుకే ఇవ్వాలి

**విశ్వంభర, భద్రాద్రికొత్తగూడెం జిల్లా:** సీతారామ నీళ్ళు జూలూరుపాడు మండలానికి ఇవ్వాలని,సీతారామ ప్రాజెక్టు నీళ్ళ విషయంలో జిల్లాకు అన్యాయం చేసే ఆలోచనను విరమించుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ శ్రేణులతో కలసి వినోబా నగర్ లింకు కాలువను పరిశీలించి మాట్లాడుతూ పాత డిజైన్ ను మార్చి జిల్లాకు తీవ్ర అన్యాయం చేశారని, పాత డిజైన్ ను అమలు చేసి 20 మండలాలకు సీతారామ ప్రాజెక్టు కెనాల్‌కు అనుసంధానం చేసి నీరు అందించాలన్నారు. 2005 సంవత్సరం లో దుమ్ముగూడెం ప్రాజెక్టుతో మొదలై మధ్యలో సీతారామ ప్రాజెక్టుగా అవతరించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాని సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశంతో తవ్వినటువంటి కాలవను కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా రూట్ మ్యాప్ తీసుకువచ్చి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలనే ఆలోచనతో వినోబానగర్ వద్ద నుండి ఖమ్మంకు కాలువ తవ్వుతు న్నారని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు, అదేవిధంగా జూలూరుపాడు మండ లంలోని పంట కాలువల ద్వారా ప్రతి చెరువును నింపిన తర్వాతనే వేరే జిల్లాకు తరలి ంచాలని డిమాండ్ చేశారు. ఏది ఏమైనాప్పటికీ జిల్లాకు నీటిని అందించకుండా, జూలూరుపాడు మండలానికి నీరు అందించకుండా వేరే జిల్లాకి తరలిస్తే ప్రజా



ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. బీఎస్పీ జూలూరుపాడు మండల అధ్యక్షు లు తంబర్ల నరసింహారావు,శివ, బన్నీ, నరేష్, రమేష్ పాల్గొన్నారు.

## నిరసన తెలిపిన చాంబర్ ఆఫ్ కామర్స్



**విశ్వంభర, కామారెడ్డి:** పట్టణంలో విశ్వనాథం అనే వ్యాపారస్తుడు మీద జరిగిన హత్యకు నిరసనగా గురువారం 200 మంది వ్యాపారస్తులు చాంబర్ ఆఫ్ కామర్స్ ఆర్యవైశ్య సంఘం కామారెడ్డి నుండి ఎస్పీ సింధు శర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు లింగం చంద్ర మాట్లాడుతూ కామారెడ్డిలో వ్యాపారస్తుడిని హత్య చేసిన హంతకులను వెంటనే పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసారు. కొకొండ రవీందర్, ఆనంద్,బాల,రవి, శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు కూర శ్రీనివాస్, శ్రీధర్ ,అయ్యప్ప కమిటీ అధ్యక్షులు శ్రీనివాస్, దాదాపు 100 షాపుల ప్రెసిడెంట్, సెక్రటరీలు హాజరయ్యారు.

# దొంగల బీభత్సం



**విశ్వంభర, భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో దొంగలు బీభత్సం సృష్టించారు. కాటారం మండలం బస్వాపూర్ లో కిరాణ దుకాణం నిర్వహిస్తున్న దంపతులపై గుర్తు తెలియని దుండగులు దాడి చేసి, కట్టేసి కత్తితో చంపేస్తామని బెదిరింపులకు పాల్పడి చోరీ చేసారు. బస్వాపూర్ కి చెందిన పడాల తిరుపతి, స్వర్ణలత దంపతులు భూపాలపల్లి వైపు వెళ్లే రహదారిలోని బస్వాపూర్ సమీపంలో కిరాణం షాపు నడుపుతుంటారు. తెల్లవారుజామున గుర్తు తెలియని ముగ్గురు దుండగులు వారిపై హఠాత్తుగా దాడి చేసి, దంపతులను కట్టేసి గొంతు పై కత్తి పెట్టి చంపేస్తామని బెదిరించి లక్ష రూపా యల నగదు, ఆరు తులాల బంగారంతో పాటు ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్లారని భాదితులు ఆరోపించారు. భార్య గొంతు పై కత్తి పెట్టడంతో గాయం కావడంతో బాధితులిద్దరని భూపాలపల్లి ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స రాణిస్తున్నారు. సమా చారం తెలుసుకున్న అడిషనల్ జిల్లా ఎస్పీ బోనాల కిషన్, కాటారం డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి సిబ్బందితో కలిసి స్పాట్‌కు చేరుకొని పరిశీలిస్తున్నారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపి ఆధారాలు సేకరిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నారు.

## నిరుపేద మహిళకు దహన సంస్కారాలు



**విశ్వంభర,భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం లోని పాత ఇస్పేట్ గ్రామానికి చెందిన బొచ్చు సౌందర్య గత కొంత కాలం నుండి కిడ్నీల సమస్యతో బాధపడుతూ చనిపోయింది. దహన సంస్కారాలకు కూడా డబ్బులు లేని పరిస్థితి ఉండడంతో ఆ ఊరిలోని కొందరు యువత ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ వారికీ సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి సొంత ఖర్చులతో ఆమె అంత్యక్రియలు పూర్తి చేసారు. ఈ కార్యక్రమానికి మొగుళ్లపల్లి మండల ఇంచార్జ్ నేర్పాటి అశోక్, టేకుమట్ల మండల ఇంచార్జ్ జెట్టి రమేష్, చిట్యాల మండల ఇన్చార్జ్ రాజ్ నాయక్, యూత్ ఇంచార్జ్ చింతకింది రాజు, నేర్పాటి శ్రీనివాస్, నేర్పాటి స్వామి, మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా తీజ్ సంబరాలు



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ మండల పరిధిలోని గానుగుమార్ల తండా గ్రామంలో తీజ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మొలకల బుట్టలను స్థానిక ఆలయాలాలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కు మొలకలను అందజేసి గ్రామస్తులు శాలువాలతో సన్మానిస్తూ ఘన స్వాగతం పలికారు. అనంతరం కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ తీజ్ వేడుకలు గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయానికి ప్రతీక అని దైవ కార్యక్రమాలను ప్రోత్సహించే పండుగలను కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి జర్పుల లక్పతి నాయక్ , రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నేనావత్ బిఖ్య నాయక్, రాష్ట్ర గిరిజన సేవ సంఘం అధ్యక్షులు హనుమ నాయక్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి , బిచ్చ నాయక్ , గూడూరు భాస్కర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, యాదగిరి రెడ్డి, స్థానిక మాజీ సర్పంచ్ హంస్య మోత్య నాయక్, మైసిగండి మాజీ సర్పంచ్ శేఖర్ గౌడ్, సేవ్య నాయక్, శ్రీను నాయక్, టీక్లాల్ నాయక్, రూప్ సింగ్, పాల్గొన్నారు.

## డీసీఎం కిందికి దూసుకెళ్లిన కారు..
## నలుగురు హైదరాబాద్ వాసులు దుర్మరణం

**విశ్వంభర,మహబూబ్‌నగర్:** మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన నలుగురు మరణించారు. గురువారం తెల్లవారుజామున భూత్పూర్ మండలం తాటికొండ సమీపంలో 44వ జాతీయ రాహదారిపై బైక్‌ను తప్పించే క్రమంలో అదుపు తప్పిన కారు.. ఆగిఉన్న డీసీఎం కిందికి దూసుకెళ్లింది. దీంతో నలుగురు అక్కడికక్కడే మరణించగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడినవారిని దవాఖానకు తరలించారు. బాధితులు హైదరాబాద్‌కు చెందినవారిగా గుర్తించామన్నారు. వారంతా తిరుపతి నుంచి హైదరాబాద్‌కు వస్తున్నారని చెప్పారు. ప్రమాదం ధాటికి కారు నుజ్జునుజ్జు అయినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## డిస్కంలో రికార్డు స్థాయి విద్యుత్ వినియోగం..

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో డిస్కంలో విద్యుత్ వినియోగం రికార్డు స్థాయికి చేరుకున్నది. గురువారం ఉదయం 7.30 గంటలకు రికార్డు స్థాయికి చేరుకుందని.. ఈ ఏడాది ఈ సీజన్‌లో 15,573 మెగావాట్లకు విద్యుత్ వినియోగం పెరిగిందని జెన్, ట్రాన్స్‌కో సీఎండీ తెలిపారు. గతేడాదిలో ఈ సీజన్‌లో అత్యధికంగా 14,816 మెగావాట్లు వినియోగం నమోదైందని.. గతేడాదితో పోలిస్తే 5.11శాతం అత్యధిక వినియోగమని పేర్కొన్నారు. గతేడాది మార్చిన 15,623 మెగావాట్ల రికార్డు విద్యుత్ వినియోగం రికార్డయ్యిందని.. అత్యధికంగా మార్చి 14న 308.54 మిలియన్ యూనిట్లు వినియోగించినట్లు తెలిపారు. ఆగస్టు నుంచి ఇప్పటి వరకు 266.14 మిలియన్ యూనిట్లు సరఫరా చేశామని.. గతేడాది ఆగస్టు సమయంలో 250.25 మిలియన్లు సరఫరా అయ్యిందని.. గతేడాదితో పోలిస్తే 6.35శాతం ఎక్కువ అని పేర్కొంది. పీక్ ఖరీఫ్ సీజన్ అయిన సెప్టెంబర్, అక్టోబర్‌లో 17వేల మెగావాట్ల వరకు డిమాండ్ ఉండవచ్చని.. వ్యవసాయంతో పాటు ఇతర వినియోగదారులకు అవసరమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు డిస్కమ్‌లు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ అధికారులను డిప్యూటీ సీఎం అభినందించినట్లు వివరించారు.

## రూ.2 లక్షల రుణమాఫీ వర్తింపజేయాలి



**విశ్వంభర, మునగాల:** రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా 2 లక్షల రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మునగాల మండల కేంద్రంలో ధర్నా అనంతరం స్థానిక తహసీల్దారుకు మెమోరాండం అందిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేదరమెట్ల వెంకటేశ్వరావు, జిల్లా కమిటీ సభ్యులు దేవర వెంకటరెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి చంద్ర చంద్రయ్య, రైతు సంఘం నాయకులు ఎస్. కే సైదా, స్టాలిన్ రెడ్డి, మండల నాయకులు సోమపంగు జానయ్య, ఆరె రామకృష్ణారెడ్డి, వీరబోయిన వెంకన్న, బచ్చలకూరి స్వరాజ్యం, తుమ్మ సతీష్, గడ్డం వినోద్, కిన్నెర వెంకన్న, మండల వెంకటాద్రి, గోళ్ళ కృష్ణారెడ్డి, భూతం వెంకన్న, వెంపటి వీరబాబు, ఆరె శేఖర్ రెడ్డి, సుంకర్ పిచ్చయ్య, పాల్గొన్నారు.

## బీజేపీ సభ్యత్వ నమోదు



**విశ్వంభర, జగిత్యాల:** భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు వర్క్ షాప్ కార్యక్రమాన్ని జగిత్యాల పట్టణ, రూరల్, అర్బన్ మండలాలో చేపట్టారు. ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్. బోగ శ్రావణి పాల్గొని కార్యకర్తలకు దశ దిశా నిర్దేశించారు. పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదును చేయించాలని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాగిల సత్యనారాయణ, జగిత్యాల పట్టణ అధ్యక్షులు రంగు గోపాల్,జగిత్యాల రూరల్ మండల అధ్యక్షులు నలువాల తిరుపతి, జిల్లా కార్యదర్శి పెద్ద గంగన్న, జిల్లా కోశాధికారి సుంకేట దశరథ రెడ్డి, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సాంబారి కళావతి, పట్టణ ఇంచార్జ్ మ్యాదరి అశోక్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఇట్టినేని రమేష్, కౌడు వెంకన్న, జిల్లా అధికార ప్రతినిధి కుర్మా రమేష్ , భారతీయ జనతా పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్తులకు అన్నదానం



**విశ్వంభర, చండూర్:** శ్రావణమాసం సందర్భంగా చండూరు మున్సిపల్ కేంద్రంలో బోనాల మహోత్సవ కార్యక్రామాలు ఘనంగా చేపట్టారు. ముందుగా బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రామాలు మొదలు పెట్టారు. ముత్యాలమ్మ దేవాలయం దగ్గర కలిమికొండ పారిజాత జనార్ధన్ దంపతులు పూజ కార్యక్రామాలలో పాల్గొని, నైవేద్యాన్ని సమర్పించిభక్తులకు, ప్రజలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

## రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మల్లం వెంకటేశం



**విశ్వంభర, హైద్రాబాద్:** రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మల్లం వెంకటేశం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జాతీయ అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, జాతీయ ఉపాధ్యక్షులు ఏటి ఆంజనేయులు, రాష్ట్ర అధ్యక్షులు ఎలిగేండ్ల వెంకటేష్ ఆదేశాల మేరకు బుదవారం జాతీయ ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సురా స్రవంతి నియామక పత్రాన్ని అందజేశారు. మల్లం వెంకటేశం మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించిన జాతీయ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలకు కృతజ్ఞతలు తెలిపారు. మల్లం వెంకటేశం మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారుల్లో జవాబుదారితనం కొరవడిందన్నారు. కోరిన సమాచారం అందించాల్సిన బాధ్యత ఆయా అధికారులపై ఉందన్నారు. రాజ్యాంగం కల్పించిన ఈ హక్కును నిరాకరించే అధికారం ప్రభుత్వ వ్యవస్థలో ఏ శాఖ, అధికారికి లేదన్నారు. సంస్థ నియమ నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి బయటకు తీస్తూ సమాచార హక్కు చట్టం గురించి పౌరులకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సురా స్రవంతి,మాదగోని శ్రీనివాస్ గౌడ్, పందుల రాజు గౌడ్, బత్తుల మహేష్ గౌడ్ పాల్గొన్నారు.



భారత్‌తో టెస్టు సిరీస్..

## న్యూజిలాండ్ బౌలింగ్ కోచ్‌గా జాకబ్ ఓరమ్

**ఆక్లాండ్:** న్యూజిలాండ్ మాజీ క్రికెటర్ జాకబ్ ఓరమ్‌కు కీలక బాధ్యతలు అప్పగించారు. కివీస్ జట్టుకు బౌలింగ్ కోచ్‌గా అతన్ని నియమించారు. వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్‌లో భాగంగా .. భారత్‌తో జరిగే టెస్టు సిరీస్ నుంచి జాకబ్ కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. అక్టోబర్ ఏడో తేదీన అతను ఆ బాధ్యతలు స్వీకరించే అవకాశాలు ఉన్నాయి. రైట్ ఆర్మ్ బౌలర్ జాకబ్ ఓరమ్.. తన కెరీర్‌లో మూడు వన్డే వరల్డ్‌కప్‌లు, 4 టీ20 వరల్డ్‌కప్‌లు ఆడాడు. న్యూజిలాండ్, భారత్ మధ్య తొలి టెస్టు మ్యాచ్ అక్టోబర్ 16 నుంచి బెంగుళూరులో ప్రారంభంకానున్నది. ఇక రెండో టెస్టు అక్టోబర్ 24 నుంచి పుణెలో, నవంబర్ ఒకటో తేదీ నుంచి ముంబైలో మూడవ టెస్టు జరగనున్నది. ఇటీవల అమెరికాలో జరిగిన టీ20 వరల్డ్‌కప్ సమయంలో.. కివీస్ జట్టుకు బౌలింగ్ కోచ్‌గా జాకబ్ ఓరమ్ పనిచేశాడు. జాకబ్ ఓరమ్ తన కెరీర్‌లో మొత్తం 229 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు.



# ప్రసిద్ధ పార్క్‌లో సచిన్ చిన్ననాటి కోచ్ విగ్రహం

### గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ప్రభుత్వం

**విశ్వంభర (క్రీడా విభాగం):** దిగ్గజ క్రికెటర్ సచిన్ తెందూల్కర్ చిన్ననాటి కోచ్ రమాకాంత్ అచ్రేకర్ స్మారక చిహ్నం ఏర్పాటు ప్రతిపాదనకు మహారాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ముంబయిలోని ప్రసిద్ధ శివాజీ పార్క్ 5వ నంబర్ గేటు సమీపంలో విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీని నిర్వహణ బాధ్యతను వి కామత్ మెమోరియల్ క్రికెట్ క్లబ్కు అప్పగించారు. అయితే, ఇందుకు ప్రభుత్వం ఎలాంటి ఆర్థిక సాయం అందించదు. మహారాష్ట్ర సర్కారు తీసుకున్న ఈ నిర్ణయం పట్ల సచిన్ సంతోషం వ్యక్తం చేశాడు. "అచ్రేకర్ సర్ నాతోపాటు ఎంతోమంది క్రికెటర్ల జీవితాలపై అపారమైన ప్రభావాన్ని చూపారు. ఆయన దగ్గర శిక్షణ పొందిన విద్యార్థులందరి తరపున నేను మాట్లాడుతున్నాను. అచ్రేకర్ జీవితం శివాజీ పార్క్ లో క్రికెట్ చుట్టూ తిరిగింది. ఎప్పుడూ ఆ పార్క్‌లోనే ఉండాలనేది ఆయన కోరిక. అచ్రేకర్ సార్ విగ్రహాన్ని ఆయన పని ప్రదేశంలో నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషకరం" అని సచిన్ ఎక్స్ (ట్విటర్)లో రాసుకొచ్చాడు. సచిన్ చిన్ననాటి కోచ్ అయిన రమాకాంత్ అచ్రేకర్.. తెందూల్కర్ దిగ్గజ క్రికెటర్ గా ఎదగడంలో కీలకపాత్ర పోషించాడు. అచ్రేకర్ను భారత ప్రభుత్వం ప్రసిద్ధ ద్రోణాచార్య అవార్డుతో సత్కరించింది. 87 ఏళ్ల వయసులో జనవరి 2, 2019న ఆయన కన్నుమూశారు. భారత మాజీ క్రికెటర్లు రామ్నాథ్ పార్కర్, ఏక్నాథ్ సోల్కర్, బల్విందర్ సింగ్ సంధు, లాల్చంద్ రాజ్పుత్, చంద్రకాంత్ పండిత్, ప్రవీణ్ ఆమ్రే, వినోద్ కాంబ్లీ, సమీర్ డిఘే, సంజయ్ బంగర్, పరాస్ మాంబ్రే, రమేష్ పొవార్, అజిత్ అగార్కర్, సాయిరాజ్ బహుతులే కూడా రమాకాంత్ అచ్రేకర్ శిష్యులే.

## టోక్యో ఒలింపిక్స్ లో నిరుత్సాహం

### మోదీ మాటలతోనే ప్రోత్సాహం: మను బాకర్



**పారిస్:** పారిస్ ఒలింపిక్స్లో భారత యువ షూటర్ మను బాకర్ రెండు పతకాలు సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. గురువారం నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా 2018లో జరిగిన కామన్వెల్త్ గేమ్స్ లో బంగారు పతకం గెలిచినప్పుడు, టోక్యో ఒలింపిక్స్లో చేదు అనుభవం ఎదురైన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీతో వ్యక్తిగతంగా జరిగిన సంభాషణలను ఆమె పంచుకుంది. అదేవిధంగా క్రీడాకారులపై ఆయనకు ఉన్న అభిమానాన్ని కొనియాడింది. 2018లో జరిగిన కామన్వెల్త్ గేమ్స్ మను బాకర్ బంగారు పతకం సాధించింది. ఆ సమయంలో మొదటిసారిగా ప్రధాని నరేంద్ర మోదీని కలిసే అవకాశం లభించింది. ఆ సమయంలో మోదీ పంచుకున్న విషయాలను వెల్లడించింది. 'నువ్వు ఇంకా చిన్నదానివి. భవిష్యత్తులో మరిన్ని విజయాలు మీరు అందుకుంటారు. మీకు ఏ అవసరం ఉన్నా నన్ను కలవచ్చు' అని మోదీ పేర్కొన్నారని తెలిపింది. ఇక, టోక్యో ఒలింపిక్స్లో ఎదురైన చేదు అనుభవం సమయంలో ఆయన మాటలు తనకు ఎంతో ప్రోత్సాహం ఇచ్చాయని, ఆ ప్రోత్సాహంతోనే తన భవిష్యత్తుకు ప్రణాళిక మొదలయ్యిందని మను పేర్కొంది. తన లక్ష్యంపై దృష్టి సారించాలని ఆయన సూచించారని వివరించింది. అదేవిధంగా ఆయన ప్రతి అథ్లెట్ గురించి ఎంతో శ్రద్ధ తీసుకుంటారని కొనియాడింది. విజయాలకు సంబరాలు చేసుకోవడంతో పాటు ఫలితాలతో సంబంధం లేకుండా ప్రతి క్రీడాకారుడితో ఆప్యాయంగా మాట్లాడతారని వివరిచింది. అందరితో వ్యక్తిగతంగా చర్చించి.. వారి సమస్యలు తెలుసుకుని వారిని ప్రోత్సహిస్తారని వెల్లడించింది. అయితే, టోక్యో ఒలింపిక్స్ సమయంలో భారత్ తరపున బరిలో నిలిచిన మను బాకర్కు నిరాశ ఎదురైంది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ క్వాలిఫికేషన్ మధ్యలో ఆమె పిస్టల్ మొరాయించడంతో.. పోటీ నుంచి బయటకు రావాల్సి వచ్చింది. దీంతో ఫైనల్కు చేరుకోలేకపోయింది. అయితే ఇటీవల జరిగిన పారిస్ ఒలింపిక్స్లో రెండు పతకాలు సాధించి అరుదైన ఘనత సాధించింది.

## వేలానికి రెండు వారాల సమయం

### గంభీర్ వల్లే అది సాధ్యమైంది: సంజీవ్ గోయెంకా

**విశ్వంభర (క్రీడా విభాగం):** గౌతమ్ గంభీర్ పై లఖ్ నవూ సూపర్ జెయింట్స్ యజమాని సంజీవ్ గోయెంకా ప్రశంసలు కురిపించారు. జట్టు నిర్మాణంలో అన్నీ తానై నడిపించాడని పేర్కొన్నారు. 2022 సీజన్లో లఖ్నవూ ఐపీఎల్లోకి ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. 2022, 2023 సీజన్లలో గంభీర్ ఎల్ఎస్జీకి మెంటార్గా వ్యవహరించాడు. ఆ రెండు సీజన్లలో లఖ్నవూ ప్లేఆఫ్స్కు చేరింది. తర్వాత గంభీర్ కోల్కతా నైట్రైడర్స్ మెంటార్గా వెళ్లాడు. ఆ ప్రభావం ఎల్ఎస్ఓ టీమ్ ప్రదర్శనపై పడింది. 2024 సీజన్లో లఖ్నవూ ప్లేఆఫ్స్కు చేరలేదు. అయితే, ఫ్రాంఛైజీతో ఉన్నంతకాలం జట్టు ఉన్నతి కోసం గంభీర్ ఎంతో కృషి చేశాడని ఓనర్ సంజీవ్ గోయెంకా తెలిపారు. వేలం సమయంలో అనలిస్టు, రీసెర్చ్ టీమ్లు లేకున్నా గంభీర్ అన్నీ తానై వ్యవహరించి మంచి జట్టును ఎంపిక చేశాడని ఆయన వివరించారు ."జట్టు పునాదిని నిర్మించడంలో గౌతమ్ గంభీర్ ముఖ్యమైన పాత్ర పోషించాడు. అతడి వల్లే మా మొదటి వేలంలో ఆటగాళ్ల ఎంపికలో విజయవంతమయ్యాం. వేలానికి రెండు వారాల ముందు ఫ్రాంఛైజీని దక్కించుకున్నాం. అప్పుడు మాకు రీసెర్చ్ టీమ్, అనలిస్టు లేరు. దీంతో గంభీర్ అన్నీ తానై నడిపించి సమతూకంగా ఉన్న జట్టును ఎంపిక చేశాడు. ప్రతి ఒక్కరికీ నిర్దిష్ట పాత్రలు ఉన్నాయి. గంభీర్ మాత్రం తన పాత్రకు పూర్తి న్యాయం చేశాడు" అని సంజీవ్ గోయెంకా తెలిపారు. మరోవైపు, కెప్టెన్ కేఎల్ రాహుల్ వచ్చే సీజన్కు జట్టులో కొనసాగుతాడా? లేదా అనే దానిపై గోయెంకా స్పష్టతనివ్వలేదు. ఆటగాళ్ల రిటెన్షన్పై బీసీసీఐ విధివిధానాలను ప్రకటించిన తర్వాతే ఎవరెవరిని కొనసాగించాలన్న నిర్ణయం తీసుకుంటామన్నారు. 2025 సీజన్ కు ముందు మెగా వేలం జరగనున్న సంగతి తెలిసిందే.

## ఢిల్లీ హైకోర్టులో బ్రిజ్ భూషణ్‌కు దక్కని ఊరట..

**దిల్లీ:** రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌కు .. ఢిల్లీ హైకోర్టులో ఊరట దక్కలేదు. కేసును ఎందుకు కొట్టివేయాలన్న అంశంపై షార్ట్ నోట్ ఇవ్వాలని సింగ్ తరపున లాయర్‌ను ఢిల్లీ హైకోర్టు అడిగింది. మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించినట్లు బ్రిజ్‌పై ఆరోపణలు ఉన్న విషయం తెలిసిందే. అయితే ఆ కేసును సవాల్ చేస్తూ ఆయన కోర్టును ఆశ్రయించారు. ఎఫ్ఐఆర్, ఛార్జ్‌షీట్, ట్రయల్ కోర్టు ఆదేశాలను ఆయన ప్రశ్నించారు. మహిళా రెజ్లర్లు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా జరుగుతున్న దర్యాప్తును నిలిపివేయాలని బ్రిజ్ తన పిటీషన్‌లో కోరారు. బ్రిజ్‌పై నమోదు అయిన కేసును కొట్టివేయలేమని జస్టిస్ నీనా బన్సల్ కృష్ణ తెలిపారు. మొత్తం ఆరుగురు మహిళా రెజ్లర్లు లైంగిక వేధింపుల ఆరోపణలు చేశారు. ఆ రెజ్లర్లు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగానే ఎంపీపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.






## జీడీపీ అంచనాను 7.20 శాతానికి పెంచిన మూడీస్

**ముంబయి:** మూడీస్.. 2024 ఆర్థిక సంవత్సరానికి భారత జీడీపీ వృద్ధి అంచనాను 6.80% నుంచి 7.20%కు పెంచింది. స్థిరమైన ప్రైవేట్ వినియోగం, మెరుగైన వ్యాపార పరిస్థితుల ద్వారా ఈ వృద్ధి సాధ్యమవుతుందని పేర్కొంది. ఆర్బీఐ లక్ష్యం మేరకు ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడంతో గృహ వినియోగం పెరుగుతుందని, ముఖ్యంగా రుతుపవనాల కారణంగా గ్రామీణ డిమాండ్ పుంజుకునే సంకేతాలు ఉన్నాయని నివేదికలో తెలిపింది. దీర్ఘకాలంలో 6-7% వృద్ధిని కొనసాగించడం అనేది యువ శ్రామిక శక్తిని సమర్థవంతంగా ఉపయోగించడంపై ఆధారపడి ఉంటుందని తెలిపింది.కార్పొరేట్, బ్యాంక్ బ్యాలెన్స్ షీట్లు ఆశాజనకంగా ఉండడంతో పాటు ఈక్విటీ, బాండ్ల ద్వారా మూలధన సమీకరణ మెరుగ్గా ఉందని సంస్థ తెలిపింది. అలాగే, ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రైవేట్ మూలధన వ్యయం 54% పెరుగుతుందని మూడీస్ అంచనా వేసింది. యూపీఐ వంటి డిజిటలైజేషన్ కూడా భారత్ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది. ఇది ఇప్పుడు డిజిటల్ చెల్లింపుల్లో దాదాపు 80% వాటాను కలిగి ఉంది.

## బిలియనీర్ల జాబితాలో 21ఏళ్ల కుర్రాడు కైవల్య వోహ్రా!

**విశ్వంభర (బిజినెస్):** ప్రముఖ క్విక్ కామర్స్ సంస్థ జెప్టో సహ వ్యవస్థాపకుడు కైవల్య వోహ్రా అరుదైన ఘనత సాధించాడు. హురూన్ బిలియనీర్ల జాబితాలో చోటుదక్కించుకున్నాడు. దీంతో భారత్లోని అత్యంత సంపన్నుల జాబితాలో పిన్న వయస్కుడిగా నిలిచాడు. రూ.3,600 కోట్లతో కైవల్య అగ్రస్థానంలో నిలవగా.. మరో సహ వ్యవస్థాపకుడు 22 ఏళ్ల అదిత్ పాలిచా రెండో స్థానంలో ఉన్నారు.కైవల్య వోహ్రా, ఆదిత్ పాలిచా ఇద్దరూ స్టాన్ఫోర్డ్ యూనివర్శిటీ విద్యార్థులే. కంప్యూటర్ సైన్స్ కోర్సు మధ్యలోనే ఆపేసి వ్యాపార రంగంలోకి ప్రవేశించారు. కొవిడ్ మహమ్మారి విజృంభణ సమయంలో క్విక్ డెలివరీ, కాంటాక్ట్ లెస్ డెలివరీకి బాగా డిమాండ్ పెరగడంతో ఈ రంగంలో అడుగుపెట్టాలని నిర్ణయించుకున్నారు. అలా 2021లో జెప్టోని ప్రారంభించారు. ప్రస్తుతం జెప్టో తన వ్యాపారాన్ని దేశీయంగా విస్తరిస్తోంది. గ్రోసరీ డెలివరీ విభాగంలో ప్రముఖ ఈ- కామర్స్ సంస్థ అమెజాన్, స్విగ్గీ ఇన్స్టామార్ట్, జొమాటో-బ్లింకిట్, టాటా గ్రూప్కు చెందిన బిగ్ బాస్కెట్ వంటి ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇస్తోంది. 19ఏళ్ల వయసులోనే కైవల్య వోహ్రా హురూన్ ఇండియా



రిచ్ లిస్ట్ 2022లో మొదటి సారి చోటు దక్కించుకున్నాడు. అప్పటి నుంచి ప్రతి ఏటా ఈ జాబితాలో తన హవాను కొనసాగిస్తూ వచ్చాడు. ఈ ఏడాది హురూన్ విడుదల చేసిన రిచ్ లిస్ట్లో భారత్ బిలియనీర్ల సంఖ్య మొదటి సారి 300కు చేరింది. ఈ జాబితాలో ఎంటర్టైన్మెంట్, కార్పొరేట్, వాణిజ్యం.. ఇలా అనేక రంగాలకు చెందిన వ్యక్తులు ఉన్నారు. తాజాగా హురూన్ ఇండియా వెలువరించిన జాబితాలో రూ.11.61 లక్షల కోట్ల సంపదతో అదానీ అగ్రస్థానంలో నిలవగా.. రూ.10.14 లక్షల కోట్లతో అంబానీ రెండో స్థానంలో నిలిచారు. సినీ ప్రముఖుల విషయానికొస్తే.. షారుక్ ఖాన్, జూహీ చావ్లా, హృతిక్ రోషన్, అమితాబ్, కరణ్ జోహార్ టాప్-5లో నిలిచారు.

## సరికొత్త గరిష్ఠాలకు స్టాక్ మార్కెట్లు..

### 350 పాయింట్లు లాభపడ్డ సెన్సెక్స్..

**విశ్వంభర (బిజినెస్):** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం సరికొత్త గరిష్ఠాలకు చేరుకున్నాయి. సెన్సెక్స్, నిఫ్టీ మరోసారి సరికొత్త రికార్డులను నమోదు చేశాయి. ఆటో, ఐటీ, ఆయిల్, గ్యాస్, ఎఫ్ఎంసీజీ షేర్లలో కొనుగోళ్ల లాభాలను నమోదు చేశాయి. ప్రపంచ మార్కెట్లలో ప్రతికూల పవనాలు ఉన్నా మార్కెట్లు లాభాల్లో ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత ఈక్విటీ మార్కెట్లు ఒడిదొడుకులను ఎదుర్కొన్నాయి. మధ్యాహ్నం తర్వాత కోలుకొని లాభాల బాటలో పయనించాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,822.56 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 81,682.78 పాయింట్ల కనిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. 82,285.83 పాయింట్ల గరిష్ఠానికి చేరింది. చివరకు 349.05 పాయింట్ల లాభంతో 82,134.61 వద్ద ముగిసింది.
నిఫ్టీ 99.60 పాయింట్లు లాభంతో 25,151.95 పాయింట్ల వద్ద ముగిసింది. సెన్సెక్స్, నిఫ్టీ గరిష్ఠాలకు పెరగడం ఇదే తొలిసారి. ట్రేడింగ్‌లో దాదాపు 1,348 షేర్లు పురోగమించగా.. 2421 షేర్లు పతనమయ్యాయి. మరో 95 షేర్లు మారలేదు. నిఫ్టీలో బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, టాటా మోటార్స్, బ్రిటానియా ఇండస్ట్రీస్, బీపీసీఎల్ లాభపడ్డాయి. గ్రాసిమ్ ఇండస్ట్రీస్, ఎంఅండ్ఎం, జెఎస్‌డబ్ల్యూ స్టీల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.3 శాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.7 శాతం పతనమయ్యాయి. సెక్టోరల్‌లో ఆటో, ఆయిల్ అండ్ గ్యాస్, టెలికాం, ఐటీ, ఎఫ్ఎంసీజీ 0.5శాతం నుంచి ఒకశాతం వరకు పెరిగాయి. క్యాపిటల్ గూడ్స్, ఫార్మా మీడియా, మెటల్, పవర్ 0.3 నుంచి 0.7శాతం వరకు పడిపోయాయి.



## మూడు నాలుగేళ్లలో రిటైల్ ముందు 'డబుల్' టార్గెట్: ఈశా

**ముంబయి:** రిటైల్ వ్యాపార విభాగాన్ని మూడు నాలుగేళ్లలో రెట్టింపు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని రిలయన్స్ రిటైల్ డైరెక్టర్ ఈశా అంబానీ తెలిపారు. రిలయన్స్ ఏజీఎం సందర్భంగా ఆమె మాట్లాడారు. మార్చి31తో ముగిసిన 2024 ఆర్థిక సంవత్సరంలో రిలయన్స్ రిటైల్ నికర ఆదాయం రూ.3.06 లక్షల కోట్లుగా ఉందని, గతేడాదితో పోలిస్తే 17.8 శాతం వృద్ధి నమోదైందని ఈశా పేర్కొన్నారు. రిలయన్స్కున్న గట్టి పునాదుల కారణంగా మూడునాలుగేళ్లలో ఈ వ్యాపారాన్ని రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. స్టోర్ల సంఖ్య పరంగా ప్రపంచంలోనే టాప్-5 గ్లోబల్ రిటైలర్గా రిలయన్స్ రిటైల్ నిలిచిందని రిలయన్స్ చైర్మన్ ముకేశ్ అంబానీ పేర్కొన్నారు. మార్కెట్ విలువ పరంగా టాప్-10లో, రెవెన్యూ పరంగా టాప్-30లో ఉందని పేర్కొన్నారు. గడిచిన ఏడాదిలో 1840 కొత్త స్టోర్లను ప్రారంభించామని, దీంతో మొత్తం స్టోర్ల సంఖ్య 18,836కు చేరిందన్నారు. రిటైల్ వ్యాపారంలో గ్రాసరీ వ్యాపారం 2.5 రెట్లు వృద్ధి చెందిందని ఈశా చెప్పారు. చిన్న చిన్న పట్టణాలపై దృష్టి సారించడం వల్లే ఇది సాధ్యమైందన్నారు. క్యాంపా, లోటస్ చాక్లెట్స్, సోస్యో వంటి పాపులర్ బ్రాండ్లను తీసుకొచ్చామని, లగ్జరీ జువెలరీ సెగ్మెంట్లోకి ప్రవేశించనున్నామని ఈశా అంబానీ ప్రకటించారు.తొలి గిగా ఫ్యాక్టరీ ఈ ఏడాదే రిలయన్స్ ఇండస్ట్రీస్ న్యూ ఎనర్జీ వ్యాపారం గురించి అప్ డేట్ ఇచ్చింది. న్యూఎనర్జీ వ్యాపారంలో 10 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనున్నట్లు 2021లో ప్రకటించిన రిలయన్స్.. ఈ ఏడాదే తొలి సోలార్ గిగా ఫ్యాక్టరీని ప్రారంభించనున్నట్లు ఏజీఎంలో భాగంగా ముకేశ్ అంబానీ ప్రకటించారు. 20GW సోలార్ పీవీ మానుఫాక్చరింగ్ ఈ ఏడాది చివరి నాటికి ప్రారంభం కానుందని చెప్పారు.

## ముకేశ్ అంబానీ సంచలన ప్రకటన

### రిలయన్స్ వాటాదారులకు బోనస్ షేర్లు..

**విశ్వంభర (బిజినెస్):** ముకేశ్ అంబానీ సారథ్యంలోని రిలయన్స్ తన వాటాదారులకు బోనస్ షేర్లు ఇవ్వనున్నది. 1:1 నిష్పత్తిలో వాటాదారులకు బోనస్ షేర్లు ఇస్తామని గురువారం జరిగిన 47వ రిలయన్స్ వార్షిక వాటాదారుల సమావేశంలో వెల్లడించారు. అంతకుముందు వచ్చేనెల ఐదో తేదీన డైరెక్టర్ల బోర్డు సమావేశం జరుగుతుందని, అందులో 1:1 నిష్పత్తిలో వాటాదారులకు బోనస్ షేర్లు ఇచ్చే అంశంపై నిర్ణయం తీసుకుంటుందని స్టాక్ ఎక్స్చేంజీలకు ఇచ్చిన సమాచారంలో తెలిపింది. ఇంతకుముందు 2017లో తన వాటాదారులకు చివరిసారిగా బోనస్ షేర్లు జారీ చేసింది. ప్రస్తుతం ప్రపంచంలోని టాప్-50 కంపెనీల్లో ఒకటిగా రిలయన్స్ ఉందని ముకేశ్ అంబానీ ఏజీఎం భేటీలో వెల్లడించారు. సమీప భవిష్యత్‌లో టాప్-30 గ్లోబల్ కంపెనీల సరసన చేరడమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఇక రిలయన్స్ రిటైల్,




టెలికం డివిజన్ల లిస్టింగ్ విషయమై సంస్థ యాజమాన్యం ఎటువంటి ప్రకటన చేయలేదు.
వాటాదారులకు బోనస్ షేర్లు ఇచ్చే విషయమై అధినేత ముకేశ్ అంబానీ ప్రకటన చేసిన వెంటనే దేశీయ స్టాక్ మార్కెట్లలో రిలయన్స్ షేర్ దూసుకెళ్లింది. గురువారం ఇంట్రాడే ట్రేడింగ్ లో రిలయన్స్ షేర్ 2.63 శాతం వృద్ధి చెంది రూ.3,074.80 లకు చేరుకుంది. బీఎస్ఈ లో ట్రేడింగ్ ముగిసే సమయానికి 1.64 శాతం లబ్ధితో రిలయన్స్ సేర్ రూ.3,044.75 వద్ద ముగిసింది. మరోవైపు బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 0.43 శాతం పుంజుకుని 82,134 పాయింట్ల వద్ద స్థిర పడింది.

# రొటీన్‌కు భిన్నంగా సరిపోదా శనివారం



ఎప్పటికప్పుడు జోనర్లు మారుస్తూ సినిమాలు చేస్తున్న కథానాయకుడు నాని 'అంటే... సుందరానికి' తర్వాత నాని – వివేక్ ఆత్రేయ కలిసి చేసిన చిత్రమిది. తొలి సినిమాతో మిశ్రమ ఫలితాన్ని సొంతం చేసుకున్న ఈ కలయిక. ఈసారి ఎలాంటి ప్రభావం చూపించింది. 'సరిపోదా శనివారం' కథేంటంటే..: సూర్య (నాని)కి చిన్నప్పట్నుంచీ కోపం ఎక్కువ. ఆ కోపాన్ని అదుపులో పెట్టడం కోసం తను చనిపోతూ ఓ మాట తీసుకుంటుంది తల్లి ఛాయాదేవి (అభిరామి). అప్పట్నుంచి వారమంతా ఎంతగా కోపం వచ్చినా నియంత్రించుకుంటూ, శనివారం మాత్రమే తన కోపానికి కారణమైన వాళ్ల పని పడుతుంటాడు. వారమంతా చిత్రగుప్తుడులా చిట్టా రాసుకుంటూ, శనివారం యముడిలా చెలరేగిపోతాడన్న మాట. దాంతో ఆ గొడవలు ఇంటిదాకా వస్తుంటాయి. తండ్రి (సాయికుమార్), అక్క (అదితి) ఎన్నో ఇబ్బందులు పడుతుంటారు. ఎన్.ఎల్.ఐ.సిలో మంచి ఉద్యోగిగా పేరు తెచ్చుకున్న సూర్య చిట్టాలోకి సీఐ దయానంద్ (ఎస్.జె.సూర్య) చేరతాడు. తన సొంత అన్న కూర్మానంద్ (మురళీశర్మ)తోనే వైరం ఉన్న సీఐ దయానంద్ కథేమిటి?అతనికీ, సోకులపాలెం అనే ఊరికీ సంబంధమేంటి? దయానంద్‌పై సూర్యకు ఉన్న కోపం, సోకులపాలేనికి ఎలాంటి మేలు చేసింది? వీళ్ల కథలోకి చారులత (ప్రియాంక మోహన్) ఎలా ప్రవేశించింది? అన్నది చిత్ర కథ! వివేక్ ఆత్రేయ మార్క్ తెలివైన కథనంతో సాగే ఓ యాక్షన్ డ్రామా ఇది. విడుదలకు ముందు చిత్రబృందం కూడా కథ కంటే, ఆ కథని ఎలా చెప్పామన్నదే కీలకం అంటూ ప్రచారం చేసింది. అందుకు తగ్గట్టే బలమైన పాత్రలు, సంఘర్షణకి వైవిధ్యమైన కథనాన్ని మేళవించి 'సరిగ్గా సరిపోయింది' అనిపించేలా చిత్రాన్ని మలిచే ప్రయత్నం చేశాడు దర్శకుడు. ఏ కథ అయినా అమ్మ నుంచే మొదలవుతుందంటూ అమ్మ, ఆమె తన కొడుకు నుంచి తీసుకున్న మాటతోనే సినిమా ప్రారంభమవుతుంది. ఆ ఎపిసోడ్‌తోనే సినిమాకి ఈ పేరు ఎందుకో స్పష్టమవుతుంది. కథ, పాత్రల పరిచయంతో కూడిన ఆరంభ సన్నివేశాలు కాస్త నెమ్మదిగా అనిపించినా, దయా పాత్ర ప్రవేశంతో అసలు కథ ఊపందుకుంటుంది. సోకులపాలెంని ఓ వస్తువులా చూస్తూ, తన కోపాన్ని ఆ ఊరిపై చూపించే ఇన్‌స్పెక్టర్ దయ, అతనికి అన్నతో ఉన్న వైరం చిత్రంలో కీలకం. ఆరంభం, మలుపు, పీటముడి, మధ్యభాగం, ముగింపు అంటూ పార్శ్వాలుగా కథని చెప్పే ప్రయత్నం చేశాడు దర్శకుడు. మలుపు అంకం నుంచి సన్నివేశాలు ఆసక్తికరంగా సాగిపోతుంటాయి. ఆ క్రమంలోనే పరిచయమయ్యే చారులత, కూర్మానంద్ పాత్రలు... వాటి ద్వారానే అన్నదమ్ముల మధ్య సంఘర్షణ, సోకులపాలెం కథలు వెలుగులోకి వచ్చే క్రమం ప్రేక్షకుడిని సినిమాలో లీనం చేస్తాయి. సూర్య, చారులత ప్రేమకథలో వచ్చే ఈగ స్టోరీ నవ్విస్తుంది. సినిమాలో కీలకమైన ప్రతి పాత్ర వెనకా ఓ కథ ఉంటుంది. ఆ కథల్ని వివరించే క్రమంలో కొన్ని సన్నివేశాలు నెమ్మదిగా సాగుతున్న భావన కలిగినా, పీటముడి, మధ్యభాగం సినిమాని మరో స్థాయికి తీసుకెళ్లాయి. సూర్య, చారులత దగ్గరయ్యే సన్నివేశాలు... చారులతకి సూర్య తన శనివారం సంగతిని చెప్పాలనుకోవడం, ఆ క్రమంలోనే వచ్చే యాక్షన్ ఎపిసోడ్, విరామ సన్నివేశాలు ద్వితీయార్థంపై మరిన్ని అంచనాల్ని పెంచాయి. అప్పటి నుంచి కథ సూర్య వర్సెస్ దయా అన్నట్టుగా మారిపోతుంది. సోకులపాలెంలో ధైర్యం నింపడం కోసం సూర్య, చారు కలిసి ఓ వ్యూహాన్ని రచించడం, ఆ క్రమంలో అనూహ్యంగా చోటు చేసుకునే సంఘటనలు, సూర్య ఇంట్లో సాగే పోరాట ఘట్టాలు ఆకట్టుకుంటాయి. కోపం నలుగురిలో ధైర్యాన్ని నింపేలా ఉండాలంటూ పతాక సన్నివేశాల దిశగా సినిమా సాగుతుంది. నాని యాక్షన్ అవతారం ఆకట్టుకుంటుంది. సూర్య పాత్రలో ఒదిగిపోయాడు. ఉద్యోగిగా సహజ సిద్ధమైన లుక్, నటనతో ఒకవైపు అలరిస్తూనే, మరోవైపు కోపంతో రగిలిపోయే కోణాన్ని ప్రదర్శించాడు. ఎస్.జె.సూర్య పోషించిన ఇన్‌స్పెక్టర్ దయానంద్ పాత్ర సినిమాకి కీలకం. క్రూరత్వం ప్రదర్శిస్తూ, తన చూపులతోనే భయపెడుతూ విలనిజం ప్రదర్శించాడు. ఆ పాత్రకి సరైన ఎంపిక అని చాటి చెప్పారు. చారులత పాత్రలో ప్రియాంక మోహన్ అలరిస్తుంది. నా జడ్జిమెంట్ ఎప్పుడూ తప్పే అంటూ మురళీశర్మ తెరపై కనిపించిన విధానం, ఆయన పాత్ర సినిమాకి మరో ఆకర్షణ. సాయికుమార్, అదితి బాలన్, అభిరామి, హర్షవర్ధన్, మైమ్ మధు, అజయ్ తదితరులు కీలకమైన పాత్రల్లో కనిపించి మెప్పిస్తారు.



# రాజమౌళితో సినిమా చేయాలనుంది

## నటుడు విక్రమ్ వెల్లడి

విక్రమ్ తాజా సినిమా 'తంగలాన్' విడుదలైన అన్ని ప్రాంతాల్లో మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. దీంతో ఈ సినిమాను బాలీవుడ్‌లోనూ విడుదల చేయనున్నారు. ఇప్పటికే దీనికి సంబంధించిన డబ్బింగ్ పనులు పూర్తయ్యాయి. సెప్టెంబర్ 6న 'తంగలాన్' బీటౌన్‌లో విడుదల కానుంది. ఈనేపథ్యంలో ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఒకే రకమైన పాత్రలంటే ఆసక్తి ఉండదు. ఒకవేళ నేను అలా చేస్తే నా అభిమానులు నిరాశ పడతారు. అలాంటి చిత్రాలు కమర్షియల్‌గా హిట్ అయినప్పటికీ ఒకేతరహా పాత్రలనే ఎందుకు ఎంచుకుంటున్నారని మీడియా కూడా నన్ను ప్రశ్నించే అవకాశం ఉంది. అది నా శైలికి భిన్నం. అందుకే ప్రతి సినిమాకు కొత్తరకంగా ప్రయత్నిస్తాను. ఇండస్ట్రీలో ఉన్న కొంతమంది నటీనటులు మాత్రమే ఇలా భిన్నంగా ప్రయత్నిస్తుంటారు. నా సినిమా వస్తుందంటే నా అభిమానులు కొత్తదనాన్ని కోరుకుంటారు. నా చిత్రాలు 'అపరిచితుడు', 'పొన్నియిన్ సెల్వన్' హిందీలో మంచి విజయాన్ని సాధించాయి. త్వరలో హిందీలో విడుదల కానున్న 'తంగలాన్'ను కూడా అదేస్థాయిలో ఆదరిస్తారని ఆశిస్తున్నా. నా అభిరుచికి సరిపోయే పాత్రలు వస్తే హిందీ చిత్రాలు చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నాను. అలాంటి స్క్రిప్ట్‌తో ఎవరైనా సంప్రదిస్తే ఆనందంగా అంగీకరిస్తాను. మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన పొన్నియిన్ సెల్వన్ భారీ ప్రేక్షకాదరణను సొంతం చేసుకోవడమే కాకుండా 4 జాతీయ అవార్డులను గెలుచుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. నాకు కూడా అవార్డు వచ్చిఉంటే ఇంకా సంతోషించేవాడిని. ఆ చిత్రం చరిత్రలో నిలిచిపోతుంది. మణిరత్నం దాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. రాజమౌళితో సినిమా గురించి చర్చలు జరిపిన విషయం వాస్తవమే. ఆయనతో సినిమా చేస్తాను. కానీ, దానికి సమయం పడుతుంది. భారతదేశంలోని అత్యంత గొప్ప దర్శకుల్లో రాజమౌళి ఒకరు. మేము సరైన స్క్రిప్ట్ కోసం ఎదురుచూస్తున్నాం. నేను ఇప్పటివరకు చేసిన చిత్రాల్లో 'కోబ్రా' అత్యంత కష్టమైనది. కానీ, అది అనుకున్నస్థాయిలో ప్రేక్షకాదరణను సొంతం చేసుకోలేదు. ఒక నటుడిగా నాకు సంతృప్తినిచ్చింది. కొన్నిసార్లు సినిమాకు ప్రశంసలు వస్తాయి. కానీ, కలెక్షన్లు రావు. కోబ్రాలో నేను చేసిన ఎన్నో సన్నివేశాలు సవాలుగా అనిపించాయి.

# తమిళ పరిశ్రమలో వేధింపులు ఉంటే చెప్పండి

## చర్యలు తీసుకుంటామన్న నటుడు విశాల్

మలయాళ సినీరంగంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, లైంగిక వేధింపుల పై జస్టిస్ హేమ కమిటీ సమర్పించిన నివేదిక అక్కడి ఇండస్ట్రీని కుదిపివేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అమ్మ అసోసియేషన్ ప్రెసిడెంట్ మోహన్‌లాల్‌పాటు మొత్తం 17 మంది పాలక మండలి సభ్యులు తమ పదవులకు రాజీనామా చేశారు. కమిటీలోని కొంతమంది సభ్యులపై లైంగిక వేధింపుల ఆరోపణలు రావడంతో వారందరూ రాజీనామా చేశారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో కోలీవుడ్ నటుడు విశాల్ కీలక వ్యాఖ్యలు చేశారు. మాలీవుడ్‌లో హేమ కమిటీ తరహాలలో కోలీవుడ్‌లో 10 మందితో కూడిన కమిటీ ఏర్పాటు చేస్తాం. తమిళ చిత్ర పరిశ్రమలో కాస్టింగ్ కౌచ్ ఉన్నట్టు మాకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. కేరళలో ఏర్పాటు చేసిన హేమ కమిటీ లాగే తమిళనాడు నడిగర్ సంఘం ఆధ్వర్యంలో కమిటీ పెడతాం. నటీమణులు ఏవైనా సమస్యలు ఉంటే మాకు ఫిర్యాదు చేయండి. విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని విశాల్ స్పష్టం చేశాడు. కేరళలో మహిళలను వేధించిన వారికి శిక్ష పడాల్సిందే. మహిళలకు అండగా నిలబడాల్సిన బాధ్యత ప్రతీ మగవారిపై ఉంటుందని సూచించాడు. మాలీవుడ్‌లో మహిళల లైంగిక వేధింపులతోపాటు పారితోషికాల్లో వివక్ష, షూటింగ్ లొకేషన్లలో కనీస సౌకర్యాల లేమితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని హేమ కమిటీ నివేదికలో పేర్కొంది.





# 'రాక్‌స్టార్' సినిమాను షాహిద్ చేయాలి అనుకున్న

## మీరా కపూర్

కెరీర్‌లో వరుస పరాజయాలు చవిచూసిన షాహిద్ కబీర్ సింగ్ రూపంలో చాలా రోజులకు బ్లాక్ బస్టర్ అందుకున్నాడు. 'అర్జున్ రెడ్డి' రీమేక్‌గా వచ్చిన ఈ చిత్రం బాలీవుడ్‌లో సూపర్ హిట్‌గా నిలిచింది. ఆ తర్వాత ఫర్జీ, 'జెర్సీ' వంటి సినిమాలతో దూసుకుపోతున్నాడు షాహిద్. అయితే షాహిద్ సతీమణి మీరా గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. రాజ్‌పుత్‌లో కుటుంబంలో పుట్టిన మీరా మోడల్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఇక షాహిద్‌తో పెళ్లి అయిన అనంతరం తన రంగంలో రాణించడంతో పాటు షాహిద్ కపూర్ కెరీర్‌లో తోడునీడగా ఉంటుంది. అయితే ఈ భామ ఒకప్పుడు చెప్పిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కరణ్ జోహర్ హోస్ట్ చేసిన కాఫీ విత్ కరణ్ షోలో పాల్గొన్న మీరా కపూర్ తన మనసులోని మాటను బయటనపెట్టింది. కరణ్ ఈ షోలో మీరాను అడుగుతూ.. షాహిద్ కపూర్ చేయాలనుకున్న సినిమాకి మీరా కపూర్ పేరు పెట్టాలి అంటే ఏం పేరు పెడతారు అంటూ అడిగాడు. దీనికి మీరా సమాధానమిస్తూ.. రాక్‌స్టార్ అంటూ సమాధానమిచ్చింది. రణ్‌బీర్ కపూర్ నటించిన రాక్‌స్టార్ సినిమా షాహిద్ చేయాలని ఉండేది. కానీ అది అవ్వలేదు అంటూ చెప్పుకొచ్చింది ఈ భామ. ఇక ఫ్యామిలీ విషయానికి వస్తే.. షాహిద్, మీరా కపూర్ 2015లో గురుగ్రామ్‌లో పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు.

# ఫ్లాప్ అయినా భలేగా కలెక్షన్లు

## ఆదిపురుష్‌పై దర్శకుడు ఓం రౌత్

రెబల్ స్టార్ ప్రభాస్, బాలీవుడ్ నటి కృతి సనన్ ప్రధాన పాత్రల్లో వచ్చిన చిత్రం ఆదిపురుష్ ఓం రౌత్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం భారీ అంచనాల నడుమ ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ వద్ద అట్టర్‌ఫ్లాప్‌గా నిలిచింది. ఇక ప్రభాస్ రాధేశ్యామ్ తర్వాత మరో డిజాస్టర్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. అయితే తాజాగా ఈ సినిమా డిజాస్టర్‌పై దర్శకుడు ఓం రౌత్ స్పందించాడు. ఆదిపురుష్ అభిమానుల అంచనాలను అందుకోలేక పోయిందని అయితే ఈ సినిమా ఫ్లాప్ అందుకున్న బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్స్ సాధించిందని తెలిపాడు. ఇక ఆదిపురుష్ విడుదలయిన అనంతరం తనపై వచ్చిన ట్రోల్స్‌పై స్పందిస్తూ.. సోషల్‌మీడియాలో ముక్కు, ముఖం తెలియని వాళ్లు చేసే ట్రోల్స్‌ను మనం పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదు. ఆదిపురుష్ బాక్సాఫీస్ వద్ద మంచిగా ఆడింది. ఈ సినిమా తొలిరోజే రూ.70 కోట్ల వసూళ్లను రాబట్టింది. ఓవరాల్‌గా రూ.400 కోట్లకు పైగా కలెక్షన్స్‌ను రాబట్టింది. ఇందులో తెలంగాణ. ఆంధ్రా నుంచే రూ.200 కోట్ల వరకు వచ్చాయి. దీన్ని బట్టి చెప్పవచ్చు ఈ సినిమా హిట్ అయ్యిందా అనేది అంటూ రౌత్ చెప్పుకోచ్చాడు.



Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com